మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 13.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 99 ‖ వెల (Price) రూ.6.50 | షష్ఠి

శనివారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-20. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: షష్ఠి ఉదయం 7-24 వరకు, తదుపరి సప్తమి తెల్లవారుజామున 5-03 వరకు. నక్షత్రం: కృత్తిక ఉదయం 10-11 వరకు, తదుపరి రోహిణి. వర్జ్యం: రాత్రి 1-09 నుంచి రాత్రి 2-39 వరకు. రాహుకాలం: ఉదయం 9-08 నుంచి ఉదయం 10-40 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-04 నుంచి ఉదయం 7-44 వరకు. అమృతకాలం: ఉదయం 7-57 నుంచి ఉదయం 9-26 వరకు. ఉత్తరా కార్తె పగలు 3-41 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి



- ప్రమాణం చేయించిన దేశాధ్యక్షుడు పౌడెల్
- ఎమర్జెన్సీ విధించే యోచన
- 6 నెలల్లోగా ప్రతినిధుల సభకు ఎన్నికలు

› 8

కల్లోల మణిపూర్‌కు 28 నెలల తర్వాత..



- ఎట్టకేలకు నేడు ప్రధాని పర్యటన
- మళ్లీ చెలరేగిన హింసాకాండ
- మోదీకి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన పోస్టర్లకు నిప్పు
- నిరసనకారులపై లాఠీచార్జి

› 8

ఈ నగరానికి ఏమైంది?

పట్టపగలే దారి దోపిడీ



శుక్రవారం మధ్యాహ్నం స్టీల్‌వ్యాపారి సిబ్బందిని దోచుకున్న తర్వాత పారిపోతుండగా సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయిన దుండగులు

డమ్మీ గన్ చూపించి 40 లక్షలు చోరీ

- కారులో వెళ్తున్న స్టీల్ వ్యాపారి సిబ్బందిపై దాడి
- కండ్లల్లో కారంకొట్టి.. నగదు లాక్కున్న ముఠా
- పారిపోతుండగా కారు బోల్తా.. శంకర్‌పల్లిలో ఘటన

హైదరాబాద్ సిటీబ్యూరో/శంకర్‌పల్లి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రేణు అగర్వాల్ ఘటన జరిగి రెండు రోజులు గడవక ముందే సైబరాబాద్ పరిధిలోని శంకర్‌పల్లిలో మరో దోపిడీ కలకలం రేపింది. పట్టపగలే కారులో వెళ్తున్న వ్యక్తులను దుండగులు అటకాయించి కండ్లలో కారం కొట్టి, బొమ్మ తుపాకీతో బెదిరించి దారిదోపిడీకి పాల్పడ్డారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన ట్రై కమిషనరేట్ల పరిధిలో తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన రాకేశ్ అగర్వాల్ స్టీల్ వ్యాపారి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు స్టీల్ పాత్రలు, ఇతర సామగ్రి సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో వ్యాపార లావాదేవీలకు సంబంధించి రూ.40 లక్షలు వికారాబాద్‌లోని కస్టమర్ నుంచి రావాల్సి ఉన్నది. వచ్చి డబ్బు తీసుకెళ్లాలని కస్టమర్ చెప్పడంతో రాకేశ్ అగర్వాల్ తన సిబ్బంది సాయిబాబా, మణిని కారులో వికారాబాద్ పంపాడు. వాళ్లు కస్టమర్ నుంచి రూ.40 లక్షలు తీసుకొని మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో నగరానికి తిరుగు › 6వ పేజీలో

నట్టనడి సిటీలో హత్య



కుషాయిగూడలోని మంగాపూరం కాలనీలో శుక్రవారం రియల్ ఎస్టేట్ వ్యాపారిని చంపిన అనంతరం నడుచుకుంటూ వెళ్తున్న దుండగులు

రియల్టర్‌ను పొడిచి చంపిన రౌడీషీటర్లు

- జనమంతా చూస్తుండగానే దారుణం
- కుషాయిగూడ మంగాపురంలో ఘటన
- మర్డర్ తర్వాత తాపీగా వెళ్లిన నిందితులు

హైదరాబాద్ సిటీబ్యూరో/చర్లపల్లి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాజధానిలో దుండగులు రెచ్చిపోయారు. ఓవైపు అందరూ చూస్తుండగానే రియల్ ఎస్టేట్ వ్యాపారిని రౌడీషీటర్లు కత్తితో దారుణంగా పొడిచి చంపారు. మరోవైపు స్టీల్ వ్యాపారుల కండ్లలో కారం కొట్టి రూ.40 లక్షలు దారిదోపిడీ చేశారు. నగరంలో రోజురోజుకూ పెట్రేగిపోతున్న నేరాలు, ఘోరాలతో ప్రజలు వణికిపోతున్నారు. శాంతి భద్రతలు కరువై భయాందోళన చెందుతున్నారు. సురక్షితమైన నగరంగా పేరున్న హైదరాబాద్‌లో నానాటికీ దిగజారుతున్న పరిస్థితులను తలచుకుంటూ మథనపడుతున్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన ఇంటి ఎదుటే దారుణ హత్యకు గురయ్యాడు. వ్యాపార లావాదేవీల విషయంలోనే ఈ ఘటన జరిగినట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేటకు చెందిన ఎం.శ్రీకాంత్‌రెడ్డి (42) కొన్నేండ్లుగా హౌసింగ్‌బోర్డు కాలనీ మంగాపురంలో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి ఏడేండ్ల క్రితం పెళ్లికాగా ఇద్దరు పిల్లలున్నారు. శాంతినగర్, లాలాపేట్, › 6వ పేజీలో

ఎల్లుండి నుంచి

కాలేజీలు బంద్!



సర్కారు నిర్లక్ష్యంపై సమరభేరి | ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందించేందుకు వచ్చిన ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు

‘ఫీజు రీయింబర్స్‌మెంట్’ బాకీ రూ.10 వేల కోట్లు

- ఒక్క రూపాయి విడుదల చేయని కాంగ్రెస్ సర్కార్
- ఈ నెలాఖరులోగా ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు
- రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) హెచ్చరిక
- 15 నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపు
- 16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు కూడా బంద్‌లోకి!

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. ప్రొఫెషనల్ కళాశాలలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వాటి యాజమాన్యాలు ఆందోళన బాటపట్టాయి. ఈ నెల 15 నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నెలాఖరులోగా ఫీజులు చెల్లించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డిని కలిసి నోటీసును అందజేశాయి. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విసిగి వేసారిన కాలేజీల యాజమాన్యాలు కళాశాలల మూసివేతకే నిర్ణయించాయి. విద్యాసంస్థలన్నింటికీ మూకుమ్మడిగా తాళాలు వేయాలని ఫతి ప్రతినిధులు నిర్ణయించారు. ఈ నెల › 5వ పేజీలో

పోలీసు ఉద్యోగార్థుల జంగ్ సైరన్..



- 20 వేల పోలీసు పోస్టులతో నోటిఫికేషన్‌కు డిమాండ్
- పోలీసు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాలు
- జిల్లాల్లో పోలీసు ఉద్యోగార్థులతో కలిసి ఐక్య కార్యాచరణ

› 5

నోటిఫికేషన్ల కోసం 15 నుంచి నిరాహార దీక్ష

› 5

- నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్
- ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చే దాకా విరమించనని ప్రకటన
- మద్దతు కోసం కేటీఆర్, హరీశ్‌ను కలుస్తానని వెల్లడి

నేడు గ్రూప్ -2 సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ -2 ఉద్యోగాల భర్తీలో భాగంగా శనివారం మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. శనివారం ఉదయం 10:30 గంటల నుంచి నాంపల్లి తెలుగు వర్సిటీలో వెరిఫికేషన్ జరుగుతుందని టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రియాంక తెలిపారు. రిజర్వ్‌డేగా ఈ నెల 15న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం https://www.tgpsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.




‘మేడారంలో అపచారం’ రాసినందుకు.. నమస్తే తెలంగాణపై చిందులు!

- మేడారం మాస్టర్‌ప్లాన్‌పై ఆదివాసీల అభిప్రాయాల్ని వెల్లడించినందుకు నిందలు
- స్థానిక నాయకులను ఉసిగొల్పి బెదిరింపులు
- నమస్తే తెలంగాణ కథనాలు అబద్ధమైతే మాస్టర్ ప్లాన్‌లో మార్పులెందుకు చేశారు?
- పూజారులు, ప్రతినిధులతో భేటీలెందుకు?

వరంగల్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మేడారం మహా జాతర నేపథ్యంలో కాంగ్రెస్ సర్కార్ తలపెట్టిన చర్యలు.. ప్రత్యేకించి తల్లుల గద్దెల కైవారం, ప్రాంగణం లోపల, బయట ఆధునికత, అందం పేరుతో రూపొందించిన కొత్త నమూనాలపై ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ విద్యార్థి సంఘాల్లో అభ్యంతరం వ్యక్తమైంది. వీటిపై ‘నమస్తే తెలంగాణ’ వరుస కథనాలు ప్రచురించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే కాకుండా ఇప్పుడు కూడా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా జరుగుతున్నదని ఆయా సందర్భాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ఏకరువు పెడుతూ సంబంధిత సంఘాల బాధ్యులు వ్యక్తంచేసిన అభిప్రాయాలనే ‘నమస్తే’ తన కథనాల్లో పేర్కొన్నది. అలాగే, › 2వ పేజీలో

మరో మూడు రోజులు వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం
- కరీంనగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి › 9



గర్భిణులకు కుళ్లిన కోడిగుడ్లు

› 7

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకూ పంపిణీ
- సీతక్క ఇలాకాలో ఘటన

యూపీఐ 10 లక్షల దాకా..

- పర్సన్-టు-మర్చంట్ రోజువారీ లావాదేవీల పరిమితి పెంపు › 11
- 15 నుంచి మార్పులు

‘ఎమ్మెల్యే చోరీ’.. మాట్లాడవేమి?

రాహుల్.. సిగ్గుపడు!



ఓటు చోరీ గురించి దేశవ్యాప్తంగా నీతులు చెప్తున్న రాహుల్‌గాంధీ, తెలంగాణలో ఎమ్మెల్యే చోరీ గురించి మాట్లాడకపోవడం దుర్మార్గం. రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక ప్రక్రియలో పాలుపంచుకున్నందుకు ఆయన సిగ్గుపడాలి. చట్టాలపై ఏ మాత్రం గౌరవమున్నా అనర్హత వేటును తప్పించుకొనేందుకు పార్టీ మారలేదని నిస్సిగ్గుగా బుకాయిస్తున్న బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల తీరుపై స్పందించాలి.

-కేటీఆర్

- ఆ ఎమ్మెల్యేలు కప్పుకొన్నది కాంగ్రెస్ కండువా కాదా?
- వాళ్లు మిమ్మల్ని కలవలేదా? ఆ అబద్ధాలను సమర్థిస్తరా?
- రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని నీతులు చెప్పడమా?
- రాహుల్.. మీరు చెప్తున్న ‘ఓటు చోరీ’ కంటే దారుణమిది
- ఫిరాయింపుల రాజకీయాలపై ద్వంద్వవైఖరి ఎందుకు?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ‘రాహుల్‌జీ..ఓట్ల చోరీపై జాతీయ స్థాయిలో గగ్గోలు పెడుతున్న మీరు..తెలంగాణలో ఎమ్మెల్యే చోరీపై ఎందుకు మౌనం వహిస్తున్నరు? పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యేను మీరు కలవలేదా? వారు మెడలో వేసుకున్నది కాంగ్రెస్ కండువాలు కాదా? బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వారు ఇప్పుడు పార్టీ మారలేదని చెప్తున్న అబద్ధాలను సమర్థిస్తారా? రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని ప్రవచనాలు వల్లించే మీకు ద్వంద్వ వైఖరి ఎందుకు?’ అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలవర్షం కురిపించారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల ఫొటోలను శుక్రవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ‘వీరిని మీరు గుర్తుపట్టడంలేదా? ఇది ఎమ్మెల్యేల చోరీ కాకుంటే ఇంకేంటి?’ అని నిలదీశారు. ‘మీరు జాతీయస్థాయిలో › 2వ పేజీలో

నిజాలు దాచి.. నిస్సిగ్గుగా బొంకి!

- అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఫిరాయింపు ఎమ్మెల్యేల పాట్లు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా స్పీకర్ నోటీసులకు జవాబు లేఖలు
- ఫిరాయింపులో నిజం లేదని అఫిడవిట్లు.. తమతోనే ఉన్నారన్న కాంగ్రెస్ నేతలు

› 2



“నేను ఎలాంటి హామీలు ఇవ్వను. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో నేను గెలుస్తానో లేదో తెలియదు, నేను గెలిచినా మా పార్టీ గెలుస్తుందో లేదో తెలియదు, ప్రభుత్వం ఉంటుందో లేదో తెలియదు..ఈ సంక్షేమ పథకాలు ఉంటాయో లేదో తెలియదు.. - జూపల్లి కృష్ణారావు

మా ప్రభుత్వం మళ్ల వస్తదో.. లేదో!

- నేను గెలిచినా.. మా పార్టీ గెలుస్తదో లేదో తెలియదు
- అందుకే నేను ఎలాంటి హామీలు ఇవ్వదలుచుకోలేదు
- ఆదిలాబాద్ పర్యటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ‘మా ప్రభుత్వం మళ్ల వస్తదో లేదో తెలియదు..నేను గెలుస్తానో లేదో కూడా తెలియదు. ఒకవేళ గెలిచినా..మా పార్టీ గెలుస్తదో లేదో తెలియదు..అందుకే నేను ఎలాంటి హామీలు ఇవ్వను’ అంటూ ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇందుకు సంబంధించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో గురువారం ఇందిరమ్మ నమూనా గృహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని, › 6వ పేజీలో

రైతు గోస చూపినందుకు.. టీ న్యూస్ ప్రతినిధిపై అక్రమ కేసు

- కొణిజర్లలో యూరియా కోసం పడిగాపులు
- కవరేజీకి వెళ్లిన జిల్లా రిపోర్టర్ సాంబశివరావు
- అడ్డుకుని వాగ్వాదానికి దిగిన కానిస్టేబుల్
- ఘటనతో సంబంధం లేని వ్యక్తితో ఫిర్యాదు
- కొణిజర్లలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు
- అణచివేతను ఖండించిన జర్నలిస్ట్ సంఘాలు
- యూరియా గోస చూపితే కేసులా?:కేటీఆర్
- జర్నలిస్టుల్ని భయపెడ్తరా?: హరీశ్‌రావు



కొణిజర్ల, సెప్టెంబర్ 12: సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టు ఇటీవల తలంటింది. అయినప్పటికీ ప్రభుత్వ తీరులో ఏమాత్రం మార్పు రావడం లేదు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నది. రెండుమూడు నెలలుగా రాష్ట్రాన్ని యూరియా కొరత పట్టి పీడిస్తున్నది. అన్నదాతలు పగలు రాత్రి తేడా లేకుండా సహకార సంఘాల ఎదుట బారులు తీరుతున్నారు. లైన్లలోనే కొందరు రైతులు సొమ్మసిల్లి పడిపోతున్నారు. మరి కొందరు యూరియా కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వం యూరియాపై ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదు. రైతులను వారి మానాన వారిని వదిలివేసింది. దీంతో అన్నదాతలకు క్యూలలో పడిగాపులు తప్పడం లేదు. దీంతో వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు వెళ్లిన టీన్యూస్ రిపోర్టర్‌పై ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేసి తమ › 2వ పేజీలో



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని రైతువేదిక వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కొరతపై కన్నెర్ర

- పలుచోట్ల రోడ్డెక్కిన రైతులు
- సుద్దాలలో పురుగుమందు డబ్బాతో అన్నదాత ఆందోళన
- కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంపై రాయపర్తిలో రాస్తారోకో
- ఎర్రబెల్లి సహా నేతల అరెస్ట్

› 9



నేడు గద్వాలకు కేటీఆర్

తేరు మైదానంలో బహిరంగ సభ • పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లోకి చేరికలు

భారీగా పార్టీ శ్రేణులను తరలించే ఏర్పాట్లు • గులాబీ సభపై చర్చలు.. కాంగ్రెస్‌లో గుబులు

అడ్డుకునేందుకు ఎమ్మెల్యే వర్గం ఎత్తుగడలు • తిప్పి కొట్టిన బీఆర్ఎస్ నేతలు



గద్వాల జిల్లా కేంద్రంలో కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/గద్వాల : గద్వాల జిల్లా కేంద్రానికి శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫాంతో పోటీచేసి గెలిచాక పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా.. అధికార పార్టీకి పెద్ద ఎత్తున పలువురు నాయకులు గుడ్‌బై చెప్పి కేటీఆర్ సమక్షంలో కారెక్కనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని తేరు మైదానంలో జరిగే గద్వాల గర్జన సభ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. సభకు జిల్లా వ్యాప్తంగా గులాబీ శ్రేణులను తరలించే పనిలో నాయకులు నిమగ్నమయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు, సాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ నేతృత్వంలో పార్టీ నేతలు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రం గులాబీమయమైంది. ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాల వరకు గులాబీ జెండాలు బ్యానర్లు, ఫ్లెక్సీలతో నింపేశారు.

ఎమ్మెల్యే బండ్ల అధికార పార్టీలోకి చేరడంపై స్థానిక పార్టీ కార్యకర్తలంతా తిరుగుబాటుచేశారు. ముఖ్యమైన నేతలతోపాటు ఎవరూ ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్‌లో చేరలేదు. సొంత క్యాడర్‌ను కాపాడుకుంటున్న గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడుకు పార్టీ పగ్గాలు అప్పగించింది. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, సాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ గద్వాలలో పార్టీని కాపాడుకుంటూ వచ్చారు. ఇటీవల పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై వేటు తప్పదన్న నేపథ్యంలో ఎమ్మెల్యే అనుచరులంతా తిరిగి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా అంతర్గత ప్రజాస్వామ్యం లేదని, ఎవరికి వారే గ్రూపులుగా మారిపోయి, తమ రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడంతో చాలా మంది పార్టీని వీడుతున్నారు. దీంతో కాంగ్రెస్ నేతల్లో గుబులు మొదలైంది. గద్వాలలో కేటీఆర్ సభను కనీవిని ఎరుగని రీతిలో నిర్వహిస్తామని బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రకటించారు. మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యే సభను విఫలం చేసేందుకు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ప్రారంభించినా ఎక్కడికక్కడే గులాబీ కార్యకర్తలు కౌంటర్ ఇచ్చారు.

కేటీఆర్ పర్యటన వివరాలు

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైదరాబాద్ నుంచి శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు గద్వాలకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 3:30 గంటలకు గద్వాలకు వచ్చి, ధరూర్ మెట్ నుంచి ర్యాలీగా తేరు మైదానానికి చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు.

లోకం పోకడ



ఆయన తిరిగి వస్తాడో, రాడో నమ్మకం లేదయ్యా.. ఇక కొత్త హామీలు ఇవ్వదల్చుకోలేదు!

ఎమ్మెల్యే చోరీ మాట్లాడవేమి?

మొదటిపేజీ తరువాయి...

లేవనెత్తుతున్న ఓటు చోరీ కంటే ఇది దారుణమైన నేరం' అని స్పష్టంచేశారు. తెలంగాణలో ఎమ్మెల్యే చోరీపై రాహుల్‌గాంధీ సిగ్గుపడాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బుకాయిస్తున్న ఫిరాయింపుదారుల తీరుపై స్పందించాలని డిమాండ్ చేశారు. నిర్లజ్జగా ఫిరాయింపు రాజకీయాలు చేస్తూ ప్రజాస్వామ్యానికి కాంగ్రెస్ తలవంపులు తెస్తున్నందుకు రాహుల్ తలదించుకోవాలని విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యంపై నమ్మకంటే పార్టీమారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చోటే భాయ్‌కి బడే భాయ్ పహారా

తెలంగాణలోని చోటే భాయ్‌కి ఢిల్లీలోని బడే భాయ్ పహారా కాస్తున్నారని కేటీఆర్ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ సీఎంకు చీమకుట్టకుండా బీజేపీ కాపాడుతున్నదని దుయ్యబట్టారు. ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా రేవంత్‌రెడ్డి ఎన్ని స్కాంలకు పాల్పడ్డా బీజేపీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని దెప్పిపొడిచారు. గ్రూప్-1 అవకతవకలపై ఆ పార్టీ స్పందించకపోవడమే నిదర్శనమని విమర్శించారు. పరీక్ష రద్దుచేయాలని హైకోర్టు ఆదేశించినా బీజేపీ రాష్ట్ర నేతలు నోర్లెందుకు తెరవడంలేదని నిలదీశారు. 'విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసి, నేరపూరిత నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్‌ను వెనకేసుకు రావడంలో ఆంతర్యమేమిటి? పరీక్షలు రద్దు చేయాలని నిరుద్యోగలోకం గగ్గోలు పెడుతుంటే మౌనమెందుకు?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చీటికి మా టికీ సీబీఐ విచారణ చేయించాలని ఒంటికాలిపై లేచిన ఆపార్టీ నేతలు కాంగ్రెస్ స్కాంలపై ఎందుకు సీబీఐ విచారణ కోరడంలేదని నిలదీశారు. గ్రూప్-1 ఉదంతమే రేవంత్-బీజేపీల రహస్య మైత్రికి తాజా ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

నిజాలు దాచి.. నిస్సిగ్గుగా బొంకి!

- వేటు నుంచి తప్పించుకునేందుకు ఫిరాయింపు ఎమ్మెల్యేల పాట్లు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా స్పీకర్‌కు జవాబు లేఖలు
- ఫిరాయింపులో నిజం లేదని అఫిడవిట్లు
- వారు తమతోనే ఉన్నారన్న కాంగ్రెస్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే నోటికి అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునేందుకు వారు పడుతున్న ఆపసోపాలు చూసి జనం విస్తుపోతున్నారు. నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి వేలాడుతున్న చట్టం కత్తి నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఏడాదిన్నరగా తెలంగాణ భవన్ తొక్కని, మెడలో గులాబీ కండువా వేసుకోని ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని బొంకుతున్నారు. కోర్టులను బురిడీ కొట్టించేందుకు యత్నిస్తున్నారు. వీరి కుయుక్తులను ముందే పసిగట్టిన బీఆర్ఎస్ సాక్ష్యాధారాలను సుప్రీంకోర్టు ముందుంచింది. దీంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తప్పేలా కనిపించడం లేదు. అదే జరిగితే ఉప ఎన్నికలూ తప్పవు. ఉప ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, నేతలకు కర్రుకాల్చి ఎప్పుడు వాత పెడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. తామింకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని కూనిరాగాలు తీస్తున్నారు.

పదిమంది మాతోనే: మంత్రి కోమటిరెడ్డి

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో నిండు శాసనసభలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి 39 మంది ఎమ్మెల్యేలు గెలిచినా ఇప్పుడు వారికి ఉన్నది 28 మందేనని, పదిమంది తమవైపు వచ్చేశారని, ఇంకా వస్తారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు రికార్డుల్లో భద్రంగా ఉన్నాయి. అన్ని పత్రికల్లోనూ ఈ వార్త వచ్చింది.

అప్పుడో మాట.. ఇప్పుడో మాట

ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా స్వయంగా తాము కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నట్టు పేర్కొన్నారు. అధికారిక వేదికలను కూడా కాంగ్రెస్‌తోనే పంచుకున్నారు. పార్టీ మారిన తర్వాత బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశానికి వారు ఏనాడూ హాజరు కాలేదు. పార్టీ సభలు, సమావేశాల్లోనూ పాల్గొనలేదు. పార్లమెంటు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశాలకు హాజరయ్యారు. వీరు పార్టీ మారకుంటే సీఎల్పీకి ఎందుకు వెళ్లినట్టు అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

సొంత నియోజకవర్గాల్లో కుంపట్లు!

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తమ నియోజకవర్గాల్లోని అసలు కాంగ్రెస్ నేతలతో పొసగడం లేదు. జగిత్యాల ఫిరాయింపు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను చేర్చుకోవద్దంటూ మాజీమంత్రి టీ జీవన్‌రెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ చెప్పారు. అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేశారు. కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని గద్వాల నేతలు వ్యతిరేకిస్తున్నారు. అక్కడి నేత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరితాయాదవ్ నేటికీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. తనకు తాను సచ్ఛీలుడినని చెప్పుకునే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి తాను పార్టీ మారలేదని స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కానీ, బాన్సువాడలో అక్కడి కాంగ్రెస్ సీనియర్ నేత బాలరాజు, పోచారంపై పోటీచేసి ఓడిపోయిన ఏనుగు రవీందర్‌రెడ్డి పోచారాన్ని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని చేసిన డిమాండ్లను ఎవరూ దాచిపెట్టలేరు. అక్కడ రగులుతున్న కాంగ్రెస్ క్యాడర్ పోచారాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని అక్కడి సీనియర్ నేత, కడియంపై పోటీ చేసి ఓడిపోయిన ఇందిర తీవ్రంగా వ్యతిరేకించారు. భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని అక్కడి సీనియర్ నేత పొదెం వీరయ్య వ్యతిరేకించడం నిజం కాకుండా పోదు. ఇలా చెప్పుకుంటూ పోతే కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ నేతలను అడిగితే వీరు కాంగ్రెస్ పార్టీలో చేరారా? లేదా? అన్నది చెప్తారు.

వారిని చేర్చుకున్నాం: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్

'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైంది. పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నాం. మా పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి వారు వచ్చి చేరుతామంటే చేర్చుకున్నాం' అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ టీవీ9 చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

అది కాంగ్రెస్ కండువా కాదా?

ఫిరాయింపు ఎమ్మెల్యేలు విచిత్రమైన వాదన వినిపిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా వ్యవహరించిన దీపాదాస్, మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు తమ మెడలో కప్పింది కాంగ్రెస్ కండువా కాదని, అది మూడు రంగుల జెండా మాత్రమేనని పచ్చి అబద్ధం చెప్తున్నారు. జాతీయ జెండాను ఎవరైనా మెడలో కప్పుతారా? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటినీ చూస్తుంటే తమను ఓటేసి గెలిపించిన ఓటర్లు, ప్రజలు, న్యాయవ్యవస్థ పట్టించుకోదన్న గుడ్డి నమ్మకంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్నట్టు తెలుస్తున్నది.

దింపుడుకల్లం ఆశలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు

- నోట్ల కట్టలతో దొరికినా.. పార్టీ మారినా తప్పించుకోలేరు
- కండువా జాతీయ జెండా అంటే దేశాన్ని అవమానించడమే
- ప్రజలు అసహ్యించుకుంటున్నారు.. సిగ్గుతో తలదించుకోండి: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పార్టీ మారి పరువు పోగొట్టుకుని, పదవి పోతుందనే భయంతో దింపుడు కల్లం ఆశతో ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల కుంటి సాకులపై ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఇచ్చి న సమాధానంలో పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటని, దీనిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. సీఎంను కలిసింది నియోజకవర్గ అభివృద్ధి కోసమే అని, రేవంత్ కప్పింది పార్టీ జెండా కాదు జాతీయ జెండా అని చెప్పడం జాతీయ జెండాను అవమానించడమేనని తెలిపారు. పార్టీ మారకపోతే బీఆర్ఎస్ కార్యాలయానికి ఎందుకు రావడంలేదని, నోటీసులు వచ్చినప్పుడు కేసీఆర్ దగ్గరకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.9°c	23.0°c
రంగారెడ్డి	30.6°c	19.7°c
ఖమ్మం	30.0°c	23.0°c
వరంగల్	30.0°c	23.0°c
నల్లగొండ	29.5°c	23.0°c
కరీంనగర్	29.0°c	25.0°c
మెదక్	28.6°c	22.5°c
హైదరాబాద్	28.1°c	20.8°c
మహబూబ్‌నగర్	28.0°c	23.0°c
నిజామాబాద్	27.9°c	22.6°c



ముత్తిరెడ్డిగూడెంలో గాయాలపాలైన పీట్ల రాజు

ప్రాణాల మీదకు తెచ్చిన ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇల్లు వస్తుందని అప్పులు తెచ్చిన లబ్ధిదారు

ఇల్లు వస్తలేదని తనకుతానే కొట్టుకున్న లబ్ధిదారు

యాదాద్రి జిల్లా ముత్తిరెడ్డిగూడెంలో ఘటన

మోటకొండూర్, సెప్టెంబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ఓ కుటుంబం ప్రాణాల మీదకు తెచ్చింది. వివరాల్లోకి వెళ్తే... యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెంకు చెందిన పీట్ల సుశీలరాజు ఇందిరమ్మ ఇల్లు పథకానికి లబ్ధిదారుగా ఎంపికయ్యారు. ఇల్లు మంజూరు కావడంతో అప్పులు చేసి, భార్య తాళి కుదువపెట్టి ఇంటి నిర్మాణం చేపట్టారు. పైకప్పు వేసి, గోడల్ని లేపి కుటుంబంతో ఆనందంగా అడుగు పెట్టాలని కలలుగన్నారు. ప్రభుత్వం మొదటి విడుతగా సుశీలరాజు ఖాతాలో రూ.లక్ష జమ చేసింది. రెండో విడుత నగదు జమకావాల్సి ఉండగా అధికారులు వచ్చి 'నీకు ఇల్లు రాదు' అని చెప్పారు. దీంతో తట్టుకోలేకపోయిన రాజు తీవ్ర ఆవేదనతో శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తనను తానే కొట్టుకోవడంతో తలపై తీవ్ర గాయమైంది. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా.. లబ్ధిదారుల పేరుపై ఎలాంటి ఆస్తి, వస్తువు లేదని చూపించడంతో మొదటి పేమెంట్ వచ్చిందని, లబ్ధిదారులపై ఆరు సంవత్సరాల క్రితం ఒక వాహనం నమోదయిందనే కారణంతోనే పేమెంట్ బ్లాకయిందని తెలిపారు. చాడ గ్రామానికి చెందిన కోత్రోజు కృష్ణకు ఇలాంటి సమస్య రావడంతో తమ పేరుపై ఉన్న వాహనాలను ఇతరులపై నమోదుచేయించుకుని లబ్ధి పొందారని అధికారులు తెలిపారు.

..టీ న్యూస్ ప్రతినిధిపై అక్రమ కేసు

మొదటిపేజీ తరువాయి...

దమన నీతిని చాటుకున్నారు. గురువారం కొణిజర్ల పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా పంపిణీ జరగ్గా వందల మంది రైతులు అక్కడికి చేరుకుని యూరియా కోసం గంటలకొద్దీ నిరీక్షించారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల తల్లులు సైతం క్యూలో ఇబ్బందిపడ్డారు. వీరి బాధలను లైవ్‌లో చూపించేందుకు టీన్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి సాంబశివరావు ప్రయత్నించారు. దీంతో రైతులు తమ సమస్యలను ఏకరవు పెట్టేందుకు వరుసకట్టారు. ఇది గమనించి అక్కడే ఉన్న ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ హరీశ్ టీన్యూస్ ప్రతినిధికి అడ్డుతగులుతూ తన మొబైల్ ఫోన్‌తో సాంబశివరావును వీడియో తీయడం ప్రారంభించాడు. అది చూసిన సాంబశివరావు తనను ఎందుకు వీడియో తీస్తున్నావని కానిస్టేబుల్‌ను ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో జనం రద్దీలో కానిస్టేబుల్ మొబైల్ కిందపడింది. దీనికి నువ్వు కారణమంటే, నువ్వు కారణమంటూ ఇద్దరూ స్థానిక పోలీసుల దృష్టికి ఈ ఘటనను తీసుకెళ్లారు. వారు ఇద్దరికీ సర్దిచెప్పి పంపించేశారు.

సంబంధం లేని వ్యక్తితో ఫిర్యాదు

ఆ తర్వాత కాసేపటికి ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తితో టీన్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై కేసు నమోదు చేయించినట్టు తెలిసింది. దీనిపై మీడియా సభ్యులు వివరణ కోరగా పోలీసులు స్పందించలేదు. పోలీసులు నోరు మెదపనప్పటికీ కేసు నంబర్ 259/2025, సెక్షన్151, 196, 353(2), రెడ్‌విత్ 3(5), బీఎన్ఎస్ -2023(124, 153ఎ, 505, రెడ్‌విత్ 34 ఐపీసీ) ప్రకారం సాంబశివరావుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిసింది.

అక్రమ కేసుపై ఆగ్రహజ్వాల

జర్నలిస్టు సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని జర్నలిస్టు సంఘాల, రాజకీయ నాయకులు ఖండించారు. సాంబశివరావుపై కేసు నమోదు చేయడం నిరంకుశ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిప్పులు చెరిగారు. జర్నలిస్టులను వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని, మీడియా స్వేచ్ఛను అణచివేయడం సరికాదని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంబశివరావుపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాంబశివరావుపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, టెంజు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణకుమార్ ఖండించారు. ఖమ్మం జిల్లా టీన్యూస్ జర్నలిస్టు సాంబశివరావుపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, ఉద్యమనాయకుడు, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

యూరియా కష్టాలను చూపితే కేసులా?: కేటీఆర్



రైతులు యూరియా కోసం పడుతున్న కష్టాలను చూపిన ఖమ్మం జిల్లా టీ న్యూస్ జర్నలిస్టుపై అక్రమం కేసు పెట్టిన పోలీసులు, ప్రభుత్వ వైఖరిని కేటీఆర్ ఖండించారు. రైతుల సమస్యలను పరిష్కరించే సమయంలో వేధించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అన్నదాతల సమస్యలను పట్టించుకోని పాలకులు, వాటిని బహిర్గతం చేసిన జర్నలిస్టులను, మీడియాను బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ కేసులు కాంగ్రెస్ సర్కారు నిరంకుశ ధోరణి, ఇందిరమ్మ పోలీస్ రాజ్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజాసామ్యంలో మీడియా స్వేచ్ఛ ముఖ్యమని వ్యాఖ్యానించారు. సాంబశివరావుపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అణచివేతలతో జర్నలిస్టులను భయపెడతారా?: హరీశ్‌రావు



రైతుల యూరియా కష్టాలను కండ్లకు కట్టినట్టు చూపిస్తున్న జర్నలిస్టులను అణచివేయడం, అక్రమ కేసులతో వేధించడం దుర్మార్గమని హరీశ్‌రావు పేర్కొన్నారు. అన్నదాతల ఎరువుల వెతలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు యత్నించిన ఖమ్మం టీ న్యూస్ విలేకరి సాంబశివరావుపై అక్రమ కేసు బనాయించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను వెలుగులోకి తెచ్చేందుకు యత్నించిన విలేకరులపై ఉల్టా కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శాంతిభద్రతల నిర్వహణను పక్కనబెట్టి ప్రజల గొంతునొక్కడం శోచనీయమని అన్నారు. సాంబశివరావుపై పెట్టిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



సిగ్గూశరం ఉంటే రాజీనామా చేయండి

వ్యాపారాలకే కాంగ్రెస్‌లో చేరిండ్రు

పార్టీ మారితే రేవంత్ రాళ్లతో కొట్టి చంపాలన్నడు

మిమ్మల్ని ఇప్పడేంచెయ్యాలో చెప్పండి

ఎమ్మెల్యే మాధవరం మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఫిరాయింపు ఎమ్మెల్యేలు సిగ్గూశరం ఉంటే పదవులకు రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకు వెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సవాల్ చేశారు. కనీసం పార్టీ మారినట్టు కూడా చెప్పుకోలేని దుస్థితిలో వాళ్లు ఉన్నారని ఎద్దేవాచేశారు. ఓల్డ్‌బోయిన్‌పల్లిలో శుక్రవారం మదర్సా ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ తాను టీడీపీ నుంచి టీఆర్ఎస్‌లోకి వచ్చినప్పుడు బహిరంగంగా చెప్పి టీఆర్ఎస్ కండువా కప్పుకొన్నానని గుర్తుచేశారు. అదే కండువాతో గ్రేటర్ ఎన్నికల్లో 8 మంది కార్పొరేటర్లను గెలిపించుకున్నామని చెప్పారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వాళ్లు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకొంటున్నారని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్‌లోనే ఉంటే అసెంబ్లీలో తమ పక్క సీట్లలో ఎందుకు కూర్చోలేదని ప్రశ్నించారు. ఉదయం లేస్తే రేవంత్‌రెడ్డి పాట పాడుతూ తిరిగేవాళ్లు ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకోవడం దుర్మార్గమని ఫైర్ అయ్యారు. ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే వారిని మోసం చేసి ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఫిరాయింపుదారులపై విజయం సాధించిందని, కోర్టు మొట్టికాయలు వేసేసరికి ప్లేటు ఫిరాయిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో రేవంత్‌రెడ్డి ఎవరైనా పార్టీ మారితే వాళ్లను రాళ్లతో కొటి చంపండని ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. 'మరి అలాంటి వ్యక్తి పార్టీలోనే మీరున్నరు. మిమ్మల్ని ఏం చేయాలో మీరే చెప్పండి' అని ఫిరాయింపు ఎమ్మెల్యేలను నిలదీశారు. 'ప్రజలే దేవుళ్లని మీరు అనుకుంటే మీరు కాంగ్రెస్‌లోకి వెళ్లినట్టు ఒప్పుకోవాలి' అని డిమాండ్ చేశారు. 'మిమ్మల్ని చిన్న పిల్లలు కూడా నమ్మరు.. మీరు కాంగ్రెస్‌లోకి వెళ్లారని పిల్లాడినడిగినా చెప్తరు.. మీరు కాంగ్రెస్‌లోకి వెళ్లకుంటే బీఆర్ఎస్ కార్యక్రమాలకు ఎందుకు రావడం లేదు? మీ మోసాలను ప్రజలు క్షమించరు. మీకు కచ్చితంగా బుద్ధి చెప్తరు. న్యాయస్థానాల్లో మీకు శిక్ష తప్పదు' అని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణపై చిందులు!

మొదటిపేజీ తరువాయి...

మేడారం మాస్టర్ ప్లాన్ నేపథ్యంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్నది. ఇది గిట్టని ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులు కొందరు నమస్తే తెలంగాణ పత్రికపై, కథనాలు రాసిన విలేకరులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రములో స్థానిక మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్‌దొర సహా మరికొందరు నాయకులు మీడియా సమావేశం నిర్వహించి నమస్తే తెలంగాణపై అక్కసు వెళ్లగక్కారు. అబద్ధపు వార్తలు రాయడం మానుకోవాలని, లేదంటే సమ్మక్క-సారలమ్మ తల్లుల శాపం తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. మరోవైపు, తమ జాతి ఆడబిడ్డ, మంత్రి సీతక్క ఉండగానే తమ సంస్కృతికి విఘాతం కలిగితే పరిస్థితి ఏమిటని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, ఏఎస్‌యూ (ఆదివాసీ విద్యార్థి యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి సహా పలువురు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్‌లో సమ్మక్క-సారలమ్మ గద్దెల కైవారం, ప్రాంగణంలో సాంచీ స్థూపం ఆనవాళ్లా? అని ప్రశ్నించారు. దీనినే నమస్తే తెలంగాణ ప్రముఖంగా ప్రచురించిన విషయం తెలిసిందే.

మాస్టర్ ప్లాన్‌పై మల్లగుల్లాలు నిజం కాదా?

మేడారం మాస్టర్ ప్లాన్‌పై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతున్నది. జూలై 3న దేవాదాయశాఖ రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను మేడారంలో నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా పూజారులు, ఆదివాసీ సంఘాలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. మేడారం మహాజాతర సందర్భంగా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులపై ఎటువంటి పేచీ లేకపోయినా మేడారం గద్దెల కైవారం, ప్రాంగణంలో రూపొందించిన కొత్త డిజైన్‌పై ఇందులో వ్యతిరేకత వ్యక్తమైంది. దేవాదాయ శాఖ రూపొందించిన కొత్త నమూనా (డిజైన్)లో వలయాకారంలో రాతిపీఠం, శిలాస్థంభాలు కాకతీయ కీర్తితోరణాలను పోలి ఉండటంతో ఆదివాసీలు అభ్యంతరం పెట్టారు. ఇదే విషయాన్ని జూలై 6న నమస్తే తెలంగాణ 'మేడారంలో అపచారం!' ఆధునికత పేరుతో సంస్కృతి విచ్ఛిన్నానికి సహించం' పేరుతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ తరువాత దేవాదాయ శాఖ మరో గద్దెల ప్రాంగణానికి మరో నమూనాను రూపొందించింది. గతంలో అభ్యంతరం తెలిపిన నమూనా స్థానంలో కొత్త రూపాన్ని ఇచ్చింది. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలను వరుసగా ఉండేలా శిలా నమూనాలను రూపొందించింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ సహా ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో దీనిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 4వ తేదీన 'మేడారంలో మరో అపచారం!' అనే కథనాన్ని ప్రచురించింది. సర్కార్ రూపొందించిన నమూనాలో సాంచీస్థూపం ఆనవాళ్లు ఉన్నాయని, అది తమ ఆచార సంప్రదాయాలకు విరుద్ధమని పూజారులు, తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం సహా పలువురు మేధావులు ఆక్షేపించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 10న 'మేడారంలో సాంచీ స్థూపం ఆనవాళ్లు?' అనే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రచురితమైన తెల్లారే మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పూర్తిగా ఆదివాసీ, సంస్కృతి సంప్రదాల ప్రకారమే జాతర నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఆ కథనాన్ని కూడా నమస్తే తెలంగాణ ప్రచురించింది. గురువారం మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం మాస్టర్ ప్లాన్ ఇంకా తుదిరూపు దాల్చలేదని, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, సమ్మక్క-సారలమ్మ పూజారుల విశ్వాసాలు, లక్షలాదిమంది భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే డీపీఆర్ ఫైనల్ చేస్తామని ప్రకటించిన విషయాన్ని శుక్రవారం నమస్తే తెలంగాణ ప్రచురించింది.

ఆదివాసీ గొంతుకగా అక్షరబద్ధం

మేడారం మహాజాతర నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం రూపొందించిన కొత్త డిజైన్ల (నమూనాలను)ను పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించారు. సమీక్ష జరుగుతున్న సమయంలోనే ఈ నమూనాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఆ తరువాత చోటుచేసుకున్న పరిణామాలనే నమస్తే తెలంగాణ ఆదివాసీ గొంతుకగా అక్షరబద్ధం చేసింది.



మేడారం గద్దెల వద్ద ఆదివాసీ ప్రతినిధుల నిరసన నేపథ్యంలో అధికారులను ప్రశ్నిస్తున్న సీతక్క (ఫైల్)

నాడు సీతక్క నిరసననూ లోకానికి చెప్పిన 'నమస్తే'

ఆధునీకరణ పేరుతో మేడారం జాతరలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెస్తున్న మార్పులను అడ్డుకట్టవేయాల్సిన ఆదివాసీ బిడ్డ, మంత్రి సీతక్క మౌనం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆదివాసీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేసిన విషయాన్ని ప్రచురించిన నమస్తే తెలంగాణ.. 2012 జాతర సందర్భంగా నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి గద్దెల ప్రాంగణం ఆవల డప్పు కొట్టినట్టు ఫొటోకు పోజులిస్తే 'సీఎం అలా చేయడం మా సంప్రదాయాలకు విరుద్ధం' అని వారించిన సీతక్క అభిప్రాయం, గద్దెల వద్ద పోలీసు కళాజాతపై ఆదివాసీల నిరసన ఫొటోలను నమస్తే తెలంగాణ ప్రచురించింది.

ఓవైపు జీరో బిల్లులు.. మరోవైపు ఎరియర్స్ బాదుడు



రాంచంద్రాపురం గ్రామంలో నర్సయ్యకు వచ్చిన కరెంటు బిల్లు (జీరో బిల్లు చూపుతూనే రూ.6304 ఎరియర్స్ కట్టాలని వచ్చిన బిల్లు)

దేవరుప్పుల, సెప్టెంబర్ 12 : ఓ వైపు ట్రాన్స్‌కో వినియోగదారులకు జీరో బిల్లులు పంపుతూనే మరో వైపు ఎరియర్స్ పేర వేల రూపాయలు బకాయిలు ఉన్నారని, అవి కట్టాలంటూ బలవంతం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని ప్రకటించింది. కొద్ది నెలల నుంచి కొందరికి జీరో బిల్లు అమలవుతున్నది. ఇంతలోనే విద్యుత్ శాఖకు కొత్త ఆలోచన వచ్చింది. జీరో బిల్లు వస్తున్న వారంతా ఎరియర్స్ పేర వేలాది రూపాయలు కట్టాలని బిల్లులు పంపుతున్నారు. పైన జీరో బిల్లు చూపుతూనే కింద ఎరియర్స్ బాకీ చూపుతున్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలవ్యాప్తంగా వందలాది మంది జీరో వినియోగదారులకు వేలాది రూపాయలు ఎరియర్స్ పేర బకాయిలు చూపడం చర్చనీయాంశమైంది. నెలల కొద్దీ జీరో బిల్లులు పంపి తీరా వేలాది రూపాయలు బకాయిలు ఉన్నట్టు పంపడం తగదని, తాము గతంలో చెల్లించిన నెలవారీ బిల్లులు కూడా ఇంత రాదని వినియోగదారులు వాపోతున్నారు.





65వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ముట్టడి



చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

చౌటుప్పల్, సెప్టెంబర్ 12 : రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. జిల్లా పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, వలిగొండ మండలాల్లోని వివిధ గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులు పెద్ద ఎత్తున ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా 'ట్రిపుల్ ఆర్ వద్దురా..వ్యవసాయ భూములే ముద్దురా' అని రైతులు నినాదాలు చేశారు. ప్రాణాలైనా వదులుకుంటాము గానీ భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీవో శేఖర్ రెడ్డికి అలైన్‌మెంట్ మార్చాలని వినతి పత్రం సమర్పించారు. 65వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తుండగా రైతులు, నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది.

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం: ప్రభాకర్ రెడ్డి

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి..ఆయన తమ్ముడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బడా పరిశ్రమ మేతకోసం ఆశపడి ఇక్కడి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భూనిర్వాసితులకు బహిరంగ మార్కెట్ కన్నా మూడు రెట్లు పరిహారం ఎక్కువ ఇవ్వాలని, లేదంటే గోల్డెన్ ఫారెస్ట్ భూములను కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

కాళేశ్వరం నివేదిక కోర్టులో నిలవదు



రామవరం చంద్రశేఖర్‌రెడ్డి
81430 09999

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రణాళిక రూపకల్పన, నిర్మాణంలో నిర్లక్ష్యం, అవకతవకలు, లోపాలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిపై విచారించి బాధ్యులను గుర్తించాలని కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం-1952 ప్రకారం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2024 ఏప్రిల్ 27న ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీస్ జారీచేసింది. ప్రజలు తమ అభ్యంతరాలు, ఆరోపణలను వాంగ్మూలాల రూపంలో కమిషన్‌కు సమర్పించాలని కోరింది. కమిషన్ మొత్తం 15 నెలల్లో 119 మంది సాక్షులను విచారించి, 110 మంది వాంగ్మూలాలను రికార్డ్ చేసింది. సంబంధిత నివేదికను 2025 జూలై 31న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. నిర్మాణం, క్వాలిటీ కంట్రోల్ మీదనే తుది నివేదిక సమర్పించింది. జాతీయ డ్యాం భద్రతా విభాగం ఇచ్చిన నివేదిక మీదనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఈ కమిషన్ సూచించింది.

2025 ఆగస్టు 4న ముఖ్యమంత్రి, మంత్రులు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి, గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవమానకరంగా, తన పరువుకు భంగం కలిగించేలా మాట్లాడారని, పక్షపాతంగా, చట్ట విరుద్ధమైన తీరులో మాట్లాడారని, ఈ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ తన పరువుకు నష్టం కలిగేలా వ్యాఖ్యలు చేశారని, ఈ నివేదిక ప్రతిని తనకు ఇవ్వకుండా నివేదికలోని అంశాలను బహిర్గతం చేయడం చట్ట విరుద్ధమని, తనకు ఈ నివేదిక ప్రతిని అందించాలని 2025 ఆగస్టు 8న రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి కోరారు. కమిషన్ నివేదిక తనకు ఇవ్వకుండా అందులోని అంశాలపై సామాజిక మాధ్యమాల్లో చర్చ జరపడం వల్ల తన వ్యక్తిగత భద్రతకు భంగం కలుగుతున్నదని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

ఏ విచారణ అయినా సహజ న్యాయ సూత్రాలకు, చట్టాలకు లోబడి జరగాలి. అట్లా జరగని పక్షంలో ఆ విచారణకు ఎలాంటి విలువ ఉండదు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం-1952 ప్రకారం ప్రభుత్వాలకు సంబంధిత అంశం మీద విచారణ చేసే హక్కు ఎంత ఉందో, విచారణను ఎదుర్కొనే పౌరులు, అధికారులు, నాయకులు ఎవరైనా సరే వారికి కూడా ఏకపక్ష విచారణల నుంచి తమను తాము రక్షించుకునే హక్కు ఉంది. చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం విచారణ కమిషన్‌కు సాక్షులను పిలిచి, ఆధారాలు సేకరించే అవకాశం ఉంది. విచారణ వల్ల ఎవరి ప్రతిష్ఠకైతే భంగం వాటిల్లుతుందో వారు తమ ప్రతివాదనలు వినిపించడానికి అదే చట్టంలోని సెక్షన్ 8(బీ) ప్రకారం నోటీసులు ఇవ్వాలి. డిఫెండ్ చేసుకునే సంపూర్ణ అవకాశం వాళ్లకు ఇవ్వాలి. కమిషన్ సేకరించిన ఆధారాలను వారు గాని, వాళ్ల తరఫున న్యాయవాది గాని క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి సెక్షన్ 8(సీ) ప్రకారం తగిన అవకాశం కల్పించాలి.

కాళేశ్వరం కమిషన్ విచారణను ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రికి, మాజీ నీటిపారుదల శాఖ మంత్రికి, అధికారులకు డిఫెండ్ చేసుకునే అవకాశం ఇవ్వలేదు. సెక్షన్ 8(బీ), 8(సీ) కింద నోటీసులు ఇవ్వలేదు. ఈ కమిషన్ ఉద్దేశపూర్వకంగా విచారణ జరపడంతో విధివిధానాలను పాటించనట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా కమిషన్ అనేది వాస్తవాలను కనుగొనడం (ఫ్యాక్ట్ ఫైండింగ్) మాత్రమే చేయాలి. అంతేగానీ ఇది న్యాయ విచారణ కాదు, కమిషన్ చెప్పింది తీర్పు కాదు. ఆ వాస్తవాల పరిశోధన కూడా చట్టానికి లోబడి చేయాలి. లేకపోతే అది రాజ్యాంగ ఉల్లంఘనే.

సెక్షన్ 8(బీ) ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, విచారణ జరిపి ఇచ్చిన రిపోర్టుల గురించి గతంలో వివిధ సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులను ఒకసారి పరిశీలిద్దాం. విచారణ కమిషన్‌ను రాజకీయ ఆయుధంగా వాడకూడదని 1958లో రామకృష్ణ దాల్మియా వర్సెస్ టెండూల్కర్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చట్టం పరిధిలో నిష్పాక్షికంగా విచారణ జరపాలని సూచించింది. 1989లో కిరణ్ బేడి వర్సెస్ కమిటీ ఆఫ్ ఎంక్వైరీస్ కేసులో సెక్షన్ 8(బీ) కింద నోటీసులు ఇవ్వకుండానే విచారణ చేసి రిపోర్టు ఇవ్వగా, అది చెల్లదని, న్యాయబద్ధం కాదని, అలాంటి నివేదిక లెక్కలోకి రాదని అంటూ జస్టిస్ ఎన్.ఎన్.గోస్వామి వ్యాఖ్యానించారు. అంతేకాదు, జస్టిస్ డి.పి.వాద్వా కమిషన్ ఇచ్చిన సదరు రిపోర్టును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టివేసింది.



లాల్ కృష్ణ అద్వానీ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్ కేసులో సెక్షన్ 8(బీ) కింద నోటీసు ఇవ్వనందుకు జస్టిస్ రామ్ నందన్ ప్రసాద్ ఇచ్చిన రిపోర్టును బీహార్ హైకోర్టు రద్దు చేసింది. దీన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. 1997లో జయలలిత వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో విచారణ ఎదుర్కొనే వారిని సాక్షులుగా మాత్రమే పిలిచి సెక్షన్ 8(బీ) కింద ప్రతివాదన వినిపించేందుకు నోటీసులు ఇవ్వకపోతే ఆ విచారణ చెల్లదని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. అంతేకాదు, ఈ తీర్పులో 8(బీ) నోటీసులు ఇవ్వడం తప్పనిసరి అని కూడా చెప్పింది.

1977లో జస్టిస్ జె.సి. షా కమిషన్‌ను ఎమర్జెన్సీలో జరిగిన అరాచకాల మీద విచారణ కోసం అప్పటి జనతా ప్రభుత్వం నియమించింది. ఈ కేసులో మాత్రం ఇందిరాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మరి కొంత మందికి సెక్షన్ 8(బీ) కింద విచారణ కమిషన్ నోటీసులు ఇచ్చింది. డిఫెండ్ చేసుకునే అవకాశం కల్పించింది. కానీ, ఈ రిపోర్టును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగానే దేశమంతా నిరసనలు, ధర్నాలు జరిగాయి. క్యాబినెట్ ఆమోదం లేకుండానే ఇందిరాగాంధీ తన స్వయం నిర్ణయాధికారంతోనే రాజకీయ కక్ష సాధింపు కోసం నాడు ఎమర్జెన్సీ విధించి వేలాది మందిని ప్రివెంటివ్ డిటెన్షన్ పేరుతో జైళ్లలో పెట్టారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. అయితే, చివరికి ఈ రిపోర్టుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే పక్కన పెట్టేశారు. కానీ, తమ హక్కులకు భంగం కలిగిందంటూ ఇందిరాగాంధీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో సెక్షన్ 8(బీ) పద్ధతి ప్రకారం (procedural fairness) లేదని చెప్తూ షా కమిషన్ రిపోర్టును 1978 నవంబర్ 7న ఢిల్లీ హైకోర్టు రద్దు చేసింది.

1992 డిసెంబర్ 16న బాబ్రీ మసీదు కూల్చివేతపై అప్పటి కేంద్ర ప్రభుత్వం జస్టిస్ లిబర్హాన్ కమిషన్‌ను నియమించింది. ఈ కేసు విచారణను 3 నెలల్లో పూర్తి చేయాలని చెప్పినప్పటికీ, 48 సార్లు కమిషన్ గడువు పొడిగించారు. 17 సంవత్సరాల అనంతరం కమిషన్ రిపోర్టు ఇచ్చింది. దేశ చరిత్రలోనే సుదీర్ఘకాలం నడిచిన కమిషన్ ఇదే. 2009 జూన్ 30న పార్లమెంట్‌లో ఈ కమిషన్ రిపోర్టును ప్రవేశపెట్టారు. అయితే, నాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించి నిరసనలకు దిగింది.

1991లో కేంద్ర ప్రభుత్వం రాజీవ్‌గాంధీ హత్యలో జరిగిన భద్రతా వైఫల్యాలపై జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్‌ను నియమించింది. సెక్షన్ 8(బీ) కింద అందరికీ నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ ఈ రిపోర్టు ఆధారంగా అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2023లో దిశ హత్య కేసులో సుప్రీంకోర్టు జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్‌ను నియమించింది. తహసీల్దార్ తోపాటు మరి కొంతమందికి 8(బీ) కింద నోటీసులు ఇవ్వలేదని రాష్ట్ర హైకోర్టు W.P. No. 8572 of 2023లో స్టే విధించింది.

ఇప్పటి వరకు వివిధ అంశాలపై వేసిన ఏ ఒక్క కమిషన్‌లో కూడా సెక్షన్ 8(బీ), 8(సీ) కింద నోటీసులు ఇవ్వని రిపోర్టు చట్టం ముందు నిలబడలేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 6లో జ్యుడీషియల్ కమిషన్‌గా పేర్కొంది. కానీ, విచారణ కమిషన్ల చట్టం ప్రకారం జ్యుడీషియల్ కమిషన్ అనేది ఉండదు. పైగా విచారణ జరిపి బాధ్యులను నిర్ధారించాలని జీవోలో పేర్కొన్నారు. కానీ ఎంక్వైరీ కమిషన్‌కు ఆ అధికారం లేదని గతంలో సుప్రీంకోర్టు చాలా సందర్భాల్లో పేర్కొంది. కమిషన్లు భవిష్యత్తులో లోటుపాట్లు లేకుండా ఏం చేయాలో ప్రభుత్వానికి సూచించాలి. అంతేగానీ ఫలానా వాళ్లు తప్పు చేశారని నేరుగా ఆరోపణలతో నివేదిక ఇవ్వడానికి వీల్లేదు. సాక్షులు ఏం చెప్పారో నివేదికలో పొందుపరచాలి. ఫలానా వ్యక్తులు బాధ్యులని నివేదిక ఇవ్వడం చట్టవిరుద్ధం, నిజనిర్ధారణ మాత్రమే చేసే అధికారం కమిషన్‌కు ఉంది. అందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కేవలం భద్రతా వైఫల్యాల మీదనే దృష్టి సారించి ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

(వ్యాసకర్త: న్యాయవాది, తెలంగాణ హైకోర్టు)



బిచ్చగాన్ని శేత్తిరి గదరా..?

ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు..
ఎప్పుడు అనుకుంటే అప్పుడు..
కాదు కాదు ఇట్టమున్నప్పుడు..
అట్ల సుత గాదు..
పంటకెప్పుడు అక్కరో గప్పుడు..
కాడెడ్ల బండి గట్టుకొని
ఇంటామెను ఎంటబెట్టుకుని
రామన్న భీమన్న అడే అంటే
ఎడ్లుఎరువుల దుకాణం కాడాగేవి...

ఉద్దెరో.. సద్దెరో..
షావుకారిని బతిలాడితే..
నోరు రమ్మనేది
నొసలు పొమ్మనేది
అనుమానమచ్చి చేయి
గద్వ కాడికి పోయేది..
కాదనలేక షావుకారి సరే అనేది
మాట తప్పద్దంటూ కోపంజేసేది
యెంటనే తల్కాయ ఊగేది
ఇంకేముంది...
బస్తవీపుకెక్కేది.. బండి లోడయ్యేది
ఝూ.. అనుడే ఆల్షం
బండి పొలం కాడుండేది..

బత్తాలు మడి ఒడ్డు మీద
దర్జాగా నిలబడితే... ఇంటామె
కుట్లిప్పి డబ్బల పోసేది
సూత్తిమనెవరకు నాల్గెకరాలు
ఖతం చేసేది..
ఒడ్డు మీదికెక్కి దమ్మిడీసేది
సైఫోన్ కింద చల్లటి నీళ్లతో
పెయ్యి కడిగేది..

సల్లగ పచ్చటి చెట్టు కింద
సాపుకుని కూసుంటే
సద్ది బువ్వకే ఆకలయ్యేది
పిల్ల గాలి ఒళ్లుకు తలుగుతుంటే
పొలం మంచిగున్నదన్న గర్వంతోచెయ్యి
మీసం మీదుండేది..
నాభి సల్లవడ్డంక నవాబు కైన
జవాబిచ్చే ధైర్యముండేది..

పచ్చని పొలాన్ని చూసుకుంట
కాలు మీద కాలేసుకుని
కూని రాగాలు తీస్తూ
రంగయ్య పాటలు పాడేది..
అలాంటి నన్ను
ఒక్క బత్త యూరియా కోసం
చెప్పులరిగేలా తిరిగేట్టు..
శివరాత్రి జాగారాలు చేసేటట్టు...
ఆఖరికి దొరకకపోతే...
కాళ్లు పట్టుకునే బిచ్చగాన్ని
శేత్తిరి కదరా..

(ఓ రైతు ఆవేదన)



ఉప్పుల శ్రీనివాస్
91002 57358

యూరియా.. ఇంకెప్పుడయ్యా?

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నది. మరి ఈ కాలంలో రాష్ట్రానికి ఏం జరిగింది? వారు చేసిన పనులేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలను వెతకాల్సిన పని లేదు. తెలంగాణ వచ్చినంక పదేండ్లలో కన్పించని దృశ్యాలను నేడు చూస్తున్నాం. వినకూడని మాటలు వింటున్నాం. ఇదే కాంగ్రెస్ సాధించింది.



డాక్టర్ సత్య బోయినపల్లి



రైతుల సమస్యలే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రధాన ఎజెండా. మునుపెన్నడూ లేని విధంగా రైతు సమస్యల గురించిన సోయి గత ప్రభుత్వానికి ఉన్నది. తమది రైతు ప్రభుత్వమని ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ చెప్పుకొనేది. రైతే రాజని చెప్పింది. కానీ, ఆ రాజుకు నిత్యం గాయాలెట్లయ్యాయో, ఉరికొయ్యలకు ఎట్లా వేలాడారో అందరికీ తెలుసు. కేసీఆర్ సీఎం అయ్యాక ఈ కన్నీటి దృశ్యం మారిపోయింది. తెలంగాణ దు:ఖ జీవితపు కాన్వాస్‌పై పచ్చటి పైర్ల చిత్రాలయ్యాయి. బతుకుదెరువు కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన బడుగు జీవులు తమ సొంత ఊళ్లకు సంతోషంగా చేరుకున్న దృశ్యాలు ఇంకా కండ్ల ముందు కదలాడుతున్నాయి. పాలమూరు కరువు జిల్లాకు తిరుగు వలసలు ప్రారంభమయ్యాయి. బీఆర్‌ఎస్ పాలనా కాలంలో తీసుకున్న చర్యల వల్ల యావత్ దేశం మన తెలంగాణకు బతుకుదెరువును వెతుక్కుంటూ వచ్చింది. వందల రకాల పనుల్లో లక్షలాది మంది పక్క రాష్ట్రాల ప్రజలు ఉపాధి పొందుతున్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు అలరారాయి. వరుసగా ఎనిమిదేండ్ల పాటు తెలంగాణలో ఒక్క చెరువూ ఎండిపోలేదు. పైగా భరణి కార్తిలో సైతం అలుగులు పారాయి. సరిగ్గా 2014 జూన్‌కు ముందు రైతులు విత్తనాల కోసం, పురుగు మందుల కోసం కిలోమీటర్ల దూరం బారులుతీరారు. కేసీఆర్ స్వయంగా ఓ రైతు కాబట్టి, ఎరువులు, విత్తనాల సమస్య లేకుండా చేశారు.

బీఆర్‌ఎస్ హయాంలో రైతులు పొలాల్లోనే ఉన్నారు. పాడిపంటల పనుల్లో తీరుబడి లేకుండా గడిపారు. కానీ, ఇప్పుడు అదను కాలంలో యూరియా కోసం రోజుల తరబడి చెప్పులు లైన్లలో పెట్టి నీరసించిపోతున్నారు. కన్నీరు మున్నీరవుతున్నారు. ఇదేం కష్టకాలం దేవుడా అని గోస పడుతున్నారు.

రైతుల శ్రేయస్సు కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. రైతుల గురించి, వారి సమస్యల గురించి పక్కా ప్రణాళికతో గత ప్రభుత్వం పనిచేసింది. ఏటా వ్యవసాయ ప్రణాళికను ఆరునెలల ముందుగానే సిద్ధం చేసేది. ఒక్క రైతు కూడా విత్తనాలు, ఎరువుల కోసం ఎదురుచూడొద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చేది. గంటలకు గంటలు, కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి రైతు సమస్యల గురించి చర్చించేవారు. జిల్లాలవారీగా అధికారులకు సలహాలు, ఇవ్వడమే కాదు, తీసుకుని కూడా రైతు సమస్యలను పరిష్కరించారు. అందువల్లనే పదేండ్లలో మన రాష్ట్రం పంజాబ్, హర్యానాలతో పోటీపడేలా చేసింది గత ప్రభుత్వం. గతంలో ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా చెప్పుకొనేవారు. కానీ, కేసీఆర్ సర్కార్ చరిత్రను తిరిగి రాసింది.

గోదావరి, కృష్ణా జలాలతో చెరువులు, కుంటలు నింపడంతో రోడ్లపై కిలోమీటర్ల కొద్ది ధాన్యపు రాశులు కన్పించాయి. తెలంగాణ జీవావరణమే మారిపోయింది. సబ్‌స్టేషన్ల ముట్టడి లేదు. రుణాల కోసం బ్యాంకుల ముందు ఆందోళనలు లేవు. లాఠీచార్జీలు లేవు. కరెంట్ ఆపాలని రైతులు ప్రభుత్వాన్ని కోరే పరిస్థితి. ఇదంతా మొన్నటి వరకు మన అందరి అనుభవంలో ఉన్నది.

ఇప్పుడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఏ గ్రామానికి వెళ్లి చూసినా రైతుల గోసలే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సకాలంలో యూరియా ఇవ్వనందు వల్లనే తాము రైతులకు సరఫరా చేయలేకపోతున్నామని సంబంధిత శాఖ మంత్రి అంటున్నారు. రాష్ట్రానికి రావాల్సిన కోటా ఎప్పుడో పూర్తి చేశామని కేంద్రప్రభుత్వం చెప్తున్నది. రైతుల విషయంలో బీజేపీది ఎలాంటి వైఖరో ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి జరిగిన రైతుల ఆందోళనే చెప్తున్నది. అంతేకాదు, రైతులను కారుతో తొక్కించి చంపేసిన ఘటన కూడా ఇంకా దేశ ప్రజల హృదయాల్లోనే ఉంది. రైతులను నిలువునా ముంచి కొందరికే మేలు చేయాలన్న మోదీ పట్టుదలను రైతులు చిత్తు చేశారు.

కేవలం రైతుల గురించి ఆలోచించి, ఆచరించే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్, ఏకైక నాయకుడు కేసీఆర్. పింఛన్లు, రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా లాంటి పథకాలతో కేసీఆర్ రైతుల ఆత్మబంధువు అయ్యారు. ఈ విషయాల గురించి తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వీరికి ముందుచూపు లేదని, ప్రజల పట్ల నిర్దయగా ఉన్నారని చాలా సందర్భాల్లో రుజువవుతూనే ఉన్నది. కేసీఆర్‌పైనా, ఆయన ప్రభుత్వంపైనా నిందలేశారు. నిజాలపై నీళ్లు పోశారు. అయినా వాస్తవాలను ఎల్లకాలం ఎవ్వరూ కప్పి ఉంచలేరు. ఎవరి పని తీరు ఎలాంటిదో ఇప్పుడు ప్రజలకు అర్థమవుతున్నది. ఎవరు తమ మేలు కోరారో కూడా రైతులు ఇప్పుడు అర్థం చేసుకుంటున్నారు. రైతులకు మేలు జరగడమే బీఆర్‌ఎస్‌కు కావాల్సింది. చివరగా ఓ మాట. రైతులందరూ ముక్త కంఠంతో ఇప్పుడు చేస్తున్న డిమాండ్.. 'యూరియా.. ఇంకెప్పుడయ్యా!

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ నాయకురాలు)



ఇది నా కష్టార్జితం

తెలంగాణ ముఖ్యమంత్రికి...!

నేను మే నెలలో రిటైర్ అయ్యాను. ఇంతవరకు నా జీపీఎఫ్ ఫైనల్ అమౌంట్, గ్రాట్యుటీ, కమిటేషన్ 40 శాతం అమౌంట్, 10 నెలల సరెండర్ అమౌంట్.. ఏ ఒక్కటీ రాలేదు. ఇవన్నీ నా కష్టార్జితం.

నేను ఏమైనా నా లోన్లు కట్టమన్నానా? నాకు ఉచితంగా ఇల్లు కట్టించమన్నానా? ఉచితంగా పెన్షన్ కావాలన్నానా? నా ఇంటికి ఉచితంగా కరెంట్ బిల్ కట్టమన్నానా? నాకు తక్కువ రేటుకు గ్యాస్ సిలిండర్ కావాలన్నానా? నా భూమిలో పంట పండించడానికి ఎకరానికి ఉచితంగా రూ.15,000 కావాలని అడిగానా? నా పొలానికి ఉచితంగా కరెంట్ కావాలన్నానా? ఉచితంగా మేకలు, గొర్రెలు, బర్రెలు, పందులు కావాలన్నానా? వీటిలో ఏదీ నాకు ఉచితంగా ఇవ్వలేదు.

నేను పన్నులు కట్టాను, ఎగ్గొట్టలేదు. నా సంపాదనంతా ప్రభుత్వ లెక్కే. నా పిల్లలకు స్కాలర్‌షిప్ లేదు. లక్షలు అప్పులు చేసి ఫీజులు కట్టి చదివించుకున్నాను. అప్పులు చేసి పిల్లలకు పెండ్లి చేశాను. నేను సైకిల్‌పై వెళ్లి నా కొడుకు చదివే ఇంజినీరింగ్ కాలేజీలో ఫీజు కడితే, కారులో వచ్చిన వ్యక్తి ఒక్క రూపాయి ఫీజు కట్టలేదు. నాకు తెల్ల కార్డు లేకపోవడమే అందుకు కారణం.చివరికి ఇల్లు కట్టుకుందామన్నా, అరెకరం పొలం కొనుక్కుందామన్నా డబ్బులు లేవు. నేను కష్టపడి రాత్రి, పగలు డ్యూటీలు చేశాను. నా జీవితంలో సగం రాత్రులు రాత్రి డ్యూటీలోనే గడిసిపోయాయి. ఎంతో కష్టపడి ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేశాను. జీవితమంతా కష్టపడ్డాను. నా కష్టార్జితంతో దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వకపోతే ఎలా? చెప్పండి.

నిజంగా ఉచితాలకు ఎంతమంది అర్హులు. ఎంతయినా ఇచ్చుకోండి. మేం వద్దనలేదు. దయచేసి మావి మాకు ఇవ్వండి. మేం కూడా ఓట్లు వేశాం. మమ్ములను మనుషులుగా గుర్తించండి. పనికిరాని ప్రభుత్వం బానిసలుగా భావించకండి. మా మీద కూడా దయ చూపించండి. రిటైర్ కాబోయే ఉద్యోగులారా మీరూ ఆలోచించండి.

- తెలంగాణ ముఖ్యమంత్రికి ఓ పెన్షనర్ ఆవేదనతో రాసిన లేఖ



ఆధారాల్లేని అవినీతి



నన్నపునేని నరేందర్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన 665 పేజీల నివేదికలో ఎక్కడా ఫలానా వాళ్లు ఇంత లంచం ఇవ్వడం వల్ల ప్రాజెక్టు డిజైన్ మార్చేశారని గాని, ఇంత డబ్బు చేతులు మారడం వల్ల ప్రాజెక్టులో నాణ్యత లోపించిందని గాని, కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్టుగా కేసీఆర్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడి ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని గాని ప్రస్తావించలేదు.


ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైనింగ్‌లో బ్యారేజీల నిర్మాణ స్థలం మారిందని, ప్రాజెక్టు మెయింటెనెన్స్ లోపాలు ఉన్నాయని, ఫలితంగా మేడిగడ్డలో పిల్లర్ కుంగిందని, మరో రెండు బ్యారేజీల్లో సీపేజీలు వచ్చాయని తెలిపింది. అంతేతప్ప అవినీతికి సంబంధించిన ప్రస్తావన ఎక్కడా చేయలేదు. దీంతో కాళేశ్వరంలో లేని అవినీతిని చూపించాలనుకున్న కాంగ్రెస్ పని కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్లు అయింది. దీంతో కనీసం సీబీఐ అయినా ఆ లేని ఈకలు దొరకపట్టుద్దేమో అన్న ఆశతో రేవంత్‌రెడ్డి ఏకంగా తాను ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ నివేదికను పక్కన పెట్టి మరీ సీబీఐకి దర్యాప్తును అప్పగించారు.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పడిందే కాళేశ్వరంలోని అవినీతి ఆరోపణల మీద. అలాంటి విచారణ కమిషన్ తన సుదీర్ఘ నివేదికలో ఎక్కడా అవినీతి ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోవడం ఇక్కడ ప్రధానమైన విషయం. వాస్తవానికి కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందు కాంగ్రెస్ నేతలంతా 'నివేదిక సారాంశం' అంటూ.. కేసీఆర్ అవినీతికి ఆధారాలు దొరికాయని, లక్ష కోట్ల అవినీతి జరిగినట్టు కమిషన్ తేల్చిందని నానా హంగామా చేశారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. తీరా కమిషన్ నివేదిక వారి చేతికి వచ్చేసరికి అసలు విషయం తెలిసి ఉంటుంది. అందుకే నివేదికపై అసెంబ్లీలో అర్ధరాత్రి చర్చ చేపట్టారు. సీబీఐ దర్యాప్తు పేరుతో కమిషన్ నివేదికను చెత్తబుట్టలో పడేశారు. నివేదికలో అవినీతికి ఆధారాలు ఎక్కడ చూపించారని బీఆర్‌ఎస్ అడుగుతుందన్న భయంతో మరుసటి రోజే అసెంబ్లీని నిరవధిక వాయిదా వేశారు.

నీటిపారుదలరంగ నిపుణుడు వి.ప్రకాష్ ఇటీవల 'తెలంగాణ టుడే'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. కమిషన్ ఎదుట విచారణకు తాను కూడా హాజరయ్యానని, కానీ తన అభిప్రాయాలను నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని, ప్రాజెక్టులో లోపాలను వెతికే క్రమంలో విచారణ కమిషన్ కాళేశ్వరం అసలు లక్ష్యాలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పక్షపాత వైఖరితో వ్యవహరించి నివేదికను రూపొందించినట్టు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఘోష్ కమిషన్‌ను నియమించలేదు. ఎలాగైనా, ఎక్కడో ఒక దగ్గర కాళేశ్వరంలో అవినీతి మూలాలు దొరకవచ్చేమో అన్న ఆశతో నియమించింది. 15 సార్లు దాని కాల పరిమితిని పొడిగించింది. అయినా కమిషన్ ఎక్కడా అవినీతి జరిగినట్టు ఆధారాలను పట్టుకోలేకపోయింది. లేని అవినీతిని జరిగిందని కుట్ర రాజకీయాలతో ప్రచారం చేసి ప్రజలను మోసం చేయాలని చూసిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సమాజానికి కచ్చితంగా క్షమాపణ చెప్పాలి. కాదు.. అవినీతి జరిగినట్లు విచారణ కమిషన్ తేల్చిందని కాంగ్రెస్ నేతలు ఇంకా వాదిస్తే కమిషన్ నివేదికలో ఏ పేజీలో, ఏ పేరాలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని కమిషన్ పేర్కొందో చూపించాలి.

(వ్యాసకర్త: రాష్ట్ర మాజీ శాసనసభ్యులు)



ప్రజల నైతికతకూ పరీక్షే!



ప్రతి ఎన్నిక కూడా ఒక నైతిక పరీక్ష లాంటిదే. మనం తెలిసీ అవినీతిపరులైన రాజకీయ నాయకులను పాలకులుగా ఎన్నుకుంటే మాత్రం మనల్ని మనం బాధితులమని పిలుచుకునే హక్కును కోల్పోతాం. ప్రజాస్వామ్యమంటే రాజకీయ నాయకులను మాత్రమే కాదు, వారిని అధికార పీఠాలపై కూర్చొబెట్టిన ప్రజల నైతికతను కూడా ప్రతిబింబిస్తుంది.

- హర్ష గోయెంకా, ప్రముఖ వ్యాపారవేత్త

ఎల్లుండి నుంచి కాలేజీలు బంద్!

మొదటిపేజీ తరువాయి...

15 నుంచి కాలేజీల నిరవధిక బంద్ పాటిస్తామని, కాలేజీలను తెరవబోమని, తరగతులు చెప్పబోమని ప్రకటించారు. సెప్టెంబర్ 30 లోపు బకాయిలను విడుదల చేయకపోతే, ఆందోళనను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం చెప్పులరిగేలా సర్కారు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతోనే ఈ మూసివేత నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1,500 పైచిలుకు ప్రైవేట్ ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ తదితర వృత్తివిద్యా కాలేజీలు మూతబడనున్నాయి. దీంతో దాదాపు 10 లక్షలకు పైగా విద్యార్థులు నష్టపోనున్నారు. ఆయా కాలేజీలకు మొత్తంగా సుమారు రూ.10 వేల కోట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర ఫీజుల బకాయిలు చేరాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విసిగి వేసారిన కాలేజీల యాజమాన్యాల వినతులు అరణ్యరోదనే అయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్నిరకాల ఉన్నత విద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యారు. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ సమావేశంలోనే కాలేజీల నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయనందుకు నిరసనగా ఇంజినీర్స్ డేను బ్లాక్‌డేగా పాటించాలని నిర్ణయించారు.

కాలేజీ యాజమాన్యాల వినతులు బుట్టదాఖలు

కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలంకావడం, బకాయిలు పేరుకుపోవడంతో కాలేజీల యాజమాన్యాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమయ్యాయి. దీంట్లో భాగంగా ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హైయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి)గా ఏర్పాటయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని అనేక విజ్ఞప్తులు చేశాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు సహా ప్రభుత్వ పెద్దలందరినీ ఫతి ప్రతినిధులు కలిశారు. కానీ సర్కారు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించింది. రూపాయి కూడా విడుదల చేయలేదు. టోకెన్లు జారీ అయిన వాటికి కూడా నిధులను విడుదల చేయలేదు.

ఫతి ప్రతిపాదనను పట్టించుకోని సర్కార్

ప్రభుత్వంపై భారం పడకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికను ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హైయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి) ప్రతినిధులు సర్కారు ముందుంచారు. రూ.లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ముందు ప్రతిపాదించారు. ఈ లక్ష కోట్లల్లో సర్కారు వాటా పరిమితమేనని, సీఎస్సార్, కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారానే ఈ నిధులను సేకరించవచ్చని సూచించారు. ఈ లక్ష కోట్ల డిపాజిట్లపై వచ్చే 7 శాతం వడ్డీ (సుమారు రూ.3 వేల కోట్లు)తో ఫీజు రీయింబర్స్ చేయవచ్చని సూచించారు. దీనిని కూడా సర్కారు పట్టించుకోలేదు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో సర్కారు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం నేతలు

16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీల బంద్

ఫతి బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాల సంఘం (టీపీడీపీఎంఏ) కూడా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసివేస్తామని అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, యాద రామకృష్ణ ప్రకటించారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

దసరా పండుగను జరుపుకోలేని దౌర్భాగ్యం

దసరా పండుగను మా కుటుంబాలన్నీ సంతోషంగా జరుపుకోలేని దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. జీతాలకు ఇవ్వకపోతే సోమవారం నుంచి విధులకు హాజరుకాబోమని ఫ్యాకల్టీ అల్టిమేటం జారీచేశారు. మేం తప్పనిసరి పరిస్థితుల్లోనే కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాం. రూ.10 వేల కోట్ల బకాయిలను ఈ నెల 30లోపు విడుదల చేయాలి. అంతవరకు మా పోరాటం సాగుతుంది. ఇవ్వకపోతే ఆ తర్వాత ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. ముఖ్యమంత్రి వద్ద విద్యాశాఖ ఉన్నదని సంతోషపడ్డం. కానీ, ఈ శాఖకు ప్రాధాన్యమే లేకుండా పోయింది. 6 నెలల నుంచి సర్కారు చుట్టూ తిరుగుతున్నాం. ప్రత్యామ్నాయ ప్రణాళికను సర్కారు ముందుంచాం. అయినా పట్టించుకోవడమే లేదు.

- రమేశ్, ఫతి చైర్మన్

6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి

ప్రైవేట్ కాలేజీల్లో పనిచేస్తున్న సిబ్బందికి 6 నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కాలేజీలు దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. అప్పులు చేసి కొందరికి జీతాలు చెల్లిస్తున్నాం. యాజమానులుగా మేం మధ్యాహ్నం పూట కాలేజీలకే వెళ్లలేకపోతున్నాం. సాయంత్రం, రాత్రిపూట వెళ్లి సంతకాలు పెట్టి వస్తున్నాం. బకాయిల విడుదల కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నాలుగుసార్లు కలిశాం. ఇంజినీర్స్ డేను బ్లాక్ డేగా పాటించి, బంద్‌ను పాటించబోతున్నాం. ఆగస్టు 31 నాటికి రావాల్సిన పూర్తి బకాయిలను విడుదల చేయాలి. లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తాం.

- కేవీ రవికుమార్

‘ఫీజు’ బకాయిలపై ఉమ్మడి పోరు

- యాజమాన్యాలు కలిసిరావాలి
- స్టూడెంట్స్‌ను ఇబ్బందులు పెట్టొద్దు
- బీచ్‌లకు, అందాల పోటీల నిర్వహణకు డబ్బులు ఉన్నయా? కానీ పిల్లల చదువులకు లేవా?
- రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం సర్కార్‌పై ఉమ్మడి పోరు చేద్దామని రెడ్కో మాజీ చైర్మన్ వై సతీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకు కళాశాలల యాజమాన్యాలు కలిసి రావాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, 13 లక్షల మంది విద్యార్థుల చదువు పూర్తయినా రీయింబర్స్ మెంట్ బిల్లులు రాక, సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం చెల్లించనేలేదని, ఒక్కో కాలేజీలో 200 నుంచి 500 మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావాల్సి ఉన్నదని గుర్తుచేశారు. ఫీజు బకాయిల కారణంగా విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వక ఐఐటీ ఖరగ్‌పూర్, ఎన్‌ఐటీ లాంటి ప్రఖ్యాత విద్యాసంస్థల్లో సీట్లు వచ్చినా విద్యార్థులు చేరలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. 20 నెలల్లో రెండున్నర లక్షల కోట్ల అప్పుచేసిన సర్కారు.. కేవలం రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. వందలాది కోట్లు పెట్టి హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ బీచ్‌లు కట్టడానికి, అందాల పోటీలు నిర్వహించడానికి ప్రభుత్వం వద్ద డబ్బులుంటాయి కానీ, పిల్లల చదువుల కోసం సర్కారు వద్ద డబ్బుల్లేవా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు డబ్బుల్లేవంటూనే లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి పొంకనాలు కొడుతున్నారని ఎద్దేవాచేశారు. ఏదైనా ప్రైవేటు ఉద్యోగం చేద్దామన్నా సర్టిఫికెట్లు చేతికి రాకుండా అడ్డుకుంటున్నదని మండిపడ్డారు.

‘రీయింబర్స్‌మెంట్’ను ఎత్తేసే కుట్ర

- అందుకే బకాయిల విడుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- కళాశాలలు బంద్‌కు పిలుపునిచ్చినా మౌనమేల?
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సర్కార్
- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నేతలు మణికంఠరెడ్డి, లక్ష్మణ్

హైదరాబాద్,సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, అందుకే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. హైదరాబాద్‌లోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఇంజనీరింగ్ సహా ప్రైవేటు ఉన్నత విద్యా కళాశాలలు ఈ నెల 15 నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారని తెలిపారు. తరచూ విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నా సర్కారులో చలనమే లేకుండాపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నా ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత మూడేండ్ల నుంచి ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్ల వరకు పూర్తిగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో పైసా విడుదల చేయకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీజు బకాయిల విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఆరోపించారు. ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వంపై ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

దళిత, గిరిజన విద్యార్థులతో చెలగాటం

- ‘బెస్ట్ అవైలబుల్ స్కీమ్’పై సర్కార్ వివక్ష
- 170 కోట్ల బిల్లులు బాకీ పడ్డ ప్రభుత్వం
- స్కూళ్ల మూసివేత దశలో యాజమాన్యాలు
- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): దళిత, గిరిజన విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలోని 230 పైచిలుకు ప్రైవేట్ పాఠశాలల్లో 26,000 మంది పేద దళిత, గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్నారని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు పుస్తకాలు, యూనిఫాం, భోజన వసతులను పాఠశాలల ఆయా యాజమన్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు. ఆ స్కీం కింద రూ.170 కోట్ల బిల్లులను ప్రభుత్వం ఆయా పాఠశాలలకు ఇవ్వాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఆ ఫీజులను గత రెండేండ్లుగా చెల్లించకపోవడంతో తమ పాఠశాలలు నడపలేమని స్కూళ్ల యాజమాన్యాలు చేతులెత్తేసే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలను మూసివేస్తే పేద దళిత, గిరిజన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ బడులు, ప్రైవేట్ విద్యాసంస్థలు అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఈ బిల్లులు చెల్లించడం చేతగావడం లేదని తెలిపారు. పేద దళిత, గిరిజన విద్యార్థుల కోసం బెస్ట్ అవైలబుల్ స్కీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్‌ఎల్‌బీసీ పునరుద్ధరణపై ప్రతిపాదనలు

15న క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పునరుద్ధరణకు చేపట్టాల్సిన పనుల కోసం ప్రభుత్వం నుంచి అనుమతి పొందేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలను రూపొందించారు. సాగునీటి పారుదల శాఖ స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌సీ)లో పునరుద్ధరణ పనులపై చర్చించారు. ఈఎన్సీ అమ్జద్ హుస్సేన్ నేతృత్వంలో శుక్రవారం కొనసాగిన ఈ సమావేశంలో సొరంగం పునరుద్ధరణకు తీసుకోవాల్సిన అనుమతులు తదితర అంశాలపై చర్చించారు. అధికారులు ఇప్పటికే రూ.2.30 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధంచేశారు. ఎన్‌జీఆర్‌ఐ తదితర సంస్థల సహకారంతో సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అదనంగా ఇన్వెస్టిగేషన్ సర్వే నిర్వహించాల్సి రావడం, టీబీఎం స్థానంలో డీబీఎం విధానంలో ముందుకు పోవాలని యోచిస్తున్నారు. ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలంటే ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి. ఈ నేపథ్యంలో అనుమతుల కోసం ప్రభుత్వానికి ఫైలును పంపాలని కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా 15న నిర్వహించబోయే క్యాబినెట్ భేటీలో ఎస్‌ఎల్‌బీసీపై సర్కారు నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

త్వరలో ఛత్తీస్‌గఢ్‌తో ఇరిగేషన్ శాఖ భేటీ

సమ్మక్కసాగర్‌కు ఎన్‌వోసీ జారీపై చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులు త్వరలోనే భేటీ కావాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే ఆ రాష్ట్ర అధికారులను సంప్రదించినట్టు సమాచారం. సమక్కసాగర్ బరాజ్‌ను 83 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో నిర్మించిన విషయం తెలిసిందే. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి బరాజ్‌కు అన్ని అనుమతులు మంజూరయ్యాయి. అంతర్రాష్ట్ర విభాగం నుంచి రావాల్సిన అనుమతులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. పొరుగున ఛత్తీసగఢ్ రాష్ట్రం నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్వోసీ)ని ఇస్తేనే అంతర్రాష్ట్ర విభాగం అనుమతులు వచ్చే అవకాశం ఉన్నది. ఎన్వోసీ కోసం దీర్ఘకాలంగా తెలంగాణ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షలు రద్దు చేయాలి

జ్యుడీషియల్ విచారణ జరగాలి

- హైకోర్టులో ప్రభుత్వం రిట్ అప్పీల్ చేయొద్దు
- జీవో29నిరద్దుచేసి, 55నుఅమలుచేయాలి
- కేసు గెలిచిన అభ్యర్థులకు అభినందనలు
- తీర్పుపై బీజేపీ నోరెందుకు మెదపదు?
- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపాటు
- హైకోర్టు చెప్పినా సర్కార్‌కు బుద్ధి రాలే
- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు ఫైర్



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, తక్కెళ్లపల్లి రవీందర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగబాలు, కడారి స్వామి యాదవ్, మహిపాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1పై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంపై పోరాడి గ్రూప్-1 కేసు గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ గుత్తేదారులం తామే అనుకుంటూ రేవంత్‌రెడ్డి సర్కారు వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. రీకాల్ వ్యవస్థ లేకపోవడంతో ఐదేండ్లు తమ ఇష్టారాజ్యం అనుకుంటున్నారని విమర్శించారు. అభ్యర్థులకు అనుకూలంగా వచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా రిట్ అప్పీల్ చేయవద్దని డిమాండ్ చేశారు.

జ్యుడీషియల్ విచారణ జరగాల్సిందే

గ్రూప్-1కు సంబంధించిన మొత్తం వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ జరగాలని దాసోజు డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి జీవో 29ని రద్దు చేసి, 55 జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలిస్తామని ఎన్నికల ముందు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అశోక్‌నగర్ వచ్చి ఇచ్చిన హామీకి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. గ్రూప్-1 ఉద్యోగాల కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల జులుం వంటి పలు అంశాల వీడియోలను చూపించారు. ఉద్యోగాల కోసం విద్యార్థులు చేసే పోరాటాలను అడ్డుకోవడం కోసం, కశ్మీర్‌లో కవాతు చేసినట్టుగా అశోక్‌నగర్‌లో కూడా పోలీసులు కవాతు చేశారని, ఆడ, మగ తేడా లేకుండా విద్యార్థులపై ఇష్టారాజ్యంగా లాఠీ చార్జి చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

విద్యార్థులకు న్యాయం చేయండి

రేవంత్‌కు, టీజీపీఎస్సీ చైర్మన్‌కు మానవత్వం ఉంటే గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలని దాసోజు డిమాండ్ చేశారు. ఈ ఉద్యోగాలను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు అధికారంలో ఉండే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. తెలుగు మీడియంలో గ్రూప్-1కు హాజరైన వారికి కూడా ఈ ప్రభుత్వం చేసిన అన్యాయంపై తూర్పారబట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి హైకోర్టు జడ్జిమెంట్‌పై చర్చించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి విభాగం నేతలను పోలీసులు కొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అణచివేయాలన్న ప్రయత్నం ఎక్కడా విజయవంతం కాలేదని గుర్తుచేశారు. గ్రూప్-1పై ప్రత్యేక అసెంబ్లీ పెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేపీ నేతలు.. తమ నోళ్లకు తాళాలు వేసుకున్నారా? అని ప్రశ్నించారు. బీజేపీని రేవంత్‌రెడ్డి కోసం నడుపుతున్నారా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని కేంద్రమంత్రి బండి సంజయ్ కాపాడుతున్నాడని దుయ్యబట్టారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ

గ్రూప్-1 విషయంలో హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తే విద్యార్థులను తీవ్రవాదులుగా మార్చినట్టే అవుతుందని దాసోజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు. దీన్ని నేరుగా అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూలంగా హైకోర్టులో తీర్పు వస్తే తిరిగి దాన్ని కోర్టులో చాలెంజ్ చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించడం భావ్యం కాదని చెప్పారు.

హైకోర్టు చెప్పినా బుద్ధి రాలే : గెల్లు శ్రీనివాస్‌యాదవ్

గ్రూప్-1 అంశంపై విద్యార్థులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు చెప్పినా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరవడం లేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు డివిజన్ బెంచ్‌కు వెళ్తుందని నిలదీశారు. జీవో 29 ఎవరి కోసం తెచ్చారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. దీనిపైనా అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి, సర్కారుకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీంద్‌రావు, బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు, కడారి స్వామి యాదవ్, కొడంగల్ బీఆర్‌ఎస్ నేత మహిపాల్ పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగార్థుల జంగ్ సైరన్..



- 20 వేల పోలీసు పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్
- పోలీసు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాలు
- జిల్లాల్లో పోలీసు ఉద్యోగార్థులతో కలిసి ఐక్య కార్యాచరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఇన్నాళ్లు కాంగ్రెస్ నేతల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన పోలీసు ఉద్యోగార్థులు.. ప్రభుత్వంపై పోరాటానికి ఈ నెల 15న కార్యాచరణ ప్రకటించనున్నారు. తక్షణం 20వేలతో పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ఐక్య కార్యాచరణ రూపొందించుకున్నారు. ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల కోసం తక్షణం నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో పోలీసు నోటిఫికేషన్ కోసం సుమారు 10 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లాల్లోని ఉద్యోగార్థులతో కలిసి పోరాటాలకు ‘సై’ అంటున్నారు. కేసీఆర్ హయాంలో 2022లో పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగా.. మళ్లీ ఇప్పటివరకూ అతీగతి లేదు. కాంగ్రెస్ పాలనలో ఇప్పటికే పోలీసు నోటిఫికేషన్ మూడుసార్లు వాయిదా పడిందని, అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు దిక్కులేదని చెప్తూ నిరుద్యోగులను కార్యోన్ముఖులను చేస్తున్నారు.

15న కార్యాచరణ

పోలీసు ఉద్యోగాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు, నోటిఫికేషన్ విడుదల చేయించేందుకు పోలీసు నిరుద్యోగ జేఏసీ ఈ నెల 15న తమ కార్యాచరణను ప్రకటించనున్నది. తక్షణం 20వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని, జీవో 46ను టీజీఎస్పీ విభాగం నుంచి తొలగించాలని, కానిస్టేబుల్ అభ్యర్థుల వయసును 35 ఏండ్లకు పెంచాలనే ప్రధాన డిమాండ్లపై కార్యాచరణను రూపొందించనున్నది.


బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్యను కలిసి అమరణ నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్

నోటిఫికేషన్ల కోసం 15 నుంచి ఆమరణ దీక్ష

నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్ కుమార్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 12 : రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ల సాధన కోసం ఈనెల 15 నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లోని తన ఇంట్లోనే ఆమరణ నిరాహార దీక్ష చేయనున్నట్టు తెలంగాణ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు. నిరాహార దీక్షకు మద్దతు కూడగట్టేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, విద్యావేత్తలను కలుస్తున్నట్టు తెలిపారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ హామీని నిలబెట్టుకోవాలన్న డిమాండ్‌తో ఇప్పటికే ఖమ్మం, నల్లగొండ, సిద్దిపేట జిల్లాల్లో నిరుద్యోగులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్ మరో ముందడుగు వేసి ఆమరణ నిరాహార దీక్షకు నిర్ణయించారు. ఈసారి నోటిఫికేషన్ వచ్చేదాకా దీక్ష విరమించబోనని స్పష్టంచేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య , బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, ఎంపీ ఈటల రాజేందర్, విద్యావేత్త ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉద్యమకారుడు పృథ్వీరాజ్ యాదవ్, ప్రసన్న హరికృష్ణను కలవగా వారంతా సంపూర్ణ మద్దతు తెలిపారు. తమ పోరాటానికి అండగా నిలవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి కోరనున్నట్టు అశోక్‌కుమార్ చెప్పారు. హైకోర్టు తీర్పు ప్రకారం గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్ తిరిగి నిర్వహించి తెలుగు మీడియం అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలైనా ఒక్క నోటిఫికేషన్ జారీ చేయలేదని, నిరుద్యోగుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

వేతన బకాయిలు 11కోట్లు విడుదల

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి
- ‘నమస్తే’ కథనానికి స్పందన

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీల్లోని పార్ట్‌టైం, అవుట్‌సోర్సింగ్, సబ్జెక్ట్ అసోసియేట్లకు సంబంధించిన వేతన బకాయిలు రూ.11కోట్లు విడుదల చేసినట్టు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. ఎస్సీ గురుకుల సొసైటీలో పనిచేస్తున్న 2,469 మందికి గడిచిన రెండు నెలలుగా, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీలోని సబ్జెక్ట్ అసోసియేట్లకు 5 నెలలుగా ప్రభుత్వం వేతనాలను చెల్లించలేదు. ఇదే విషయమై ‘నెలల తరబడి వేతనాలివ్వకపోతే బతికేదెట్లా..?’ పేరిట ‘నమస్తే తెలంగాణ’ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో మంత్రి లక్ష్మణ్ స్పందించారు. సచివాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వేతన బకాయిలు రూ.11.53 కోట్లు విడుదల చేసినట్టు ప్రకటించారు. ట్రైబల్ వెల్ఫేర్ సీవోఈల్లోని సబ్జెక్ట్ అసోసియేట్స్, సీనియర్ ఫ్యాకల్టీ, గేమ్స్ కోచ్‌లకు సంబంధించి రూ. 2.38 కోట్లు రిలీజ్ చేసినట్టు తెలిపారు. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం అశోక్‌నగర్‌లో ఎస్సీ హాస్టల్ ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు చెప్పారు. గ్రూప్ 1 విషయంలో ఆధారాలుంటే నిరూపించాలని, విద్యార్థుల భవిష్యత్ విషయంలో తమ ప్రభుత్వం తప్పు చేయబోదని స్పష్టంచేశారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ భవనాలు నిర్మాణ దశలో ఉన్నట్టు వెల్లడించారు.

ఏడు రోజుల గ్రౌండ్ స్టాక్ ఉండాల్సిందే!

- మద్యం దుకాణాలకు ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు
- కానిస్టేబుళ్ల ద్వారా రోజువారీ మద్యం పెట్టెల లెక్కింపు

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): ప్రతి మద్యం దుకాణంలో వారం రోజులకు సరిపడా మద్యం నిల్వలు ఉండాల్సిందేనని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ మౌఖిక ఆదేశాలు జారీచేశారు. గ్రౌండ్ స్టాక్ నిర్వహించని దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్ బృందాలతో దాడులు చేయిస్తామని హెచ్చరించినట్టు తెలిసింది. ‘నకిలీ మద్యం దందా.. నెలకు రూ.200 కోట్లు’ శీర్షికతో శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్‌శాఖ స్పందించింది. మద్యం దుకాణాల లైసెన్స్ గడువు దగ్గరపడటం, ప్రివిలేజ్ ఫీజులతో లాభాలు రాకపోవడంతో వ్యాపారులు నకిలీ మద్యం వైపు చూస్తున్నారనే విషయం వెలుగులోకి రావడంతో ఎక్సైజ్‌శాఖలో కదలిక మొదలైంది. ఎక్సైజ్ కమిషనర్ క్షేత్రస్థాయి నుంచి వాస్తవాలను తెలుసుకున్నారని, అందుకే గ్రౌండ్ స్టాక్ నిబంధనను అమల్లోకి తెచ్చారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఒక మద్యం దుకాణంలో నిరుడు సెప్టెంబర్‌లో జరిగిన విక్రయాలను బట్టి వాటికి అదనంగా పది శాతం మద్యం జోడించి గ్రౌండ్ స్టాక్‌ను నిర్ధారించాలని ఆయా జిల్లాల ఎక్సైజ్ అధికారులకు దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది.

మధ్యాహ్న భోజన కార్మికులపై సర్కారు కర్కశం

- వేతనాలు, బిల్లులు చెల్లించకపోవడం దుర్మార్గం
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కాయకష్టాన్ని నమ్ముకొని బతుకీడ్చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కాంగ్రెస్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా నరకం చూపిస్తున్నదని నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం వరంగల్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు హరీశ్‌రావును కలిశారు. తమ గోడును పట్టించుకోవాలని, కాంగ్రెస్ సర్కారును నిలదీయాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు హరీశ్ సానుకూలంగా స్పందించారు. దగాపడ్డ మధ్యాహ్నభోజన కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు, వేతనాల కోసం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నాలు చేస్తుంటే రేవంత్ సర్కారు మొద్దునిద్ర నటిస్తున్నదని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం జీతాలు పెంచుతామని నమ్మించి ఇప్పుడు నయవంచన చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఉన్నపలంగా మధ్యాహ్న భోజన పథకం కోసం 20 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి ఏంకావాలి? ఏడాది నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి విద్యార్థులకు అన్నంపెట్టిన చిరుద్యోగుల ఆర్థిక భారం ఎవరు తీర్చాలి?' అని ప్రశ్నించారు. సర్కారు ఏకపక్ష నిర్ణయంతో వేలాది మంది కార్మికుల బతుకులు రోడ్డున పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి వారి సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ వారి తరఫున పోరాడుతుందని స్పష్టంచేశారు.

'డైనమిక్ లీడర్..' 'మా అన్న బండి'

- ఒకరిపై ఒకరు కాంగ్రెస్-బీజేపీ నేతల పొగడ్తలు
- చర్చనీయాంశంగా బండి సంజయ్, పొంగులేటి అనురాగం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో ఉప్పు-నిప్పులా ఉంటున్న బీజేపీ-కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో మాత్రం పాలు-పంచదారలా కలిసి పోతున్నారు. కాంగ్రెస్-బీజేపీ నేతల పొత్తు.. పొద్దు తిరుగుడు పువ్వులా ఎటువైపే అటు తిరుగుతున్నది. సమయం, సందర్భం దొరికితే చాలు.. ఇరు పార్టీల నేతలు ఒకరిపై మరొకరు ప్రేమను గుమ్మరించుకుంటున్నారు. తాజాగా ఆలిండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్ ముగింపులో కేంద్ర సహాయ మంత్రి బండిసంజయ్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల పరస్పర కార్యక్రమం చర్చనీయాంశంగా మారింది. ఒకే వేదికపై పాల్గొన్న ఇద్దరు నేతలు ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకున్నారు. 'కేంద్ర సహాయ మంత్రి, మిత్రులు.. మా పెద్దన్న బండి సంజయ్‌గారు' అని మంత్రి పొంగులేటి సంబోధించారు.. 'తెలంగాణ రాష్ట్ర డైనమిక్ లీడర్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి' అంటూ బండి సంజయ్ కొనియాడారు. వీరు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. 'తెలంగాణలో బీజేపీ-కాంగ్రెస్ దోస్తానా గురించి ఎంత చర్చించుకున్నా తక్కువే' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. 'కేంద్రంలో పొట్లాపొట్లుగా తిట్టుకునే నేతలు.. రాష్ట్రంలో ప్రేమానురాగాలు పంచుకుంటున్నారు' అంటూ సెటైర్లు వేస్తున్నారు.

చట్టసభలపై ప్రజల్లో గౌరవం తగ్గుతున్నది

- గౌరవించుకోవాల్సిన బాధ్యత మనదే: గుత్తా



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): చట్టసభల్లో జరిగే చర్చలపై ప్రజల్లో గౌరవభావం తగ్గుతున్నదని, శాసనసభలు నిజమైన చర్చా వేదికలుగా కొనసాగినప్పుడే ప్రజాస్వామ్యం వృద్ధి చెందుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బెంగళూరులో జరుగుతున్న 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్(సీపీఏ) ఇండియా రీజియన్ సమావేశాల్లో తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్, లేజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వీ నరసింహాచార్యులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ చట్టసభ్యులు ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు జరిపితే చట్టసభలపైనా, ప్రజా ప్రతినిధులపైనా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని చెప్పారు.

ప్రమాదంలో దేశ ప్రజాస్వామ్యం

- ఏచూరి వర్ధంతి సభలో సీపీఎం నేత బీవీ రాఘవులు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికత్వం, ఫెడరలిజం ప్రమాదంలో పడ్డాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పరిస్థితులు ఎమర్జెన్సీ నాటి రోజుల కంటే దారుణంగా ఉన్నాయని అన్నారు. దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. బీజేపీ ఫాసిస్టు, మతోన్మాద ధోరణి నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయండి

- ఆ సంస్థల ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి జీవన్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయాలని, కొత్తగా ఉద్యోగ నియామకాలపై దృష్టిపెట్టాలని ఆ సంస్థల ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జీటీ జీవన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయా సంస్థల సమస్యలు, నియమాకాలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించి పరిస్థితిని వివరిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 93 ప్రభుత్వరంగ కార్పొరేషన్లు నడుస్తున్నాయని, 32 కార్పొరేషన్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంతోపాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారిధిగా పని చేస్తున్నాయని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలే కీలకం: డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల భద్రతకు విస్తృతస్థాయిలో సీసీ కెమెరాలను వినియోగించాలని డీజీపీ జితేందర్ ఆదేశించారు. ఈ మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు తరచూ సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో రైల్వే రాష్ట్రస్థాయి సెక్యూరిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. నేరాల కట్టడికి సీసీ కెమెరాలు కీలకమని, మానవ అక్రమ రవాణా కట్టడికి 'ఆపరేషన్ ఆహాత్'ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్టీఈఎంపై బాలల్లో అవగాహనాలోపం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): భవిష్యత్తుకు బలమైన పునాది వేయగల ఎస్‌టీఈఎం (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) అధ్యయనాల గురించి బాల, బాలికలకు తగినంతగా అవగాహన లేదని ప్రముఖ భారతీయ స్వచ్ఛంద సంస్థ అయిన చైల్డ్ రైట్స్ అండ్ యూ (సీఆర్‌వై) నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ నివేదిక ప్రకారం, దక్షిణ భారతదేశంలో 52% బాలికలు, 51% బాలురు ఎస్‌టీఈఎం గురించి ఎప్పుడూ వినలేదని తేలింది.

చర్లపల్లి డ్రగ్స్ కేసులోకి ఈడీ!

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చర్లపల్లి డ్రగ్స్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగనున్నది. వేల కోట్ల రూపాయల డ్రగ్స్ దందాలో హవాలా రూపంలో నగదు తరలింపుపై దృష్టిపెట్టిన ఈడీ అధికారులు.. త్వరలోనే చర్లపల్లి తతంగంపై ఈసీఐఆర్ నమోదు చేయనున్నారు. ఇప్పటికే నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చర్లపల్లిలోని వాగ్దేవి ల్యాబరేటరీస్‌లో సీజ్ చేసిన శాంపిల్స్‌ను తీసుకున్నది. మరోవైపు భారీగా నగదు చేతులు మారిందనే కోణంలో ఈడీ అధికారులు స్థానిక పోలీసుల నుంచి సమాచారం సేకరించినట్టు తెలిసింది.

వాహనాలకు రిఫ్లెక్టర్లు తప్పనిసరి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రాత్రివేళ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్ర రవాణాశాఖ రంగంలోకి దిగింది. వాహనాలు రాత్రిపూట కనిపించేలా రిఫ్లెక్టర్లు, రిఫ్లెక్టివ్ టేపులు అతికించాలంటూ ఆ శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్ శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్-1989 ప్రకారం వాహనం వెనుకభాగంలో మార్కింగ్ ప్లేట్ తప్పనిసరిగా అమర్చాలని పేర్కొన్నారు. భారీ వాహనాలు రాత్రివేళ నెమ్మదిగా వెళ్లడం, రోడ్డుపై పార్క్ చేయడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించామని తెలిపారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఈ-రిక్షాలు, ఈ-కార్ట్ వాహనాలు, 3.5 టన్నుల నుంచి 7.5 టన్నులు, అంతకంటే ఎక్కువ బరువును మోసుకెళ్లే గూడ్స్ వాహనాలు, ఏడుగురితో ప్రయాణించే క్యాబ్‌లు, ఆటోలు, 8 సీటింగ్, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలు, ట్రాక్టర్లు సహా కన్‌స్ట్రక్షన్ రంగానికి ఉపయోగపడే అన్ని వాహనాలు, ట్రైలర్లు, సెమీ ట్రైలర్లు, మాడ్యులర్ హైడ్రాలిక్ ట్రైలర్లు తప్పనిసరిగా రిఫ్లెక్టర్లు వాడాలని ఆదేశించారు.

పెద్దలకు సంచులు.. కంపెనీలకు 'బీమా' డబ్బులు!

కార్మికుల చెమట.. పెద్దలకు మూట-3

- కార్మికశాఖలోని బీమా స్కామ్‌లో సంచలన విషయాలు
- ఔటర్‌రింగురోడ్డు వద్ద కార్లు మారిన డబ్బు సంచులు
- కార్మికశాఖ అధికారికి చేరిన డబ్బు రూ.18 కోట్లకుపైనే
- 'ప్రత్యేక' అధికారికి ఇంతకు నాలుగురెట్లు ముడుపులు
- ప్రభుత్వసంస్థలను అడ్డుకున్నందుకే ముట్టాయన్న ఆరోపణలు



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి): కార్మికశాఖలో వెలుగుచూసిన బీమా కుంభకోణంలో తవ్వినకొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. స్కామ్ వెనుక ఉన్న పెద్దలకు సంచుల మూటలు అందినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ స్కామ్‌లో చక్రం తిప్పిన కార్మిక శాఖముఖ్య అధికారికి హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డులో డబ్బుల మూటలు అందాయని, ఈ తతంగాన్ని నడిపిన సీఎంవోలోని ప్రత్యేక అధికారికి నాలుగురెట్లు చేరినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. బీమా టెండర్లలో ప్రభుత్వరంగ సంస్థలు పాల్గొనకుండా నిబంధలను తెరమీదికి తెచ్చినందుకు ఈ ముడుపులు చెల్లించినట్టు తెలిసింది.

టెండర్ల నుంచే అవినీతి

వాస్తవానికి బీమా కంపెనీలు ఎటువంటి మధ్యవర్తులు లేదా బ్రోకరేజ్ కంపెనీలు లేకుండా ప్రభుత్వానికి నేరుగా కొటేషన్లు సమర్పించవచ్చు. కానీ కార్మికశాఖలోకి దానకిశోర్ ప్రవేశంతో ఇదంతా పక్కదారి పట్టినట్టు బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వరంగ బీమా కంపెనీలు టెండర్లలో పాల్గొనకుండా, ప్రైవేట్ కంపెనీలకు నిధులను ధారపోయడానికి ఆంక్షల రూపంలో అడ్డంకులు సృష్టించినట్టు చెప్తున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించినవారే టెండర్లలో పాల్గొనడానికి అర్హులనే నిబంధన తీసుకొచ్చినట్టు సమాచారం. ప్రభుత్వరంగ సంస్థలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. అదితెలిసే ఈ నిబంధనను తెచ్చారని చెప్తున్నారు. ఫలితంగా న్యూ ఇండియా అస్యూరెన్స్, నేషనల్, ఓరియంటల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ఈ టెండర్‌కు దూరమయ్యాయని సమాచారం. దీంతో బీమా సొమ్ము ప్రైవేట్‌కు వెళ్లిపోయింది.

ఈయనకు రెండు సంచులు.. సార్‌కు నాలుగు రెట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత రెండేండ్లకాలంలో సంక్షేమ బోర్డు వెబ్‌సైట్‌లో 53,940 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి క్లెయిమ్‌ల విలువ రూ.321.95 కోట్లు అని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అంటే ఈ లెక్కన వార్షిక సగటు చెల్లింపులు రూ.150 కోట్లు కూడా మించబోవని బీమా రంగ నిపుణులు చెప్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ప్రైవేట్ బీమా రంగ కంపెనీలకు ఒక్క ఏడాదికే రూ.346 కోట్లు కట్టబెట్టింది. దీనిని బట్టే ఈ కుంభకోణంలో భారీ ఎత్తున డబ్బు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని ధ్రువీకరించేలా ఇటీవల కొన్ని సంఘటనలు జరిగినట్టు కార్మిక శాఖలో చర్చ జరుగుతున్నది. గతనెల మొదటి వారంలో కార్మిక శాఖ కీలక అధికారికి చెందిన వ్యక్తి ఒకరు గచ్చిబౌలి సమీపంలోని ఔటర్ రింగురోడ్డు వద్ద కొందరి నుంచి రెండు డబ్బు సంచులను అందుకొని కారులో పెట్టుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ రెండు సంచుల్లోని డబ్బు విలువ రూ.18 కోట్లకుపైనే అనే ప్రచారం జరుగుతున్నది. ఈ వ్యవహారాన్ని అదేశాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు వీడియో తీసినట్టుగా టంగుటూరి అంజయ్యభవన్‌లో చెప్పుకుంటున్నారు. ఈ కుంభకోణానికి కర్త, కర్మగా నిలిచి, సీఎంవోలో చక్రంతిప్పిన ప్రత్యేక అధికారికి అంతకు నాలుగు రెట్ల ముడుపులు అందినట్టు సమాచారం.

షెల్ కంపెనీల ప్రవేశం

ఏపీ ప్రభుత్వం అమలుచేసి అభాసుపాలైన బ్రోకింగ్ లైసెన్స్ విధానాన్నే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెత్తికి ఎత్తుకున్నది. కార్మికశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా దానకిశోర్ ఈ వ్యవహారాన్ని చక్కబెట్టినట్టు బీమారంగ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఓపెన్‌టెండర్ విధానంలో ట్రెయిల్ బ్లేజర్ అనే బ్రోకర్ కంపెనీకి బాధ్యతలు ఖరారుచేశారు. ట్రెయిల్ బ్లేజర్‌తో కలిపి ఏడు బ్రోకర్ కంపెనీలు ఈ బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. విచిత్రం ఏమిటంటే.. ఈ ఏడు కంపెనీలు కూడా ట్రెయిల్ బ్లేజర్‌కి షెల్ కంపెనీలేనని విశ్వసనీయంగా తెలిసింది. ఒకే వ్యక్తి ఈ కంపెనీల వెనకుండి బిడ్డింగ్‌లో పాల్గొన్నట్టు సమాచారం. ప్రైవేట్ బీమా సంస్థల టెండర్లలోనూ ట్రెయిల్ బ్లేజర్ కంపెనీ ప్రతినిధులే ఈఎండీ కట్టి మరీ టెండర్ వేయించి ప్రక్రియను పూర్తిచేసినట్టు తెలుస్తున్నది. అంటే, రూ.250 కోట్లు దారిమళ్లిన పరపతి లేని 'క్రెడిట్ యాక్సెస్' కంపెనీకి టెండర్ దక్కడంలోనూ ట్రెయిల్ బ్లేజర్ కంపెనీ పాత్ర ఉన్నట్టు స్పష్టమవుతున్నది.

అప్పుడు ఏపీలోనూ ఇలాగే..

ఏపీలో గత ప్రభుత్వ హయాంలో బీమా విధానంలో బ్రోకర్ సంస్థలను ప్రవేశపెట్టింది. దాదాపు 15 ప్రభుత్వ రంగ సంస్థలను బ్రోకర్ బీమా కంపెనీల గొడుకు కిందకు తీసుకువచ్చి గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని అక్కడ అమలుచేశారు. దీనికి ఓ బీమారంగ కన్సల్టెంట్‌ను ప్రభుత్వంలోకి తీసుకొని ప్రత్యేక అధికారాలు కట్టబెట్టారు. ఆయన ఏపీజీఐసీఎల్ (ఆంధ్రప్రదేశ్ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్) స్థాపించి, గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ కోసం టెండర్లు పిలిచారు. టెండర్లలో పాల్గొనటానికి డిపాజిట్ నిబంధనను అమల్లోకి తీసుకొచ్చి, ప్రభుత్వ బీమా రంగ సంస్థలు టెండర్‌లో పాల్గొనకుండా చేశారు. దీంతో ప్రైవేటు కంపెనీలకు తివాచీ పరిచారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విధానాన్ని ఐఆర్‌డీఏఐ (భారత బీమా నియంత్రణ మరియు అభివృద్ధి సంస్థ) కూడా వ్యతిరేకించింది. దీన్ని చట్టవిరుద్ధమైన పాలసీగా పేర్కొన్నది. ఏపీ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లింది. ఏపీజీఐసీఎల్ పాలసీని ఐఆర్‌డీఏఐ వ్యతిరేకించిన నేపథ్యంలో ఏపీఅర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్) ద్వారా బ్రోకింగ్ లైసెన్స్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. రెండేండ్ల వ్యవధిలోనే ఈ విధానంపై ప్రజలు, ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో వెనక్కి తగ్గారు.

మా ప్రభుత్వం మళ్ల వస్తదో లేదో!

మొదటిపేజీ తరువాయి...

ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ 'నేను ఎలాంటి హామీలు ఇవ్వను. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో నేను గెలుస్తానో లేదో తెలియదు, నేను గెలిచినా మా పార్టీ గెలుస్తుందో లేదో తెలియదు, ప్రభుత్వం ఉంటుందో లేదో తెలియదు..ఈ సంక్షేమ పథకాలు ఉంటాయో లేదో తెలియదు.. సమస్యల పరిష్కారానికైతే కృషి చేస్తా' అంటూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. మంత్రి మాట్లాడిన ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కాగా నెటిజన్లు కామెంట్లతో ఆడుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తల్లో సైతం మంత్రి వ్యాఖ్యలు చర్చనీయాంశానికి దారి తీశాయి.

సీడ్ సర్టిఫికేషన్ అథారిటీకి అరుదైన గౌరవం

- 'విత్తన పరీక్ష-ధ్రువీకరణ' ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపిక

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీకి అరుదైన గౌరవం దక్కింది. భారత ఆహార వ్యవసాయ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'ఇండియా-ఆఫ్రికా సమ్మిట్'లో తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ 'విత్తన పరీక్ష-ధ్రువీకరణ ఎక్సలెన్సీ' అవార్డుకు ఎంపికైంది.

ఉద్యాన పంటల సాగుకు 40% రాయితీ

- ఉద్యానవనశాఖ కమిషనర్ యాస్మిన్ బాషా

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో తోటల విస్తీర్ణం పెంపునకు సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం(ఎంఐడీహెచ్)కింద 2025-26 సంవత్సరానికిగాను మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటలకు 40 శాతం రాయితీ కల్పించనున్నట్టు ఉద్యానవన శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పంచాయతీ కార్యదర్శి కేసు పెట్టించిందని..

- చెరువులో దూకి దళిత మహిళ ఆత్మహత్య
- కేసు నమోదు చేయాలి: దళిత సంఘాలు

చేగుంట, సెప్టెంబర్12: పంచాయతీ కార్యదర్శి తనపై కేసు పెట్టించారని మనస్తాపానికి గురైన ఓ దళిత మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండి లక్ష్మి (42)తో ఈ నెల 4న పంచాయతీ కార్యదర్శికి ఎస్సీ కాలనీలో గొడవ జరిగింది. ఈ ఘటనపై స్థానికులు లక్ష్మితో కాళ్లు పట్టించారు. అయినా కనకరించని కార్యదర్శి చేగుంట పోలీస్ స్టేషన్‌లో తన విధులకు ఆటంకం కలిగించిందని లక్ష్మిపై కేసుపెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి శుక్రవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి ఆత్మహత్యకు కార్యదర్శే కారణమంటూ దళిత సంఘాలు ఆరోపించాయి. కార్యదర్శిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబసభ్యులు పంచాయతీ కార్యదర్శిపై చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నట్టనడి సిటీలో హత్య

మొదటిపేజీ తరువాయి...

సికింద్రాబాద్ ప్రాంతాలకు చెందిన వారితో కలిసి వ్యాపారం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా లాలాపేట్‌కు చెందిన డానియల్, ధన్‌రాజ్‌లను తనకు బౌన్సర్లుగా, వ్యాపారంలో సహాయకులుగా నియమించుకున్నాడు. తన నివాసానికి కొద్దిదూరంలోనే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నాడు. డానియల్, ధన్‌రాజ్‌పై లాలాపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్నట్టు తెలిసింది. కొంతకాలంగా శ్రీకాంత్‌రెడ్డి భోగారంలో ఒక ల్యాండ్ సెటిల్‌మెంట్ చేస్తున్నాడు. ఈ ల్యాండ్ సెటిల్‌మెంట్ విషయంలో డానియల్, ధన్‌రాజ్ కొంత సాయపడినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా ఒక్కొక్కరికి కోటి రూపాయలు ఇస్తానంటూ శ్రీకాంత్ హామీ ఇచ్చాడు. తర్వాత జాప్యం చేస్తూ వచ్చాడు. భోగారం సైట్ నుంచి డబ్బులు వచ్చినా తమకు ఇవ్వడం లేదంటూ కోపం పెంచుకున్నారు. శ్రీకాంత్‌ను అడ్డు తొలగిస్తే భోగారం ల్యాండ్ ఇష్యూకు సంబంధించి తామే నేరుగా కాంటాక్టు పెట్టుకోవచ్చని ప్లాన్ చేశారు. ఈ క్రమంలో శ్రీకాంత్‌రెడ్డితో శుక్రవారం మధ్యాహ్నం ఆఫీస్‌లో కూర్చుని మద్యం తాగారు. సాయంత్రం 5 గంటలకు శ్రీకాంత్ రెడ్డి ఇంటికి వెళ్తుండగా యాక్టివాపై డానియల్, ధన్‌రాజ్ వెంబడిస్తూ వెళ్లారు. కార్యాలయం వద్ద ప్రజల సందడి ఎక్కువ ఉండటంతో కాలనీలో అయితే ఎవరూ ఉండరని భావించి శ్రీకాంత్ ఇంటి దరిదాపుల్లో ఆటకాయించి కత్తితో పొడిచి చంపారు. అనంతరం తాపీగా నడుచుకుంటూ వెళ్లారు. వారిలో ఒకరు 'శ్రీకాంత్‌రెడ్డిని నేనే చంపిన' అంటూ స్థానికులతో చెప్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. కుషాయిగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.



శ్రీకాంత్‌రెడ్డిని హత్య చేస్తున్న నిందితుడు

పట్టపగలే దారి దోపిడీ

మొదటిపేజీ తరువాయి...

ప్రయాణమయ్యారు. శంకర్‌పల్లి మండలం హుస్సేన్‌పూర్ చేరుకోగానే నలుగురు దుండగులు స్విఫ్ట్ డిజైర్ కారులో వెంబడిస్తూ నిర్మానుష్య ప్రాంతంలో అటకాయించారు. కారు నడుపుతున్న మణి కండ్లలో కారం కొట్టి దాడి చేశారు. కారు అద్దాలు పగులగొట్టి వెనక కూర్చున్న సాయిబాబాను బొమ్మ తుపాకీతో బెదిరించి రాయితో కొట్టి అతడి వద్ద నుంచి రూ.40 లక్షల నగదు ఉన్న బ్యాగును లాక్కెళ్లారు. దుండగులు పారిపోతున్న క్రమంలో వారి కారు కొత్తపల్లి శివారులో అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది.

కారును అక్కడే వదిలి డబ్బుతో దుండగులు పరారయ్యారు. కారు బోల్తాపడ్డ శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు చేరుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్, ఫింగర్ ప్రింట్స్, డాగ్స్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. దుండగులను పట్టుకునేందుకు సీసీఎస్, ఎస్‌వోటీ విభాగాలతో నాలుగు బృందాలను రంగంలోకి దింపారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో దుండగులను గుర్తించినట్టు తెలిసింది. స్టీల్ వ్యాపారి సిబ్బంది డబ్బు తీసుకెళ్తున్న విషయం దుండగులకు ఎలా తెలిసింది? వారు ఎక్కడి నుంచి అనుసరిస్తూ వచ్చారు? అనే అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. వ్యాపారులకు తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.



దుండగులు ఉపయోగించిన డమ్మీ తుపాకీ, కత్తి, ఇతర వస్తువులు

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులు

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 12 : జగిత్యాల జిల్లా పెగడపెల్లి తహసీల్దార్ రవీందర్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్టు జగిత్యాల సీఐ కరుణాకర్ తెలిపారు. జగిత్యాలలోని ఓ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనను రవీందర్ నాయక్‌కు అప్పగించారు. ఈ క్రమంలో సహాయకారిగా ఉన్న మహిళా ఉద్యోగి తనపై తహసీల్దార్ అసభ్యకరంగా ప్రవర్తించాడని, బలవంతంగా కారులో ఎక్కించుకెళ్లి లైంగికదాడి చేశాడని చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్‌పై కేసు నమోదైంది.

రెండేండ్ల కూతురుని చంపిన తల్లి

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని ఘాతుకం
- మెదక్ జిల్లా శబాష్‌పల్లిలో ఘటన

శివ్వంపేట, సెప్టెంబర్ 12 : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని భావించిన తల్లి కన్న కూతురిని హత్య చేసిన ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శబాష్‌పల్లికి చెందిన బొట్టు మమత తన కూతురు తనుశ్రీ(2)తో కలిసి అదే గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్ వెంట మే నెల 21న వెళ్లిపోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా గురువారం వీరిని గుంటూరులో అదుపులోకి తీసుకున్నారు. మమత కూతురు కనిపించకపోవడంతో ఏం చేశారని పోలీసులు విచారించగా తమ సంబంధానికి అడ్డుగా ఉందని, శబాష్‌పల్లి శివారులో చంపి పాతిపెట్టామని ఒప్పుకున్నారు. ఘటనా స్థలాన్ని మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగకృష్ణ, ఎస్సై మధుకర్‌రెడ్డి పరిశీలించారు. శవాన్ని బయటకు తీసి తహసీల్దార్ కమలాద్రి, డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేయించారు.

ఆదిలాబాద్‌కు పోవాలంటే.. మహారాష్ట్రకు పోవాల్నా..?

- రెండు రైల్వే లైన్లను విస్మరిస్తున్న సీఎం
- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏపీ విభజన చట్టంలోనిదే..
- ఆదిలాబాద్ -నిర్మల్ -ఆర్మూర్, కరీంనగర్-కాజీపేటకు కొత్త లైన్లు వేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాలకు వెళ్లాలంటే, మహారాష్ట్రకు వెళ్లాల్సి వస్తున్నదని, పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్లపై మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించడం లేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన రెండు లైన్లను విస్మరించి, హైదరాబాద్- అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుపై ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ విభజన చట్టంలోనే ఈ ప్రతిపాదన ఉందని, ఇందులో సీఎం రేవంత్ గొప్పదనం ఏమీలేదని దుయ్యబట్టారు. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ మీదుగా కాజీపేట, ఆదిలాబాద్- నిర్మల్- ఆర్మూర్ వచ్చే రైల్వే లైన్లకు తాను ఎంపీగా ఉన్నప్పుడే సర్వే, డీపీఆర్ చేయించినట్టు గుర్తుచేశారు. ఇవి పూర్తయితే రాష్ట్రంలో పది జిల్లాలలకు రైల్వే అనుసంధానం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుపై కాంగ్రెస్, బీజేపీలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. రెండు కొత్త రైల్వే లైన్లు చేపట్టాలని సీఎం, సీఎస్, ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్‌కు లేఖ రాస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గాదరి బాలమల్లు పాల్గొన్నారు.

మిజోరాంలో కొత్త రైల్వే లైన్ ప్రారంభం

- నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ
- 51 కిలో మీటర్ల కోసం కొండల్లో 45 టన్నెళ్లు ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): మిజోరాం రాజధాని ఐజ్వాల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 51.38 కిలోమీటర్ల రైల్వే లైన్‌ను శనివారం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి 2014లో శంకుస్థాపన చేశారు. దాదాపు పదకొండేళ్ల పాటు కొనసాగిన ఈ ప్రాజెక్టు కోసం కేంద్రప్రభుత్వం రూ.8000 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. ఐజ్వాల్‌కు సమీపంలో బైరాబీ నుంచి సైరంగ్ వరకు నిర్మించిన ఈ 51.38 కిలోమీటర్ల రైల్వే లైన్ కోసం 45 కొండలను తొలిచి టన్నెళ్లు నిర్మించారు. ఈ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా నిర్మించిన ఒక వంతెన అత్యంత లోతు నుంచి పిల్లర్లు నిర్మించారు. ఇది కుతుబ్‌మినార్ కంటే ఎత్తైనదిగా దక్షిణ మధ్య రైల్వే జోన్ సీపీఆర్‌వో ఏ శ్రీధర్ స్పష్టం చేశారు. అండర్ పాసులు, వంతెనలు కలిపి 153 నిర్మించినట్టు తెలిపారు. వాటిలో 55 మేజర్ బ్రిడ్జిలు ఉన్నాయి. 97వ నంబర్ బ్రిడ్జిని 742 మీటర్లు పొడవుతో నిర్మించారు. 144వ బ్రిడ్జికి 114 మీటర్ల ఎత్తున పిల్లర్లు నిర్మించారు. బ్రిడ్జిల నిర్మాణం 11.78 కిలోమీటర్ల మేర జరిగింది.

సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డికి హైకోర్టు నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీనియర్ న్యాయవాది కే ప్రతాప్‌రెడ్డి (94)కి హైకోర్టు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అధ్యక్షతన హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు సమావేశమై ప్రతాప్‌రెడ్డి కుటుంబానికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి న్యాయవ్యవస్థకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ప్రతాప్‌రెడ్డి కార్యాలయం నుంచి న్యాయవాదులుగా వృత్తిని ప్రారంభించిన వారు హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగారని చెప్పారు. ప్రతాప్‌రెడ్డి కుటుంబసభ్యులు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ నరసింహారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో కుళ్లిపోయిన కోడిగుడ్ల కలకలం



గోవిందరావుపేట, సెప్టెంబర్ 12: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్‌లో రెండు అంగన్‌వాడీ సెంటర్ల నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేసిన కుళ్లిపోయిన కోడిగుడ్ల దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరిని వివరణ కోరగా.. కుళ్లిపోయిన కోడిగుడ్ల విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. రెడ్ స్టాంప్‌తో ఉన్న కోడిగుడ్లను ఈ నెల 2న సెంటర్ ద్వారా లబ్ధిదారులకు అందించామని తెలిపారు. సూపర్‌వైజర్ శారద గ్రామంలో విచారణ చేపట్టారు.



రఘురామ్ పిల్లరిశెట్టికి అరుదైన గౌరవం

- బ్రిటన్‌లోని గ్లాస్గో రాయల్ కాలేజీ నుంచి గౌరవ ఫెలోషిప్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కిమ్స్ ఉషాలక్ష్మీ బ్రెస్ట్ డిసీజెస్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్‌లోని రాయల్ కాలేజీ ఆయనకు ఎఫ్ఆర్‌సీఎస్ (ఫెల్లో ఆఫ్ రాయల్ కాలేజీ సర్జన్స్) ప్రదానం చేసింది. దక్షిణాసియాలో ఈ ఘనత సాధించిన తొలి పిన్న వయస్కుడిగా ఆయన చరిత్ర సృష్టించారు. అవార్డు ప్రదానం చేసిన అనంతరం గ్లాస్గో రాయల్ కాలేజీ ఆఫ్ ఫిజిషియన్స్ అండ్ సర్జన్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనీ ఎటీబా మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా రొమ్ము క్యాన్సర్‌పై పోరాటంలో రఘురామ్ విశేష కృషి చేశారని కొనియాడారు. రొమ్ము క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ప్రశంసించారు. రఘురామ్ మాట్లాడుతూ.. అత్యున్నత గౌరవాన్ని అందించినందుకు గ్లాస్గో రాయల్ కాలేజీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టాప్ కాలేజీల్లోనూ సీట్లు ఖాళీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): డిగ్రీ కాలేజీల్లో టాప్ కాలేజీలుగా పేరొందిన కాలేజీల్లో మొత్తం సీట్లు నిండటం లేదు. డిమాండ్ ఉన్న కీలక కాలేజీల్లో సీట్లు మిగులుతున్నాయి. నిజాం కాలేజీలో డిగ్రీ ఫస్టియర్‌లో ఈ సారి 205 సీట్లు భర్తీకాలేదు. సిటీ కాలేజీలో 261 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇలా టాప్ కాలేజీల్లో సీట్లు మిగలడం గమనార్హం. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరింది. ఈ మిగులు సీట్ల భర్తీకి అధికారులు స్పాట్ అడ్మిషన్లు విడుదల చేశారు. 15,16న స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మెరిట్ లిస్ట్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఎంబీబీఎస్, బీడీఎస్ 2025-26 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను కాళోజీ హెల్త్ యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. మెరిట్ లిస్టులో అభ్యంతరాలుంటే సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా ఫిర్యాదులను పంపాలని వర్సిటీ తెలిపింది.

ఇంటర్ ఉద్యోగుల రెన్యువల్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఇంటర్ విద్యలో పనిచేస్తున్న 970 మంది ఉద్యోగులను రెన్యువల్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కాంట్రాక్ట్, గెస్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఏడాది కాలానికి కొనసాగించేందుకు అనుమతి ఇచ్చింది. 420 మంది కాంట్రాక్ట్, 51 మంది పార్ట్ టైమ్(అవర్లీ), 42 మంది పార్ట్‌టైమ్(కన్సాలిడేటెట్ పే), 56 మంది ఔట్‌సోర్సింగ్, ముగ్గురు మినిమం టైం స్కేల్, 398 మంది గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించేందుకు అనుమతి ఇచ్చింది.

సంఖ్యాబలం లేని సంఘాలకు చోటా: పీఆర్టీయూ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో కూడిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో సంఖ్యాబలం లేని, సభ్యత్వాలు లేని సంఘాలకు చోటు కల్పించడంపై పీఆర్టీయూ తెలంగాణ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఉమ్మడి ఏపీలో ఉన్న జీవో ప్రకారం తెలంగాణ అని మార్చి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. సర్కారు తీరును సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రావు శుక్రవారం ప్రకటనలో తప్పుబట్టారు. నోటిఫికేషన్ జారీచేసి, సభ్యత్వం, సంఖ్యాబలం ఆధారంగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో చోటు కల్పించాల్సిందని అభిప్రాయపడ్డారు.

'సెక్టోరల్ ఆఫీసర్లుగా నియమించండి'

సమగ్రశిక్ష జిల్లా కో ఆర్డినేటర్లు, సెక్టోరల్ ఆఫీసర్లుగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని తెలంగాణ గెజిటెడ్ హెచ్ఎం అసోసియేషన్ కోరింది. సంఘం అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జీ హేమచంద్రుడు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ నవీన్‌కు వినతిపత్రం సమర్పించారు.

75% హాజరు తప్పనిసరి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఉన్నత విద్యాసంస్థల్లో 75% హాజరును తప్పనిసరిగా అమలుచేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. హైకోర్టు తీర్పు సహా యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనల మేరకు 75% హాజరును ఈ ఏడాది నుంచి కఠినంగా అమలుచేయాలని నిర్ణయించింది. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో వైస్‌చాన్స్‌లర్ల సమావేశం నిర్వహించారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): 2025-26 విద్యాసంవత్సరానికి ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ దరఖాస్తులు కోరుతున్నది. బీడీ, గనుల, సినీ కార్మికుల పిల్లలు ఈ ఆర్థిక సహాయానికి అర్హులు అని కేంద్ర కార్మిక శాఖ కమిషనర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వరకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు, అక్టోబర్ 31 వరకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గడువు పొడిగించినట్టు తెలిపారు.

టెట్ మినహాయింపు కోరుతూ కలెక్టర్లకు వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలని కోరుతూ ఈ నెల 15న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్టు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఒక ప్రకటనలో తెలిపింది.

నీట్ విద్యార్థుల మెరిట్ లిస్ట్ విడుదల

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 12: కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం 2025-26 విద్యాసంవత్సరం ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించింది. అందులో భాగంగా శుక్రవారం నీట్ అర్హత సాధించిన విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. పూర్తి సమాచారం కోసం WWW.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌ని పరిశీలించాలని సూచించింది.

హెచ్‌సీయూ యూనియన్ రద్దు వెనుక కుట్ర!

- నిబంధన పాటించలేదని విద్యార్థుల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి యూనియన్ రద్దు వెనుక కుట్ర దాగి ఉన్నట్టు తేటతెల్లమైంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏడాది గడువు ముగియక ముందే ఎలక్టెడ్ బాడీ అయిన యూనియన్ రద్దు నిర్ణయానికి ముందుగానే ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇదంతా కావాలనే ప్లాన్ ప్రకారం చేశారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. రద్దు నిర్ణయం, ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు నిర్ణయం ఒకేరోజు తీసుకున్నా.. ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ఒకరోజు ముందుగానే ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తున్నారు. వీసీ, రిజిస్ట్రార్, విద్యార్థి సంక్షేమ డీన్‌కు ప్రస్తుతం ఉన్న స్టూడెంట్ యూనియన్ పూర్తిస్థాయిలో కొనసాగడం ఇష్టం లేకే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

'అపార్'లో గురుకులం పూర్

- 40% మందికి ఇంకా పూర్తికాలే
- టీసీలు, ఆధార్‌లో వేర్వేరుగా పుట్టిన తేదీలు
- వెరసి అపార్‌లో నమోదుకు తిప్పలు
- 15లోగా నమోదు చేయాలని ఆదేశాలు
- తలలు పట్టుకుంటున్న గురుకుల సిబ్బంది

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్) నమోదులో గురుకుల సొసైటీలు వెనకబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 40% మంది విద్యార్థుల వివరాలను నమోదు చేయలేదని తెలుస్తున్నది. దీనిపై కేంద్ర విద్యాశాఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు 15వ తేదీలోగా పూర్తి చేయాలని అల్టిమేటం జారీ చేసినట్టు తెలుస్తున్నది. ఇదిలా ఉంటే ఇష్టారీతిన అడ్మిషన్లను ఇవ్వడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని గురుకుల అధికారులు వెల్లడిస్తున్నారు. నూతన విద్యావిధానం(2020)లో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్‌ను అమలు చేస్తున్నది. విద్యార్థులకు సంబంధించి అకాడమిక్ రికార్డును డిజిటల్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. సదరు విద్యార్థికి 12అంకెల అపార్ ఐడీ నంబర్‌ను కేటాయిస్తారు. దీనిద్వారా ఒక విద్యార్థి ఎంతవరకు చదివారు? ఎక్కడ చదివారు? తదితర వివరాలన్ని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశముంది. అయితే ఈ అపార్ నమోదులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు చాలా వెనకబడి ఉన్నాయని తెలుస్తున్నది. అపార్ నమోదును పూర్తి చేయాలని మూడు నెలల క్రితమే ఆదేశాలు జారీ చేయగా, ఇప్పటికీ గురుకులాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాలేదని తెలుస్తున్నది. గురుకులాల్లో ప్రవేశాలకు 5వ తరగతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 13ఏండ్లలోపు, ఓబీసీ, మైనార్టీ ఇతర వర్గాలకు చెందిన విద్యార్థుల వయస్సు 11ఏండ్లలోపు ఉండాలి. అదేవిధంగా 6వ తరగతిలో ప్రవేశానికి 14, 12ఏండ్లలోపు, 7వతరగతిలో ప్రవేశానికి 15,13ఏండ్లలోపు, 8వ తరగతిలో ప్రవేశానికి 16,14ఏండ్లలోపు, 9వ తరగతిలో ప్రవేశాలకు 17, 15 సంవత్సరాల లోపు వయస్సు ఉండాల్సిందే. అడ్మిషన్ల సమయంలో గురుకులాల సిబ్బంది ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని తెలుస్తున్నది. పైరవీలతో ఇష్టారీతిన సీట్లు కేటాయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి

- ప్రధాన కార్యదర్శిగా భిక్షంగౌడ్ ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికయ్యారు. శుక్రవారం నారాయణగూడలోని సంఘం కార్యాలయంలో 33 జిల్లాల అధ్యక్షప్రధాన కార్యదర్శుల సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షప్రధాన కార్యదర్శుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అడిట్ కమిటీ చైర్మన్‌గా సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌గుప్తా పాల్గొన్నారు.



భిక్షంగౌడ్



పుల్గం దామోదర్‌రెడ్డి

చిన్న పరిశ్రమలపై జీఎస్టీ దెబ్బ

లేబర్ చార్జీలపై జీఎస్టీ 18 శాతానికి పెంపు

- పెరిగిన ట్యాక్సులతో కంపెనీలను నడపలేం
- తేల్చి చెప్పేసిన ఎంఎస్ఎంఈ ప్రతినిధులు
- రోడ్డున పడనున్న లక్షలాది మంది కార్మికులు
- మోదీ హయాంలో 6.25 లక్షల కంపెనీల మూత

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం జీఎస్టీ 2.0 పేరిట తాజాగా తీసుకొచ్చిన సవరణలు కార్మికులకు శరాఘాతంగా మారాయి. లేబర్ చార్జీలపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 18 శాతానికి పెంచడంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) గడ్డు పరిస్థితులు దాపురించాయి. 22వ తేదీ నుంచి కొత్త పన్ను విధానం అమల్లోకి వస్తే, ఇక తాము కంపెనీలను మూసేసుకోవాల్సిందేనని ఎంఎస్ఎంఈ ప్రతినిధులు చెప్తున్నారు. పన్ను పెంపుపై కేంద్రం పునరాలోచించాలని డిమాండ్ చేస్తున్నారు.



తగ్గిస్తారనుకొంటే, పెంచారు

నిర్మాణ, తయారీ రంగానికి చెందిన పెద్ద పరిశ్రమలు కొన్ని ప్రాజెక్టులను కాంట్రాక్టుల రూపంలో ఎంఎస్ఎంఈలకు అప్పగిస్తాయి. అలా అప్పగించిన ప్రాజెక్టులపై లేబర్ చార్జీల పేరిట సీజీఎస్టీ చట్టం, 2017 సెక్షన్ 2(119) కింద కేంద్రప్రభుత్వం ఇప్పటివరకూ 12 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నది. దీన్ని లేబర్ ట్యాక్స్‌గా పిలుస్తున్నారు. మ్యాన్ పవర్, మెటీరియల్ సరఫరా తదితర సేవలు ఈ పన్ను కిందకు వస్తాయి. లేబర్ ట్యాక్స్ కారణంగా తమపై పెనుభారం పడుతున్నదని, కార్మికుల వేతనాల్లో కోతలు పెట్టాల్సి వస్తున్నదని ఎంఎస్ఎంఈ ప్రతినిధులు ఎప్పటినుంచో కేంద్రానికి మొరపెట్టుకొంటున్నారు. లేబర్ చార్జీలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. కాగా ఇటీవల జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ శ్లాబులను 5 శాతం, 18 శాతానికే పరిమితం చేయడంతో ఇప్పటివరకూ 12 శాతంగా ఉన్న లేబర్ ట్యాక్స్‌ను కచ్చితంగా 5 శాతం శ్లాబ్‌లోకి తీసుకొస్తారని అంతా భావించారు. అయితే, దీనికి విరుద్ధంగా తాజా సవరణలో లేబర్ ట్యాక్సును కేంద్రం తగ్గించాల్సింది పోయి.. 18 శాతానికి పెంచింది. దీంతో ఈ నిర్ణయం తమపై పెనుభారాన్ని మోపుతున్నదని ఎంఎస్ఎంఈల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల చెల్లింపులతో చిరు పరిశ్రమలు కుదేలై, మూతబడుతాయని అంటున్నారు. ఇదే జరిగితే, ఎంఎస్ఎంఈలపై ఆధారపడి పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడటం ఖాయమని చెప్తున్నారు. కేంద్రం పునరాలోచించి, వెంటనే ట్యాక్సును తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

చిరు పరిశ్రమపై చిన్నచూపు

విదేశీ దిగుమతులను తగ్గించుకోవాలని, దీని కోసం స్వదేశంలోని చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలని ప్రసంగాల్లో ఊదరగొట్టే ప్రధాని మోదీ.. విధానపర నిర్ణయాల్లో మాత్రం పన్నుల మోతతో చిరు పరిశ్రమను చిన్నచూపు చూస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే, 'మేకిన్ ఇండియా'కు తూట్లు పొడిచిన మోదీ ప్రభుత్వం.. చిరు పరిశ్రమలకు ప్రోత్సాహకాలను కూడా ఎత్తేసింది. దీంతో గడిచిన 11 ఏండ్లలో 6.25 లక్షల కంపెనీలకు తాళం పడ్డట్టు నివేదికలు చెప్తున్నాయి. లేబర్ చార్జీలపై జీఎస్టీ పెంపుతో ఇప్పుడు మరిన్ని కంపెనీలు మూతపడొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కల్లోల మణిపూర్‌కు 28 నెలల తర్వాత మోదీ

- ఎట్టకేలకు నేడు రాష్ట్రంలో పర్యటన
- మళ్లీ చెలరేగిన హింసాకాండ
- మోదీకి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన పోస్టర్లకు నిప్పు
- నిరసనకారులపై లాఠీచార్జి
- భారీగా భద్రతా దళాల మోహరింపు
- ఇన్నాళ్లకు మణిపూర్ గుర్తుకు వచ్చిందా?
- ప్రధాని మోదీపై ప్రతిపక్షాల విమర్శలు



చురాచాంద్‌పూర్‌లో ప్రధాని స్వాగత పోస్టర్లను తగులపెడుతున్న ఆందోళనకారులు

న్యూఢిల్లీ: జాతుల మధ్య వైరంతో రెండేండ్లుగా రావణకాష్టంలా రగులుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో ఎట్టకేలకు ప్రధాని మోదీ శనివారం పర్యటించనున్నారు. అల్లర్లు జరిగిన దాదాపు 28 నెలల తర్వాత ప్రధాని రాష్ట్రంలో పర్యటించనుండటం గమనార్హం. ఈ క్రమంలో రాష్ట్రంలో మళ్లీ హింస చెలరేగింది. చురాచాంద్‌పూర్‌లో ప్రధానికి స్వాగతం పలుకుతూ ఏర్పాటుచేసిన పోస్టర్లు, బ్యానర్లు, బ్యారికేడ్లను కొందరు గురువారం రాత్రి ధ్వంసం చేసి తగలబెట్టారు. దీంతో కల్లోల రాష్ట్రంలో మళ్లీ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. చురాచాంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు ఐదు కి.మీ దూరంలోని పిసన్మున్ గ్రామంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. నిరసనకారులను అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు గాయపడ్డారు. కాగా, 2023 మే 3న ప్రారంభమైన జాతి కలహాలకు శాశ్వత పరిష్కారం కోసం చర్చలు ప్రారంభించకపోతే రాష్ట్రం మొత్తాన్ని మూసివేస్తామని రాష్ట్రంలోని తీవ్ర వాద గ్రూపుల సమన్వయ కమిటీ హెచ్చరించింది. కల్లోలం మొదలైన 28 నెలల తర్వాత ప్రధాని మోదీ జరుపుతున్న పర్యటనను పురస్కరించుకుని ఇంఫాల్‌లో ప్రధాని పాల్గొనే కాంగ్లా ఫోర్ట్, చురాచాంద్‌పూర్‌లోని పీస్ గ్రౌండ్ వద్ద పెద్ద యెత్తున సీఆర్‌పీఎఫ్, పోలీసులను మోహరించారు. ఫోర్టు చుట్టూ ఉన్న జలాల్లో బోట్లతో గస్తీ నిర్వహిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ మిజోరాం, మణిపూర్, అస్సాం రాష్ట్రాలలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. గత కొద్ది నెలలుగా రిజర్వేషన్ల ఆందోళనలతో అస్సాం రాష్ట్రం కూడా అట్టుడుకుతున్నది.

ఇన్నాళ్లకు గుర్తుకు వచ్చిందా?

కుకీ, మైతీ తెగల మధ్య 2023 మేలో మొదలైన ఘర్షణలతో మణిపూర్ అట్టుడుకుతున్నది. ఘర్షణల్లో 200 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన యావత్ దేశాన్ని కలచివేసింది. వేలాది మంది నిరాశ్రయులై సహాయ శిబిరాలలో ఆశ్రయం పొందుతున్నారు. ఆ రాష్ట్రంలో అల్లర్లు చెలరేగిన తర్వాత ప్రధాని ఒక్కసారి కూడా ఆ రాష్ట్రాన్ని పర్యటించి శాంతి భద్రతలను సమీక్షించకపోవడాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతూ వస్తున్నాయి. ఇన్నాళ్లకు మోదీకి మణిపూర్ గుర్తుకు వచ్చిందా? అని పలు వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. హింస చోటుచేసుకున్న రెండేళ్ల తర్వాత మోదీ ఈ రాష్ట్రంలో తొలిసారిగా పర్యటించనున్నారు. కాగా, శనివారం మోదీ రాష్ట్రంలో రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని మణిపూర్ చీఫ్ సెక్రటరీ పునీత్ కుమార్ గోయల్ తెలిపారు. మిజోరాం నుంచి ఆయన మొదట చురాచాంద్‌పూర్ వస్తారని, అక్కడి నుంచి ఇంఫాల్‌కు చేరుకుంటారని చెప్పారు. ప్రధాని చురాచాంద్‌పూర్, ఇంఫాల్‌లలో ప్రజలతో భేటీ అవుతారు. వారి సమస్యలను ఆలకిస్తారు.ప్రధాని పర్యటనతో రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. కాగా, రెండేండ్లుగా హింసతో రగులుతున్న మణిపూర్‌లో ప్రధాని పర్యటించడం పెద్ద విషయం కాదని, ఇప్పుడు ఓటు చోరీయే ప్రధాన అంశమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రెండేళ్లుగా హింసతో రగులుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉన్న రాష్ట్రాన్ని సందర్శించడానికి మోదీకి ఇంత కాలం పట్టిందా? అని విపక్షాలు నిలదీశాయి.

అస్సాంలోనూ అదే సీన్

అస్సాంలోనూ పర్యటించనున్న ప్రధానికి అక్కడ కూడా నిరసన సెగ తగిలే అవకాశం ఉంది. 2014లో ప్రధానమంత్రి చేసిన వాగ్దానాలను గుర్తు చేయాలనుకునే స్థానిక వర్గాలు ఇప్పటికే రాష్ట్రంలో భారీ నిరసనలు నిర్వహించారు. ఆయన చేసిన వాగ్దానాలు ఇంకా నెరవేరలేదని వారు అంటున్నారు. బీజేపీ కనుక అధికారంలోకి వస్తే పలు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా కల్పిస్తామని అస్సాంలో 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ హామీనిచ్చారు. అయితే మోదీ ఇచ్చిన హామీ నెరవేరలేదని అహోమ్, మోరన్, మతక్, టీ ట్రైబ్, చుటియా, కోచ్-రాజ్‌బొంవషిస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తర్వాతి ఎన్నికల్లో సైతం అదే వాగ్దానం చేసినా దానిని నిలబెట్టుకోలేదని వీరు విమర్శిస్తున్నారు. 2026లో అస్సాం అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈ వర్గాలు తమ డిమాండ్లను పునరుద్ధరిస్తూ జూలై నుంచి ఆందోళన నిర్వహిస్తున్నాయి. ఇక వీరిలో కోచ్-రాజ్‌బోంగోషిస్ వర్గీయులైతే తమకు ప్రత్యేక కాంతాపూర్ రాష్ట్రం కావాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 3న ఈ వర్గం విద్యార్థులు జరిపిన కాగడాల ప్రదర్శన లాఠీచార్జికి దారితీసి హింసాత్మకంగా మారింది. దీంతో 4న వారు దుబ్రీ జిల్లాలో 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 3న మోరన్ సామాజిక వర్గం 20 వేల మందితో ప్రదర్శన జరపడం మీడియా దృష్టిని ఆకర్షించింది. ప్రజల కష్టాలను ఆలకించకుండా అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం వారిపై పోలీసులతో దారుణంగా దాడి చేయిస్తున్నదని అస్సాం కాంగ్రెస్ చీఫ్ గొగోయ్ ఆరోపించారు.

పాలస్తీనాకు అనుకూలంగా భారత్ ఓటు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: పాలస్తీనా ఏర్పాటు కోసం ఐక్యరాజ్యసమితిలో పెట్టిన తీర్మానానికి భారత్ మద్దతు పలికింది. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య శాంతియుత పరిష్కారం, 'రెండు దేశాల పరిష్కార మార్గం' అమలుపై న్యూయార్క్ డిక్లరేషన్‌ను ఆమోదించే తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఫ్రాన్స్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అనూహ్యంగా 142 దేశాల మద్దతు లభించింది. అన్ని గల్ఫ్ దేశాలు వీటికి అనుకూలంగా ఓటు వేయగా, ఇజ్రాయెల్, యూఎస్, అర్జెంటీనా, హంగేరి, నార్వే, పపువా న్యూగినియా, టాంగా లాంటి దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. కాగా, గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని 193 సభ్యుల జనరల్ అసెంబ్లీ ఈ సందర్భంగా ఖండించింది.

కూతురి పెండ్లి ఖర్చులు తండ్రి బాధ్యత

సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ: కుమార్తె వివాహానికి అయ్యే సమంజసమైన ఖర్చులను భరించడం తండ్రి సహజ కర్తవ్యమని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. దంపతులకు విడాకుల మంజూరును సమర్థిస్తూ, కుమార్తె పెళ్లి కోసం రూ.10 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. భార్యతో విభేదాలతో సంబంధం లేకుండా తండ్రిగా ఇది నెరవేర్చవలసిన కర్తవ్యమని పేర్కొంది. కుటుంబ న్యాయస్థానం 2019లో మంజూరు చేసిన విడాకుల డిక్రీలో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని తెలిపింది. ప్రస్తుత కేసులో భార్య తన ఇద్దరు పిల్లలను తన సొంతంగానే పెంచి పోషించారని గుర్తు చేసింది.

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి

- ప్రమాణం చేయించిన అధ్యక్షుడు
- పదవి చేపట్టిన తొలి మహిళగా రికార్డు
- దేశ తొలి మహిళా సీజేగానూ ఘనత
- 6 నెలల్లోగా ప్రతినిధుల సభకు ఎన్నికలు



కాఠ్మండు: నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రిగా జస్టిస్ సుశీల కర్కి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె చేత దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రమాణం చేయించారు. నేపాల్ పీఎం పదవిని చేపట్టిన తొలి మహిళగా సుశీల నిలిచారు. దేశ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా కూడా ఆమె రికార్డు సృష్టించారు. నేపాల్ రాష్ట్రపతి భవన్‌లో రాత్రి 9.30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కొద్ది మంది మంత్రులతో మంత్రివర్గం ఏర్పాటుచేసిన కర్కి.. వెంటనే వారితో క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. 2026 మార్చి 4న ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించినట్టు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నది. దేశంలో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎమర్జెన్సీ విధించాలని కూడా కర్కి ప్రతిపాదించినట్టు సమాచారం. క్యాబినెట్ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తర్వాత, దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ అమల్లోకి రానున్నది. అంతకుముందు జెన్ జెడ్ ప్రతినిధుల బృందం కర్కి నాయకత్వానికి అంగీకారం తెలిపింది. అయితే పార్లమెంట్‌ను రద్దు చేయాలని షరతు విధించింది. కాగా, ప్రమాణ స్వీకారానికి ఉభయ సభల అధిపతులు హాజరుకాలేదు.

ఎవరీ సుశీల కర్కి?

సుశీల కర్కి దేశంలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నేపాల్ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. 2016లో అప్పటి ప్రధాని కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు సుశీల కర్కిని అప్పటి అధ్యక్షురాలు బిద్యా దేవి భండారీ ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఉపాధ్యాయురాలిగా తన వృత్తిపర జీవితాన్ని ప్రారంభించిన కర్కి అనంతరం న్యాయ వ్యవస్థలోకి ప్రవేశించారు. నిర్భయంగా, సమర్థంగా, అవినీతి రహితంగా ఆమె తన బాధ్యతలు నిర్వర్తించి ప్రజల మన్ననలు అందుకున్నారు. ఆమె బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేశారు. త్రిభువన్ విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 2009 జనవరి 22న నియమితులయ్యారు. 2016 ఏప్రిల్ 13న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016 జూలైలో నేపాల్ ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2017 మే నెల వరకు ఈ పదవిలో కొనసాగారు. పదవీ విరమణ తేదీకి 40 రోజుల ముందు అభిశంసనకు గురయ్యారు. నేపాల్‌లో అభిశంసనకు గురైన మొదటి ప్రధాన న్యాయమూర్తి ఆమె. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య అని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ఇదిలావుండగా, ఈ తాత్కాలిక ప్రభుత్వం ఆరు నెలల్లోగా ప్రతినిధుల సభకు ఎన్నికలను నిర్వహిస్తుంది.

తగలబడుతున్న హోటల్ నుంచి దూకిన భారతీయ మహిళ మృతి

ఘజియాబాద్ నుంచి నేపాల్‌లోని పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వెళ్లిన దంపతుల జీవితాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఈ దంపతులు కాఠ్మాండులోని పశుపతినాధుని దేవాలయానికి వెళ్లడం కోసం ఈ నెల 7న బయల్దేరారు. ఈ నెల 9న వారు బస చేసిన ఫైవ్ స్టార్ హోటల్‌ను నిరసనకారులు తగులబెట్టారు. వీరిద్దరూ ఓ కిటికీ గుండా బయటకు రావడానికి ప్రయత్నించారు. కానీ పొగ, మంటలు వ్యాపించడంతో తప్పించుకోలేకపోయారు. సహాయక బృందాలు కింద చాపలను పరచి, హోటల్ భవనం నుంచి కిందికి దూకేయాలని చెప్పారు. రామ్‌వీర్, రాజేశ్ దేవి నాలుగో అంతస్థు నుంచి దూకేశారు. రాజేశ్ దేవి తీవ్రమైన వెన్నెముక గాయాలతో చికిత్స పొందుతూ ఈ నెల 10న తుది శ్వాస విడిచారు. మరోవైపు కాఠ్మాండు నుంచి భారత్‌కు తిరిగి వస్తున్న ఇండియన్ టూరిస్ట్ బస్సుపై నిరసనకారులు దాడి చేశారు. ఈ నెల 9న జరిగిన ఈ దాడిలో పలువురు గాయపడినట్లు బస్సు డ్రైవర్ చెప్పారు. పశుపతినాథ్ గుడికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది.

బాణసంచాపై దేశవ్యాప్తంగా నిషేధం ఉండాలి

ఢిల్లీలోని విశిష్ట ప్రజలకు మాత్రమే ఎందుకు: సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: బాణసంచాపై నిషేధాన్ని ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి మాత్రమే ఎందుకు పరిమితం చేయాలని, దేశవ్యాప్తంగా ఎందుకు నిషేధించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. దేశ రాజధాని నగరం ప్రాంతంలోని ప్రజలు పరిశుభ్రమైన గాలిని పీల్చేందుకు అర్హులైనపుడు, ఇతర నగరాల ప్రజలకు ఎందుకు ఆ అర్హత లేదని ప్రశ్నించారు. బాణసంచా విధానం యావత్తు దేశానికి వర్తించే విధంగా ఉండాలన్నారు. ''ఢిల్లీ ప్రజలు దేశంలోని విశిష్ట వ్యక్తులు కాబట్టి వారికి మాత్రమే వర్తించే విధానం ఉండకూడదు. నిరుడు శీతాకాలంలో నేను అమృత్‌సర్‌లో ఉన్నాను, అక్కడి కాలుష్యం ఢిల్లీలో కన్నా తీవ్రంగా ఉంది. బాణసంచాను నిషేధించవలసి వస్తే, దేశవ్యాప్తంగా నిషేధించాలి'' అని సీజేఐ చెప్పారు. సీనియర్ అడ్వకేట్ అపరాజిత సింగ్ సీజేఐకి మద్దతు పలికారు. విశిష్ట వ్యక్తులు తమకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోగలుగుతారన్నారు. ఢిల్లీలో కాలుష్యం ఉంటే, వారు వేరొక ప్రాంతానికి వెళ్లిపోతారన్నారు. బాణసంచాపై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గాలి నాణ్యత నిర్వహణ కమిషన్‌కు నోటీసులిచ్చింది.

ఉప రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం





15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పదవికి రాజీనామా చేసిన 53 రోజుల తర్వాత ఈ కార్యక్రమంలో తొలిసారి కనిపించారు.

టేకాఫ్ సమయంలో ఊడిన టైర్

- ముంబైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్
- స్పైస్‌జెట్ విమానానికి తప్పిన ప్రమాదం



ముంబై: గుజరాత్‌లోని కాండ్లా విమానాశ్రయం నుంచి ముంబైకి బయల్దేరిన స్పైస్‌జెట్ విమానం బయటి చక్రం ఒకటి ఊడిపోవడంతో శుక్రవారం ముంబై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ అయ్యింది. విమానం టేకాఫ్ సమయంలో ఈ ఘటన జరిగింది. అయినా విమానం తన ప్రయాణాన్ని కొనసాగించింది. దీంతో ముంబై విమానాశ్రయంలో పూర్తి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సాయంత్రం 3.51 గంటలకు విమానం సురక్షితంగా ముంబై ఎయిర్‌పోర్టులో దిగింది. విమానంలోని 75 మంది ప్రయాణికులు , సిబ్బంది సురక్షితంగా ఉన్నారని స్పైస్‌జెట్ అధికార ప్రతినిధి తెలిపారు.

యూపీలో 10% కమీషన్ రగడ!

- ఎమ్మెల్యే నిధి నుంచి బీజేపీ ఎమ్మెల్యేలకు 10 శాతం కమీషన్
- సొంత పార్టీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు
- యోగి సర్కారుపై విపక్షాల విమర్శలు



కాన్పూర్, సెప్టెంబర్ 12: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేలకు అవినీతి మకిలి అంటుకుంది. సాక్షాత్తూ బీజేపీ ఎమ్మెల్యేనే ఈ విషయాన్ని నిర్ధారించారు. తమ ఎమ్మెల్యేలు నెలవారీ జీతాలు డ్రా చేయడమే కాక, ఎమ్మెల్యే నిధుల నుంచి 10 శాతం కమీషన్లు కూడా పొందుతారంటూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్ త్రివేది పేర్కొన్న వీడియో ఇప్పుడు రాష్ట్రంలో సంచలనం కలిగించింది. బుధవారం కాన్పూర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి. బీజేపీ ఎమ్మెల్యేల అవినీతిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వీడియోలో కిద్వాయ్‌నగర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఎమ్మెల్యేలు జీతాలతో పాటు ఎమ్మెల్యే నిధి నుంచి కమీషన్లు కూడా పొందుతూ రెండు విధాలుగా ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. అయితే కింది స్థాయి కార్యకర్తలకు ప్రతిఫలంగా ఏమీ లభించడం లేదు' అని అన్నారు. కాగా, హిందువులు తమ రక్షణ కోసం కత్తులు, లాఠీలు తమ ఇళ్లలో ఉంచుకోవాలని ఆయన సూచించడం మరింత వివాదం రేకెత్తించింది. అలాగే ఆయన హిందువులను జంతువుల కన్నా అధ్వాన్నమంటూ పోల్చారు. జంతువులు తమకు ఆపద వచ్చినప్పుడు రక్షించుకోవడానికి కొమ్ములను ఉపయోగించి తిరగబడతాయని, కానీ హిందువులు స్వీయ రక్షణ కోసం ప్రయత్నించరని ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై యోగి సర్కారుపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. బీజేపీ సర్కారు అవినీతిలో కూరుకుపోయిందని మండిపడ్డాయి.

విదేశీ సినిమాలు చూస్తే మరణశిక్ష

ఉత్తర కొరియాలో దారుణాలు

న్యూఢిల్లీ : విదేశీ సినిమాలు, టెలివిజన్ డ్రామాలను చూసిన లేదా ఇతరులకు పంపించిన వారికి ఉత్తర కొరియా ప్రభుత్వం మరణ శిక్షలు విధిస్తున్నది. వెట్టి చాకిరీ, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలపై కఠినమైన ఆంక్షలు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. గత దశాబ్దంలో ఉత్తర కొరియా నుంచి పారిపోయిన వారిలో దాదాపు 300 మందిని ఇంటర్వ్యూ చేసి, ఈ నివేదికను రూపొందించారు. ప్రజల జీవితాల్లోని అన్ని అంశాలను కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలోని ప్రభుత్వం కఠినంగా నియంత్రిస్తున్నదని తెలిపారు.

అమెరికాలో భారతీయుడి హత్య

- తల నరికి, ఫుట్‌బాల్‌లా తన్ని చెత్త బుట్టలో పడేసిన దుండగుడు
- వాషింగ్ మెషీన్ వాడొద్దన్నందుకే
- భార్య, కుమారుడి ఎదుటే ఘాతుకం

డల్లాస్: అమెరికాలో ఓ భారతీయుడు దారుణ హత్యకు గురయ్యాడు. భార్య, కుమారుడి ఎదుటే అతడిని దుండగుడు తల నరికి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. కింద పడిన తలను కాలితో తన్ని అనంతరం చెత్త బుట్టలో పడేశాడు. డాలస్‌లో బుధవారం ఈ దారుణం చోటుచేసుకుంది. వాషింగ్ మెషీన్ వాడొద్దన్నందుకు నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడు తరుముతుండగా, బాధితుడు పరిగెత్తుతూ భయంతో కేకలు వేసిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. డాలస్ సిటీ సామ్యూల్ బౌలేవార్డ్‌లో డౌన్‌టౌన్ సూట్స్ మోటెల్ ఉంది. అందులో కర్ణాటక మూలాలున్న చంద్ర నాగమల్లయ్య (50) మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం నిందితుడు కోబోస్ మార్టినెజ్ (37), మరో ఉద్యోగిని గదిని శుభ్రం చేస్తుండగా, అక్కడికి వచ్చిన నాగమల్లయ్య అక్కడి పాడైపోయిన మెషీన్‌ను వాడొద్దని వారికి చెప్పాడు. అయితే అతను నేరుగా మార్టినెజ్‌తో మాట్లాడకుండా తాను ఏం చెప్పానో మార్టినెజ్‌కు అనువాదం చేసి చెప్పాలని ఆ మహిళను కోరాడు. దీంతో ఆగ్రహం చెందిన మార్టినెజ్ కత్తి పట్టుకుని నాగమల్లయ్యను వెంటాడి హత్య చేశాడు. అదే మోటెల్‌లోని ఫ్రంట్ ఆఫీస్ వద్ద పనిచేస్తున్న నాగమల్లయ్య భార్య, కుమారుడు బయటకు వచ్చి అతడిని రక్షించడానికి ప్రయత్నించారు. అయితే నిందితుడు వారిని పక్కకు తోసేశాడు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. అయితే ఇది ప్రీ ప్లాన్డ్ హత్యా, లేక జాత్యహంకార హత్యా అన్న విషయం నిర్ధారించ లేమని అధికారులు చెప్పారు. నాగమల్లయ్య హత్యపై హూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు. నిందితుడిని డాలస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు మార్టినెజ్ క్యూబా దేశస్థుడని అతనికి నేర చరిత్ర ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ తెలిపింది.



దిశా పటానీ ఇంటివద్ద కాల్పులు

బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో నటి దిశా పటానీ ఇంటి ముందు కాల్పులు చోటుచేసుకున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. కాల్పుల్లో ఎవరూ గాయపడలేదని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఓ వర్గం మనోభావాలు దెబ్బతీసేలా దిశా పటానీ సోదరి ఖుష్బూ పటానీ వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ దాడి జరిగింది. మాజీ ఆర్మీ అధికారిణి అయిన ఖుష్బూ ప్రస్తుతం ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నారు. తామే కాల్పులకు పాల్పడినట్టు గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ పేర్కొన్నారు.

జేడీఏ ప్రాజెక్టులకు జీఎస్టీ వర్తించదు

బొంబాయి హైకోర్టు తీర్పుతో రియల్టర్లకు ఊరట

ముంబై: రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎంతో ఊరటనిచ్చే తీర్పును బొంబాయి హైకోర్టుకు చెందిన గోవా బెంచ్ శుక్రవారం వెలువరించింది. జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ (జేడీఏ) కింద చేపట్టే భవన నిర్మాణాలకు జీఎస్టీ వర్తించదని రూలింగ్ ఇచ్చింది. విక్రయపత్రం ద్వారా ఓ డెవలపర్ సదరు ఆస్తికి యజమాని అయిన వెంటనే జేడీఏ కింద చేపట్టే నిర్మాణ పనులకు జీఎస్టీ వర్తించదని పేర్కొంది. ఈ తీర్పుతో హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో జేడీఏ ప్రాజెక్టులపై ఓ స్పష్టత రానుంది. పునరాభివృద్ధి ప్రాజెక్టుల్లో సైతం జీఎస్టీ విధింపును క్రమబద్ధం చేయడానికి ఈ తీర్పు దోహదపడనుంది. జేడీఏలపై పన్ను విధింపు విషయంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదానికి ఈ తీర్పుతో తెరపడింది.

15 నుంచి నైరుతి తిరోగమనం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): ఈ నెల 15 నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా సెప్టెంబర్ 17న రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైన అక్టోబర్ 15నాటికి పూర్తిగా నిష్క్రమిస్తాయి. అయితే ఈసారి రెండు రోజుల ముందుగా సెప్టెంబర్ 15 నుంచే తిరోగమనానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఐఎండీ తెలిపింది. నైరుతి రుతుపవనాల తిరుగమనం ముందు.. రానున్న నాలుగు రోజుల పాటు తూర్పు, మధ్య భారత్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అలాగే తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ ప్రాంతాల్లో రాబోయే ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిస్తాయని పేర్కొన్నది.

ఏడీఆర్ వ్యవస్థాపకుడు ఛోకర్ కన్నుమూత

ఢిల్లీ: అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) వ్యవస్థాపకుడు-ట్రస్టీ జగ్‌దీప్ ఛోకర్(81)శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఢిల్లీలో మరణించారు. రైల్వేలో మెకానికల్ ఇంజినీర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తర్వాత ఐఐటీ-అహ్మదాబాద్‌లో అధ్యాపకుడిగా చేరి డీన్, డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో అహ్మదాబాద్ నుంచి పోటీచేసిన అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలనలో పారదర్శకతపై కీలక ప్రశ్నలు లేవనెత్తిన తన సహోద్యోగి త్రిలోచన్ శాస్త్రి నుంచి పొందిన ప్రేరణతో ఛోకర్ ఏడీఆర్‌కు అంకురార్పణ చేశారు. ఛోకర్, శాస్త్రి వేసిన పిటిషన్ల కారణంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ విద్యార్హతలు, ఆదాయం, ఆస్తులు, క్రిమినల్ కేసులు తదితర వివరాల గురించి ప్రమాణ పత్రాల్లో పేర్కొనాలని నవంబర్ 2000లో ఢిల్లీ హైకోర్ట్ ఆదేశాలిచ్చింది.

ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు లేనట్టే : రష్యా

మాస్కో : ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు తాత్కాలికంగా తెరపడిందని రష్యా తెలిపింది. ఈ ప్రక్రియను అడ్డుకుంటున్నది ఐరోపా దేశాలేనని ఆరోపించింది. చర్చలకు తాము సుముఖంగా ఉన్నామని స్పష్టం చేసింది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ మీడియాతో మాట్లాడుతూ, కమ్యూనికేషన్ చానళ్లు పని చేస్తున్నాయని, వాటి ద్వారా తమ రాయబారులు చర్చలు జరిపే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ప్రపంచంలోనే తొలి ఏఐ మంత్రి!

న్యూఢిల్లీ: అన్ని రంగాల్లోకి పాకిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు రాజకీయ రంగంలోకీ ప్రవేశించింది. దేశంలో పెరిగిపోతున్న అవినీతిని అంతమొందించేందుకు అల్బేనియా ప్రభుత్వం ప్రపంచంలోనే తొలిసారి ఏఐ మంత్రి 'డియెల్లా'ను నియమించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధానమంత్రి ఎడిరామ గురువారం ప్రకటించారు. ప్రపంచంలోనే తొలి ఏఐ ఆధారిత మంత్రిని నియమించినట్టు తెలిపారు. ఇకపై ఈ ఏఐ మంత్రి ప్రభుత్వ టెండర్ల పర్యవేక్షణ బాధ్యతను చూసుకుంటుంది.

గణేశ్ శోభాయాత్రలో ప్రమాదం.. 8 మంది మృతి

బెంగళూరు: కర్ణాటకలో ఘోర దుర్ఘటన జరిగింది. హసన్ జిల్లా హొసలే హొసళ్లిలో గణేశ్ శోభాయాత్రలో భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మందికిపైగా గాయాలయ్యాయి.

నెల దాటినా యాతన తీరలే..

- అన్నదాతను వీడని యూరియా కష్టాలు
- సొసైటీల్లో తప్పని ఎదురుచూపులు

యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారు. పంటల అదును దాటుతున్నా.. బస్తా యూరియా దొరకడం లేదని ఆందోళన చెందుతున్నారు. విక్రయ కేంద్రాల వద్ద అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుడా పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడినా.. పాస్‌బుక్కులు, ఆధార్ జిరాక్స్‌లు.. చివరకు చెప్పులు సైతం వరుసలో పెట్టి నిరీక్షించినా అరకొర యూరియా అందిస్తున్నారని వాపోతున్నారు. అసలే రాని వారు మరోరోజు కోసం ఎదురు చూస్తున్నారు. యూరియా కష్టాలు మొదలై నెల దాటినా యాతన తీరలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కడుపుమండిన రైతులు నిరసనకు దిగుతున్నారు. మరికొందరు అధికారులను నిలదీస్తున్నారు.

- పనులన్నీ వదిలేసి పడిగాపులు



నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు బారులు తీరారు. పనులన్నీ వదిలేసి పొద్దంతా చూసినా బస్తా కూడా దొరకడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు

- కడుపుమండి.. కన్నెర్ర చేసి..



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలోని చించోలి-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై మహిళా రైతులు రాస్తారోకో చేపట్టారు. యూరియా తెప్పించి ఇప్పిస్తామన్న పోలీసుల హామీతో ఆందోళన విరమించారు

- అన్నదాత ఆగ్రహజ్వాల



కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రెండ్రోజులుగా పడిగాపు కాస్తున్నా యూరియా రాలేదని, టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు

- యూరియా ఇస్తరా.. చావమంటరా..!



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల రైతువేదిక వద్ద రైతు దుర్గయ్య పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగాడు. యూరియా ఇస్తరా.. చావమంటరా అంటూ అధికారులను నిలదీశాడు



- దండుగా కదిలి.. ధర్నా చేసి..

నల్లగొండ జిల్లా తిప్పర్తిలో నార్కట్‌పల్లి అద్దంకి హైవేపై యూరియా కోసం రైతులు ధర్నా చేపట్టారు. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు, వ్యవసాయాధికారులు చేరుకొని ఆందోళన విరమింపజేశారు

- కష్టం 'చెప్ప'కోలేక..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌యార్డులో సొసైటీ గోడౌన్ వద్ద క్యూలో నిలబడే ఓపిక లేకపోవడంతో క్యూలో చెప్పులు పెట్టి రైతులు పక్కన సేద తీరారు

రైతుల గోసతో ప్రభుత్వ పతనం ఖాయం

- అన్నదాతల పక్షపాతి ముమ్మాటికీ కేసీఆరే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, సెప్టెంబర్ 12 : యూరియా కోసం రైతులు పడుతున్న అరిగోస తాకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పతనమవడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. రైతుల అవసరాలకనుగుణంగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తిలోని రాజీవ్ చౌరస్తాలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టగా, ఎర్రబెల్లి హాజరై పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ఏలుబడిలో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని చెప్పారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతుల ముంగిట్లోకే అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వచ్చాయన్నారు. దేశంలోనే రైతు పక్షపాతిగా గుర్తింపు పొందిన మహనేత కేసీఆర్ అని కొనియాడారు. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో రాయపర్తి, వర్ధన్నపేట ఎస్సైలు రాజేందర్, రాజు సిబ్బందితో వెళ్లి ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎర్రబెల్లి అరెస్ట్‌తో గులాబీ శ్రేణులు, బాధిత రైతులు పోలీస్ వాహనాలకు అడ్డు తగలడంతో రాయపర్తిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

- పచ్చని పల్లెల్లో చిచ్చు..



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట జంగరాయి సొసైటీ ఎదుట రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. చెప్పుల క్యూ పెట్టారు. మహిళలు యూరియా కోసం గొడవకు దిగారు



నాదర్‌గూల్‌లో మాతృదేవోభవ అనాథాశ్రమాన్ని సందర్శించిన పటోళ్ల కౌశిక్‌రెడ్డి

మానవత్వం చాటుకున్న సబితమ్మ!

మాతృదేవోభవ అనాథాశ్రమానికి విరాళంగా ఒకనెల వేతనం

బడంగ్‌పేట, సెప్టెంబర్12: మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పీ సబితా ఇంద్రారెడ్డి మానవత్వం చాటుకున్నారు. మహేశ్వరం నియోజక వర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాదర్‌గూల్‌లో ఉన్న మాతృదేవోభవ అనాథాశ్రమ భవన నిర్మాణానికి సబితా ఇంద్రారెడ్డి ఒకనెల ఎమ్మెల్యే వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. తమ ఆశ్రమానికి సాయం చేయాలని, ఆశ్రమాన్ని సందర్శించాలని యజమాని గట్టు గిరి విజ్ఞప్తి మేరకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచన మేరకు బీఆర్‌ఎస్ నేతలు పటోళ్ల కౌశిక్‌రెడ్డికి నేతృత్వంలో బీఆర్‌ఎస్ నేతలు ఆ అనాథాశ్రమాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో ఎమ్మెల్యే స్వయంగా ఆశ్రమానికి వచ్చి విరాళాన్ని అందజేస్తారని వారు తెలిపారు. అ ఈ సందర్భంగా విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, నాయకులు కుమార్, జంగయ్య, నరేశ్, శ్రీనునాయక్, మైపాల్‌గౌడ్, టేకుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కూలిన కలెక్టర్ భవనం వద్ద హెల్మెట్లు ధరించి వినూత్నంగా నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కలెక్టరేట్ కూలుతున్నా పట్టదా ?

ఆదిలాబాద్‌లో శిథిలాల వద్ద హెల్మెట్లు ధరించి బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్ భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ నా యకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం తో ఆదిలాబాద్‌లో కలెక్టరేట్ భవనం కూలిపోయిన విషయం తెలిసిందే. భవ నం శిథిలాల వద్ద శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు హెల్మెట్లు ధరించి వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనం కూలిపోయే ప్రమాదం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించా రు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.55 కోట్ల తో కొత్త కలెక్టర్ భవనాన్ని మంజూరు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహించాలంటేనే వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

గోపాలా.. నీ భూమికెవరు కాపలా?

బాలాపూర్‌లో రూ.200 కోట్ల ఆలయ ఆస్తులకు ఎసరు

- శ్రీ సంతాన వేణుగోపాలస్వామి భూములపై బేరసారాలు
- నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం ఓ మంత్రి ద్వారా ప్రయత్నాలు
- ఆస్తిపాస్తుల రక్షణపై చేతులెత్తేసిన దేవాదాయ అధికారులు
- అధికారులు నోరెత్తకుండా చేస్తున్న అధికార పార్టీ నేతలు

హైదరాబాద్ సిటీబ్యూరో/బడంగ్‌పేట, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో అధికార పార్టీ నేతల భూదాహానికి అడ్డులేకుండా పోయింది. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట పరిధిలోని బాలాపూర్ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ భూములపై అధికారపార్టీ నేతల కన్నుపడింది. భూములను దక్కించుకొని, వాటిని అమ్మేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎకరాకు రూ.15-20 కోట్లు పలుకుతున్న ఈ విలువైన భూమిని కొట్టేసేందుకు ఓ మంత్రి రంగంలోకి దిగారట. నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వమంటూ తన అనుచరుల ద్వారా దేవాదాయ శాఖ అధికారులను ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. కంచె చేను మేసినట్టుగా దేవుని మాన్యాన్ని పరిరక్షించాల్సిన ఎండోమెంట్ అధికారులు పక్కకు తప్పుకోవడంతో 'గోపాలా.. నీ భూమికి ఎవరు కాపలా?' అంటూ స్థానికులు నిట్టూర్చుతున్నారు. బడంగ్‌పేట పరిధిలోని బాలాపూర్ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా పేరుపొందినది. ఆస్తులు కూడా ఎక్కువే. అందుకే వాటిని కాజేసేందుకు అక్రమార్కులు ఈగల్లా వాలుతుంటారు. బాలాపూర్ లడ్డూకు ఎంత పేరున్నదో.. వేణుగోపాలస్వామి ఆస్తులపై అంతమంది కన్నుంటుందని స్థానికంగా చమత్కరిస్తుంటారు. 1971లో ఆలయాన్ని రిజిస్టర్ చేసే సమయంలో బాలాపూర్‌లోని సర్వే నంబర్లు 14, 68, 69,70ల్లో 19.05 ఎకరాలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందులో సర్వే నంబర్ 14లో 1.04 ఎకరాలు, 68లో 2.13 ఎకరాలు, 69లో 3.10 ఎకరాలు, 70లో 12.18ఎకరాల భూమి ఉన్నట్టుగా దేవాదాయ శాఖ రికార్డుల్లో నమోదై ఉన్నది. ఈ భూములను దేవాదాయ భూములుగా పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నవంబర్ 2022లో విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొన్నారు. ఈ భూమి బాలాపూర్ బడంగ్‌పేట ప్రధాన రహదారిపై ఏఆర్‌సీఐ పక్కనే ఉన్నది. ప్రస్తుతం ఇక్కడ భూముల ధర మార్కెట్‌లో ఎకరానికి రూ.15-20 కోట్లు పలుకుతున్నది. దీంతో ఎలాగైనా ఈ భూమిని దక్కించుకుని అమ్మేయడానికి స్థానిక అక్రమార్కులు, అధికారపార్టీ నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎకరాకు రూ.6 కోట్లకు బేరసారాలు జరుగుతున్నట్టు సమాచారం. ముందుగా ఆరు ఎకరాలు అమ్మేసి, విడతల వారీగా మిగతావాటిని కూడా అమ్మేయాలని నిర్ణయించుకున్నట్టు చర్చ జరుగుతున్నది.

ఎన్వోసీ కోసం ఓ మంత్రి?

అక్రమార్కులు చేస్తున్న ప్రయత్నాలకు ఓ మంత్రి సహకరిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. మొత్తం భూమికి దేవాదాయ శాఖ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్వోసీ) తేవడానికి మంత్రి తనదైన శైలిలో అధికారులను ఒత్తిడి చేస్తున్నారట. ఇప్పటికే తన మనుషులతో ఆ శాఖలోని ఉన్నతాధికారులు మొదలు నాలుగో తరగతి ఉద్యోగుల వరకు మేనేజ్ చేసి రికార్డులన్నీ తీసుకున్నట్టు తెలిసింది. అవసరమైతే దేవాదాయ శాఖలో రూ.కోటి వరకు ఖర్చు పెట్టేందుకు సిద్ధమని మంత్రి అనుచరులు అక్కడి సిబ్బందితో అన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్వోసీ కోసం నయానో, భయానో ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్తున్నారు. ఈ భూమిపై మరో మంత్రి కన్ను కూడా పడిందని, తమ మంత్రికి కూడా వాటా ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేస్తున్నట్టు ప్రచా రం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో అధికారులు ఎవరైనా ఆ భూముల గురించి మాట్లాడితే చర్యలు ఉంటాయని హెచ్చరించినట్టు సమాచారం.



కబ్జాకు ప్రయత్నిస్తున్న విలువైన ఆలయభూమి

> **నాకు బాధ్యతలే అప్పగించలేదు**
>
> కర్మన్‌ఘాట్‌తోపాటు గణేశ్‌గడ్డ దేవాలయాలకు నేను ఇన్‌చార్జ్‌గా ఉన్నాను. బాలాపూర్ వేణుగోపాలస్వామి గుడి ఇన్‌చార్జిగా చేయమంటే వద్దని మా ఉన్నతాధికారులకు చెప్పాను. కొత్తగా వచ్చిన ఈవోలలో ఎవరికో ఒకరికి గుడి బాధ్యతలు ఇస్తామని చెప్పారు. గతంలో పనిచేసిన ఈవో నాకేం బాధ్యతలు అప్పగించలేదు. భూముల గురించి, గుడి గురించి నాకేం తెలియదు.
>
> -లావణ్య, ఈవో, కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి దేవస్థానం

> **ఆస్తులున్నాయి, ఆదాయం లేదు**
>
> నేను ఈ ఆలయానికి వచ్చి మూడు సంవత్సరాలైంది. అప్పట్లో ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వం నిధులిచ్చినట్టుగా తెలిసింది. అప్పుడు ఏర్పడ్డ కమిటీ నాకు జీతమిచ్చారు. ఆలయానికి కోట్ల రూపాయల విలువైన భూములు ఆస్తులుగా ఉన్నా.. ఆదాయం మాత్రం లేదు. ఆలయం చాలా ప్రాచీనమైనది. ఎండోమెంట్ ఆఫీసర్లు ఎప్పుడూ రాలేదు. మేం వచ్చిన తర్వాత కమిటీ ప్రమాణస్వీకారానికి ఒక అధికారి వచ్చి పోవడమే తప్ప ఆలయాన్ని దేవాదాయ శాఖ పట్టించుకోదు.
>
> -గీతాకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుడు

పట్టించుకోని దేవాదాయ శాఖ

బాలాపూర్ వేణుగోపాలస్వామి ఆలయం 6సీ క్యాటగిరీలో ఉన్నది. ఆలయ ఆస్తులను పరిరక్షించేందుకు ఈవోను నియమించడంలో ప్రభుత్వం మొదటినుంచీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. గతంలో రెండెకరాల్లో వేరేవారు షెడ్లు వేయగా సిబ్బంది స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి షెడ్లను తొలగించారు. ఆ తర్వాత ఏ ఎండోమెంట్ అధికారి కూడా ఆలయ భూముల వైపే చూడలేదని స్థానికులు చెప్తున్నారు. ప్రస్తుతం కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ ఈవోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ తనకే రెండు పెద్ద దేవాలయాలు ఉన్నాయంటూ కర్మన్‌ఘాట్ ఈవో ఇప్పటివరకు ఈ ఆలయానికి చార్జ్ తీసుకోలేదు. గతంలో ఈవోగా పనిచేసిన ఉద్యోగి మాత్రం ఉద్దేశపూర్వకంగానే తనను బదిలీ చేసి అడ్డు తొలిగించుకున్నారని ఆరోపిస్తున్నారు. రూ.కోట్ల విలువైన భూమిని కొట్టేయడానికి కబ్జాదారులు ప్రయత్నిస్తుంటే ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

మరో మూడు రోజులు వర్షాలు

బంగాళాఖాతంలో మరో అల్పపీడన ప్రభావం

హైదరాబాద్,సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): వాయవ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే 3 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. గడిచిన 24 గంటలుగా రాష్ట్రంలోని కరీంనగర్, మెదక్, జనగామ, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సిద్దిపేట, హనుమకొండ, యాదాద్రి-భువనగిరి, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసినట్టు పేర్కొన్నారు. అత్యధికంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలో 22.15 సెం.మీ, ములుగు జిల్లా మల్లంపల్లిలో 21.70 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ దిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబా ద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

14న కరీంనగర్‌లో బీసీ మేధావుల సభ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 14న కరీంనగర్‌లోని పద్మశాలి భవన్‌లో బీసీ మేధావుల సభ నిర్వహించనున్నట్టు సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ రోజుకో డ్రామా ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బీసీలు ఆయా పార్టీల కుట్రలను పసిగట్టాలని, లేకుంటే మరోసారి మోసపోయే ప్రమాదముందని హెచ్చరించారు. బీసీ కులసంఘాలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజన సంక్షేమ శాఖలో కార్మికుల సమ్మె

10 నెలల పెండింగ్ వేతనం చెల్లించాలని డిమాండ్

భద్రాచలం, సెప్టెంబర్ 12 : గిరిజన సంక్షేమ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న డెయిలీవేజ్ కార్మికులు ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ కార్మికులపై వివక్ష చూపుతూ.. 10 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కార్మిక కుటుంబాలను పస్తులు ఉంచడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, గిరిజన సంక్షేమ శాఖలో నూతనంగా విడుదల చేసిన క్యాటరింగ్ జీవోను రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ.15,600 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించేత వరకు సమ్మె విరమించేదిలేదని స్పష్టంచేశారు.

రాష్ట్రానికి 11,930 టన్నుల యూరియా

నేడు రేక్ పాయింట్ల నుంచి జిల్లాలకు సరఫరా: మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): రాష్ట్రానికి శుక్రవారం 11,930 టన్నుల యూరియా వచ్చిందని, గత రెండు రోజుల్లో 23వేల టన్నులు చేరుకుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మరో 4 రోజుల్లో రాష్ట్రానికి 27,650 టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఇక్రిశాట్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. అనంతరం యూరియా సరఫరాపై వ్యవసాయశాఖ సెక్రెటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి, అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రానికి వివిధ ఎరువుల కంపెనీల నుంచి 11 రేకులు రవాణాలో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరగా జిల్లాలకు పంపిస్తామని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి ఇక్రిశాట్ తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు మంత్రి తెలిపారు.



ప్రయాణాల్లో సాఫీగా

ఉత్సాహంగా విహారయాత్రలకు వెళ్లి.. ఉసూరు మంటూ తిరిగొస్తుంటారు చాలామంది. బయటి ఆహారం..తగినంత వ్యాయామం లేకపోవడంతో యాత్ర పూర్తయ్యేసరికి జ్వరం, సర్ది మాత్రలు వేసుకునే పరిస్థితికి వస్తుంటారు. ముఖ్యంగా 'మలబద్ధకం'తో ఎక్కువగా బాధపడుతుంటారు. దీనినే 'ప్రయాణ మలబద్ధకం' అని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనికి గల కారణాలు, నివారణ మార్గాలను ఇలా వివరిస్తున్నారు.

ప్రయాణాల సందర్భంగా శరీరం సమతుల్యతను కోల్పోతుంది. నిత్య కృత్యాలకూ అంతరాయం ఏర్పడుతుంది. విహారాల్లో సమయానుకూలంగా నిద్రలేవడం, భోజనం చేయడం లాంటివి వీలుపడదు. రైళ్లు, బస్సుల్లో ఎక్కువసేపు కూర్చొనే ఉండాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో జీర్ణ వ్యవస్థ మందగిస్తుంది. క్రమంగా తీవ్రమైన మలబద్ధకానికి దారితీస్తుంది.

బాటిల్ ఉండాల్సిందే!

ప్రయాణాల్లో వచ్చే మొదటి ప్రమాదం.. డీహైడ్రేషన్! విహారయాత్రల్లో పడి చాలామంది శరీరానికి అవసరమైన దానికంటే తక్కువ నీరు తాగుతుంటారు. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. పెద్దపేగు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. సమస్య ముదిరితే ప్రయాణం మధ్యలోనే నిలిచిపోతుంది. కాబట్టి, ఎప్పుడైనా, ఎక్కడైనా.. శరీరానికి కావాల్సినంత హైడ్రేషన్ అవసరమని గుర్తించాలి. యాత్రల్లో ఉన్నప్పుడు ఎక్కువగా నీళ్లు తాగాలి. అందుకోసం వాటర్ బాటిల్ ఎప్పుడూ వెంట ఉండేలా చూసుకోవాలి.

ఫైబర్‌కు జై!

విహార యాత్రలకు వెళ్తే బయటి ఆహారమే దిక్కు. అందులోనూ లోకల్, స్ట్రీట్ ఫుడ్‌కే ఎక్కువ మొగ్గు చూపుతారు. అధికంగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తీసుకుంటారు. రోజువారీగా తీసుకొనే పండ్లు, సలాడ్లు, తృణధాన్యాలు లాంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలను నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా ఫైబర్ తక్కువై.. పేగు కదలికలు నెమ్మదిస్తాయి. మలబద్ధకం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని నివారించడానికి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. అల్పాహారంలో పండ్లు.. మధ్యాహ్నం పూట సలాడ్‌లు ఉండేలా చూసుకోవాలి. స్నాక్స్ సమయంలో చిప్స్‌కు బదులుగా.. డ్రైఫ్రూట్స్, నట్స్, సీడ్స్ తీసుకోవాలి. ఇలాంటి చిన్నచిన్న మార్పులే.. మంచి ప్రభావం చూపిస్తాయి.

వాకింగ్ చేయాల్సిందే!

ప్రయాణాల్లో ఎక్కువ సమయంపాటు కదలకుండా ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే.. రైళ్లు, బస్సుల్లో కాస్త అటూ ఇటూ నడవాలి. సొంత కారులో యాత్రకు వెళ్తే.. కనీసం రెండు గంటలకు ఒకసారైనా కారు ఆపి కాసేపు నడవాలి. హోటళ్లలో లిఫ్ట్‌లకు బదులుగా మెట్లు ఎక్కాలి. భోజనం తర్వాత కొద్దిసేపు నడక సాగించాలి. ఇతర విషయాల్లో రెగ్యులర్ షెడ్యూల్ మిస్ అయినప్పటికీ.. సమయానికి భోజనం చేయాలి. ఆల్కహాల్, కెఫిన్ తీసుకోవడాన్ని తగ్గించాలి. అప్పుడే.. 'ప్రయాణ మలబద్ధకం' దూరం అవుతుంది. ఇలా చిన్నచిన్న మార్పులు చేసుకుంటే.. మీ ప్రయాణం సంతోషంగా సాగుతుంది.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం | 13 సెప్టెంబర్ 2025
హైదరాబాద్ | www.ntnews.com



సంపన్నులు కావాలన్న కల అందరికీ ఉంటుంది. దాన్ని నిజం చేసుకునే మార్గమే చాలామందికి తెలియదు. సాధారణ వ్యక్తులతో పాటు.. సౌకర్యవంతమైన జీవితానికీ, ఆకాశాన్ని అందుకోవాలనే కలలకీ మధ్య నడిచే జెన్ జెడ్ తరానికి కూడా సరిపోయేలా ఈ సంపద రహస్యాన్ని తెలిపే పుస్తకం ఒకటి ఇటీవల మార్కెట్లోకి వచ్చింది. 'మ్యాంగో మిలియనీర్' పేరిట ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ సీఈఓ రాధికా గుప్తా తీసుకొచ్చిన ఈ పుస్తకం పొదుపు సూత్రాన్ని విభిన్నంగా ఆవిష్కరించింది. 10-30-50 రూల్ పేరిట ఇందులో చేసిన ప్రతిపాదన విజయ సాధనకు రోడ్ మ్యాప్‌లా పనికొస్తుంది. దీన్ని పాటిస్తే ఎవరైనా సులభంగా తమ లక్ష్యాలను చేరుకోగలరు.

మీరూ కావచ్చు మ్యాంగో మిలియనీర్..!

నచ్చిన హ్యాండ్ బ్యాగా లేదా ఆ నెల పొదుపా... రెండింటిలో ఏది ఎంచుకోవాలి అన్నది ఓ నవయువతి తికమక. యోలో (YOLO) గుర్తూ...అనిపిస్తుందామెకు. ఇది జెన్‌జెడ్ కొత్త పంథా. YOLO... అంటే ఏం లేదు you only live once అని. ఈ జీవితం ఒక్కసారే వస్తుంది కదా! కానీ ఈ రెండూ ఒకేసారి చేయగలిగేలా సరికొత్త పొదుపు మార్గం చెబుతుంది మ్యాంగో మిలియనీర్ పుస్తకం. మనం తొలినాళ్లలో ప్రారంభించే పొదుపు అనేది ప్రాక్టీస్ మ్యాచ్‌లాంటిది. అక్కడ మొదటగా నువ్వు ఏర్పరచుకునే క్రమశిక్షణ పునాదిగా ఉంటుంది. అందుకే దీన్ని క్రికెట్‌లో నెట్ ప్రాక్టీస్‌గా చెబుతుందీ పుస్తకం. ఏ ఆటగాడూ ఇక్కడ సాధన చేయకుండా అంతర్జాతీయ వేదిక మీద నేరుగా ఆడటానికి వెళ్లడు. అలాగే పొదుపు అనేది నీ ప్రాక్టీస్ మ్యాచ్ అనుకుంటే, విజయవంతమైన ఇన్వెస్ట్‌మెంట్ అనేదే వేదిక మీద విజయం. ఇక, ఈ పొదుపు ప్రయాణాన్ని ఎలా ప్రారంభించి కొనసాగించాలి అనేదే 10-30-50 నియమం.

ఇరవైల్లో విత్తనం నాటండి (ఇదే 10)

ఉద్యోగ జీవితం ప్రారంభమయ్యేదే ఇరవైలలో. కాబట్టి ఈ సమయంలోనే పొదుపు ప్రారంభించాలి. తొలినాళ్లలో ఎవరికైనా జీతం తక్కువగానే ఉంటుంది. చూడాల్సిన సినిమాలు, కొనాల్సిన వస్తువులు...ఇలా లిస్టు పెద్దదిగా ఉంటుంది. కాబట్టి తొలిగా మన కొచ్చే ఆదాయంలోని ఒక 10 శాతాన్ని పొదుపు చేయాలి. అది ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్‌లు, రికరింగ్ డిపాజిట్లు... ఇలా ఏవైనా సరే! మీ జీతం 25 వేలు ఉంటే 2500 వీటిలో పెట్టండి. ఇక్కడే మనం పొదుపు అనే విత్తనాన్ని నాటుతాం. ఇలా చేయడం అన్నది ఒక విలువైన అలవాటు. ఇది మునుముందు దశల్లో మంచి ఫలితాన్నిస్తుంది.



ముప్పైల్లో మొక్కగా... (ఇది 30)

మన వయసు ముప్పైల్లో పడింది అంటే జీతం కాస్త పెరుగుతుంది. అలాగే బాధ్యతలూ పెరుగుతాయి. కుటుంబం, పిల్లలు, ఈఎంఐలు ఇలా చూసుకోవాల్సిన విషయాలు చాలానే ఉంటాయి. అయినా సరే, ముప్పై నుంచి నలభై ఏండ్ల సమయంలో మన ఆదాయంలోని 30 శాతం పొదుపు చేయాలి అని చెబుతుంది మ్యాంగో మిలియనీర్. ఈ దశలో చేసుకునే పెట్టుబడులు మొక్కకు ఎరువులాంటివి. మనం ఎదగడానికి ఇవి ఎంతో అవసరం. ఆర్థిక భద్రత కోసం ఈ దశలో తీసుకునే ప్రతి చిన్న నిర్ణయం భవిష్యత్తు అనే చెట్టుకు బలాన్నిస్తుంది.

నలభైల్లో నీడనిచ్చే వృక్షమై... (ఇది 50)

ఒక వ్యక్తి వయసు నలభై ఏండ్లు దాటే సమయానికి జీతం లేదా సంపాదన గరిష్ఠ దశలో ఉంటుంది. ఇలాంటప్పుడు అందులో నుంచి 50 శాతాన్ని తప్పకుండా పొదుపు చేయమని చెబుతారు ఇందులో రచయిత్రి రాధికా గుప్తా. ఈ సమయంలో మీరు భవిష్యత్తు కోసం చేసిన పెట్టుబడులు చెట్టు ఇచ్చే నీడ, ఫలాల్లాంటివి. పిల్లల చదువులు, పెండ్లిండ్లు, రిటైర్మెంట్ జీవితం తదితరాలన్నింటికీ ఇవే దన్ను. కాబట్టి ఈ దశ వచ్చే సరికి మన ఆర్థిక పరిస్థితిని తప్పకుండా అదుపులో ఉంచుకోవాలి. ఆదాయ మార్గాల పెంపూ చేసుకోవాలి. అప్పుడే ఎవరైనా తాము అనుకున్న సంపద లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంటుంది.

ఎస్‌డీఎస్... ఆటోమేటిక్ పొదుపు

టీడీఎస్ అన్నది ఆర్థిక విషయాల గురించి కాస్త పరిజ్ఞానం ఉన్న వారెవరికైనా తెలిసిన విషయమే. ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్... అంటే మనకు రావల్సిన డబ్బుల్ని సోర్స్ దగ్గరే, అంటే మొదట్లోనే ట్యాక్సులు పోను కత్తిరించి ఇవ్వడం అన్న మాట. జీతం, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీలు, డివిడెండ్లు... ఇలా చాలా వాటిలో వచ్చే రిటర్న్ అన్నీ ఇలాగే మన చేతికి అందుతాయి. అదే విధానంలో సేవింగ్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ ఉండాలంటుంది ఈ పుస్తకం. అంటే బ్యాంకులో డబ్బులు పడగానే సిప్(సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)లు లేదా ఇతర ఏ ఇన్వెస్ట్‌మెంట్లకైనా మనం కేటాయించిన మొత్తం నేరుగా వెళ్లిపోవాలి. దాన్ని మనం ఆపే అవకాశం లేకుండా ఆటోమేటిక్‌గా కట్ అయ్యేలా పెట్టుకోవాలి. అప్పుడే అనుకున్న పొదుపు గమ్యం చేరడానికి వీలవుతుంది.

> **.. అంటే!**
>
> 'మ్యాంగో మిలియనీర్' అనే పేరు 'మ్యాంగో పీపుల్' అన్న ప్రచారంలో ఉన్న పదం నుంచి వచ్చింది. ఓ హిందీ సినిమాలో... సంపన్నుడు అయిపోవాలన్న పెద్ద పెద్ద ఆశలేమీ లేకుండా, సాధారణ సౌకర్యవంతమైన జీవితాన్ని కోరుకునే సగటు మనిషిని 'మ్యాంగో మ్యాన్' అని పిలుస్తుంటారు. అలాగే వాడుకలో సాధారణ మనుషుల్ని 'మ్యాంగో పీపుల్' అంటుంటారు. అలాంటి వాళ్లు కూడా బిలియనీర్ అవ్వడం ఎలా అన్నది తెలుపుతుంది.. అన్న ఉద్దేశం వచ్చేలా ఈ పుస్తకం పేరు పెట్టారట.



నాలుగు ముక్కల్లో...

డబ్బు అంటే ఒత్తిడి కాదు భద్రత. పొదుపు అంటే త్యాగం కాదు, భవిష్యత్తులో మనం అందుకోబోయే బహుమతి... అని చెబుతుందీ పుస్తకం. ఈ అంశాలను గుర్తు పెట్టుకుని క్రమ పద్ధతిలో, దీర్ఘకాలంపాటు మనం డబ్బును ఆదా చేస్తూ, దాన్ని పెట్టుబడి పెడుతూ సాగితే తప్పకుండా సాధారణ వ్యక్తి కూడా కోటీశ్వరుడు అవుతాడు అన్నది ఇందులోని సూత్రం. అందుకే కోటి రూపాయలు సంపాదించాలి అని అనుకుంటే ముందుగా ఒక రూపాయి దాచండి అని చెబుతుంది ఇది. కాబట్టి సంపద అనేది ఒకే రోజు రాదు. అలవాటు, క్రమశిక్షణ, ఓపిక... ఇవన్నీ కలిసి నిజమైన ధనాన్ని తెస్తాయి. పుస్తకాన్ని సలహాల సమాహారంగా కంటే ఒక మైండ్ సెట్ మార్పుని సూచించేదిగా మనం అర్థం చేసుకోవచ్చు.

... లక్ష్మీహరిత ఇంద్రగంటి

'వైదేహి పరిణయం'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని స్థానం సంపాదించుకున్న నటి యుక్తా మల్నాడ. నటన మీదున్న ఆసక్తితో ఎయిర్ హోస్టెస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఎన్ని అవరోధాలు ఎదురైనా ఎదుర్కొని ముందుకు సాగింది. ప్రస్తుతం 'కలవారి కోడలు కనకమహాలక్ష్మి' సీరియల్లో లీడ్ రోల్‌లో అలరిస్తున్నది. బలంగా నమ్మితే ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆ దేవుడే గట్టెక్కిస్తాడంటున్న యుక్తా మల్నాడ 'జిందగీ'తో పంచుకున్న ముచ్చట్లు..

సినిమాల కోసం.. ఉద్యోగం వదిలేశా!





మాది చిక్‌మంగళూరు. ఊహ తెలిసినప్పటి నుంచి సినిమాలు, సీరియళ్లు చూసేదాన్ని. అలా నటీనటుల మీద అభిమానం మొదలై, నటించాలన్న కోరిక పుట్టింది. సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఎప్పుడూ అనుకునేదాన్ని. ఆ ఆరాటమే ఎన్ని అడ్డంకులు ఎదురైనా ముందుకుసాగేలా చేసింది. యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుంటానంటే మొదట్లో అమ్మానాన్న ఒప్పుకోలేదు. చదువు పూర్తయ్యాక ఆలోచిద్దామన్నారు. ఆ మాటకు కట్టుబడి డిగ్రీ పూర్తిచేశాను. నాకు ఎయిర్ హోస్టెస్ ఉద్యోగం కూడా ఇష్టమే. అందుకే డిగ్రీ తర్వాత ఆ ఉద్యోగానికి అప్లయ్ చేశా. ట్రైనింగ్ కూడా పూర్తయింది. బెంగళూరులో ఇస్తారనుకుంటే కోల్‌కతా బేస్ ఇచ్చారు. బెంగళూరు అయితే సినిమాల్లో ప్రయత్నించవచ్చని నా ఆలోచన. దీంతో రెండు నెలలు జాబ్ చేసిన తర్వాత, పరిశ్రమలో ఏదో ఒకటి తేల్చుకోవాలని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి మళ్లీ సినిమా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

కొరియోగ్రాఫర్‌గా..

నాకు చిన్నప్పటినుంచీ డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. డిగ్రీ రోజుల్లో ఒక పోటీలో పాల్గొన్నా. అక్కడ ముఖ్య అతిథిగా వచ్చిన ఒక కన్నడ డైరెక్టర్ నన్ను చూసి తన సినిమాలో అవకాశం ఇచ్చారు. చదువు పూర్తయ్యాక ఆలోచిద్దామని వదిలేశా! నా స్నేహితురాలు కొరియోగ్రాఫర్‌గా ఏడు భాషల్లో పనిచేసింది. ఆమె ద్వారా మరో అవకాశం వచ్చింది. డిగ్రీలో ఉండగానే ఒక సినిమా చేశాను. కానీ, అది విడుదల కాలేదు. ఉద్యోగం మానేసిన తర్వాత అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా నాలుగు సినిమాలు చేశాను. తెలుగు డైరెక్టర్ రవికిరణ్ గారు ఆయన కొడుకును కన్నడలో హీరోగా పరిచయం చేస్తూ తీసిన సినిమాలో నన్ను హీరోయిన్‌గా తీసుకున్నారు. అలా నా నట ప్రస్థానం మొదలైందని చెప్పొచ్చు.

మా ఊరంటే ప్రాణం

కన్నడ సినిమా చేస్తుండగా తమిళం నుంచి ఒక ప్రాజెక్ట్ వచ్చింది. నాకు కన్నడ, ఇంగ్లిష్ తప్ప వేరే భాషలు తెలియవు. కానీ, నన్ను నిరూపించుకోవడానికి దీన్ని ఒక అవకాశంగా తీసుకున్నా. కష్టమైనా, చాలెంజ్‌గా స్వీకరించి తమిళం నేర్చుకున్నా. ఆ ప్రాజెక్ట్ తర్వాత జీ తెలుగు 'వైదేహి పరిణయం'లో అవకాశం వచ్చింది. తమిళం కంటే తెలుగు సులభంగా అనిపించి వెంటనే ఒప్పుకొన్నా. ప్రస్తుతం 'కలవారి కోడలు కనకమహాలక్ష్మి' సీరియల్లో కనకమహాలక్ష్మిగా చేస్తున్నా. నా జీవితానికి చాలా దగ్గరగా ఉన్న పాత్ర కావడంతో కథ వినగానే ఓకే చెప్పేశా. సినిమాల్లో కూడా అవకాశాలు వస్తున్నాయి. కానీ, ఇప్పుడున్న బిజీలో మా ఇంటికి వెళ్లడానికి కూడా వీలుపడట్లేదు. అందుకే సినిమాలు ఒప్పుకోవట్లేదు. ప్రకృతి అంటే నాకు చాలా ఇష్టం. ముఖ్యంగా మా ఊరంటే ప్రాణం. పచ్చని పరిసరాలు, పశుపక్ష్యాదులతో కళకళలాడే మా ఊరి వాతావరణం భలేగా ఉంటుంది. నాకు కవిత్వం రాయడం, డ్యాన్స్ అంటే ఇష్టం. మంచి సినిమాలు చేయాలని, విభిన్న పాత్రల్లో నటించి మంచి పేరు తెచ్చుకోవాలని ఉంది. చివరి వరకూ పరిశ్రమలో ఏదో ఒక పని చేస్తూ ఉండాలని కోరిక. సౌందర్య, అనుష్క నాకు ఆదర్శం. నటుల్లో ప్రభాస్, దర్శన్, నాని, ఇమ్రాన్ హష్మీ అంటే ఇష్టం.

అంతా దైవ నిర్ణయం..



మన జీవితంలో ఏం జరిగినా అంతా దైవ నిర్ణయమే అని గట్టిగా నమ్ముతాను. తిరుపతి వేంకటేశ్వర స్వామి నా ఇష్టదైవం. దేవుడి మీద నమ్మకంతోనే ఉద్యోగం వదిలేసి సినిమా పరిశ్రమలోకి వచ్చాను. ఈ రోజు మీ అందరి ముందూ ఇలా ఉన్నాను. అలాగే ప్రేమ, పెండ్లి కూడా సరైన సమయంలో తప్పక జరుగుతాయి. ఇవి మన చేతిలో ఉండవు. సంతోషకరమైన జీవితం గడపాలంటే పేరు మాత్రమే కాదు, డబ్బు కూడా ముఖ్యం. నా సంపాదనలో సగం సమాజసేవ కోసం వినియోగించాలని ఆలోచన ఉంది. దాన్ని ఎలా చేయాలన్నది ఇంకా నిర్ణయించలేదు. కానీ, నా శక్తిమేరకు నలుగురికీ సాయం చేయాలనే సంకల్పం అయితే బలంగా ఉంది.

... హరిణి

ట్రిపుల్ ఆరు!

ప్రపంచవ్యాప్తంగా నయా వాకింగ్ ట్రెండ్ నడుస్తున్నది. '6-6-6' నడక పద్ధతి.. ఇప్పుడు బాగా వైరల్ అవుతున్నది. 6-6-6 నడక వ్యాయామం అనేది ఒక సులభమైన, సమర్థమైన ఫిట్‌నెస్ పద్ధతి. బరువు తగ్గడంతోపాటు గుండె ఆరోగ్యం, మానసిక స్థితిని మెరుగుపరచడానికి.. ఈ ఫిట్‌నెస్ ట్రెండ్ సాయపడుతుంది. బీపీ, రక్తంలో చక్కెర స్థాయులనూ నియంత్రిస్తుంది.

6-6-6 అంటే..

- **6 గంటలకు:** రోజూ ఉదయం 6 గంటలకు లేదా సాయంత్రం 6 గంటలకు వ్యాయామం చేయాలి. 60 నిమిషాలపాటు చురుకైన నడక కొనసాగించాలి.
- **6 నిమిషాల వార్మ్ అప్:** నడక ప్రారంభించడానికి ముందు.. 6 నిమిషాల పాటు నెమ్మదిగా వార్మ్ అప్ చేయాలి. దీనివల్ల శరీరం వ్యాయామానికి సిద్ధమవుతుంది.
- **6 నిమిషాల కూల్ డౌన్:** 60 నిమిషాల నడక తర్వాత.. మరో 6 నిమిషాలపాటు నెమ్మదిగా నడవాలి. దీంతో గుండె వేగం సాధారణ స్థితికి వస్తుంది.

6-6-6 పద్ధతిలో ఎక్కువ వేగంగా, చురుకుగా నడవాల్సి ఉంటుంది. కాబట్టి, తక్కువ సమయంలో, సులభంగా పూర్తవుతుంది. బిజీ షెడ్యూల్‌లోనూ వ్యాయామం చేయాలనుకునే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఇక వారానికి 150 నిమిషాల వ్యాయామాన్ని పూర్తి చేయడానికీ ఇది దోహదం చేస్తుంది. ఉదయం 6 గంటలకు ఖాళీ కడుపుతో నడవడం వల్ల.. శరీరంలోని కొవ్వు కరిగి, బరువు తగ్గుతారు. సాయంత్రం 6 గంటలకు నడిస్తే.. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి. 60 నిమిషాల చురుకైన నడకతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎముకలు దృఢంగా తయారవ్వడంతోపాటు కండరాల శక్తి కూడా పెరుగుతుంది. ఇక వార్మ్ అప్‌తో గుండె వేగం, కండరాలకు రక్త ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుంది. నడుస్తున్నప్పుడు కండరాల నొప్పులు, బెణుకులు రాకుండా ఉంటుంది. కూల్ డౌన్ ప్రక్రియతో కండరాల నొప్పి తగ్గడంతోపాటు గుండె వేగం కూడా క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటుంది.



సున్నితంగా వివరించండి

పిల్లలు ఏదైనా ఇష్టమైన వస్తువునో, ఆటబొమ్మనో చూడగానే.. ఇంటికి రాగానే ఉత్సాహంగా అది కావాలంటూ తల్లిదండ్రులను అడిగేస్తారు. ఆ వెంటనే 'నో' అనేస్తారు చాలామంది పేరెంట్స్. అయితే ఆ మాట పిల్లలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది.చిన్నారులు ఇష్టపడే వాటికి మనం అడ్డంకి చెప్పడం వల్ల వాళ్లు నిరాశకు గురవుతారు. కోపంగా చెప్పడం మూలంగా తమను ఎవరూ అర్థం చేసుకోవడం లేదని బాధపడతారు. వద్దనే పదం కాకుండా సున్నితంగా ప్రేమతో చెప్పడం అలవర్చుకోవాలి. దాంతో చిన్నతనం నుంచే వారికి మంచి స్వభావం పెంపొందుతుంది. హానికరమైన వస్తువేదైనా కావాలని అడిగినపుడు..కోపగించుకోకుండా ఆ వస్తువులకు ప్రత్యామ్నాయాలను ఎంపిక చేసి ఇవ్వండి. అడిగిన వెంటనే వద్దు అనే మాట బదులు ఎందుకు వద్దంటున్నారో సులభమైన వివరణనివ్వండి. కొన్నిసార్లు పిల్లలు పరిమితులు దాటి పరీక్షిస్తారు. అటువంటి సందర్భాల్లో మీరు ప్రశాంతంగా, స్థిరంగా ఉంటే అదే వారికి భరోసానిస్తుంది. నచ్చచెప్పే సందర్భంలో గౌరవప్రదమైన భాషను వాడండి.





ఫైనల్లో జాస్మిన్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ జాస్మిన్ లంబోరియా ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల 57కిలోల సెమీఫైనల్లో జాస్మిన్ 5–0 తేడాతో ఒమలీన్ అల్కాల(వెనిజులా)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన జాస్మిన్..వెనిజులా బాక్సర్‌పై పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడింది. రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని పెంచుకుంటూ పోయిన జాస్మిన్..తుదిపోరులో నిలిచిన తొలి బాక్సర్‌గా నిలిచింది. మరోవైపు మహిళల 48 కిలోల క్వార్టర్స్‌లో మీనాక్షి.. 5–0తో ఇంగ్లండ్ బాక్సర్ అలీస్ పంఫెరిపై గెలిచిసెమీస్‌కు వెళ్లికాంస్య పతకం ఖాయం చేసింది. ఇప్పటికే నుపుర్, పూజారాణి సెమీస్ చేరగా, పురుషుల విభాగంలో జాదుమనిసింగ్ ఓటమితో 12 ఏండ్ల తర్వాత ఒక్క పతకం లేకుండానే భారత్ తమ పోటీని ముగించింది.

రజత్, యశ్ శతక జోరు

భారీ స్కోరు దిశగా సెంట్రల్ జోన్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్స్‌లో సెంట్రల్ జోన్ పట్టు బిగిస్తున్నది. బెంగళూరులోని బీసీసీఐ సీవోఈ గ్రౌండ్స్ వేదికగా సౌత్‌జోన్‌తో జరుగుతున్న టైటిల్ పోరులో భాగంగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 384 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న కెప్టెన్ రజత్ పాటిదార్ (101) మరోసారి శతకమోత మోగిస్తూ వెస్టిండీస్ సిరీస్‌కు ముందు సెలక్టర్లకు మరో తలనొప్పిని తీసుకొచ్చాడు. ఈ ట్రోఫీ క్వార్టర్స్‌లో సెంచరీ, హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్న రజత్.. సెమీస్‌లోనూ అర్ధ శతకం చేశాడు. ఫైనల్‌లో రజత్‌తో పాటు యశ్ రాథోడ్ (137 నాటౌట్) సైతం అజేయ శతకంతో మెరిశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ ఇప్పటికే 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది.

టికెట్లు అమ్ముడు పోవట్లె!

దుబాయ్ స్టేడియం సగం ఖాళీ

దాయాదుల పోరుపై అభిమానుల అనాసక్తి?

దుబాయ్: క్రికెట్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పన్లేదు. ఇరుజట్ల మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతాయి. కానీ యూఏఈ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో దాయాదుల పోరును స్టేడియంలో చూడటానికి అభిమానులు ఆసక్తి చూపించడం లేదా? ఇరుజట్ల మధ్య ఆదివారం దుబాయ్ వేదికగా జరగాల్సి ఉన్న మ్యాచ్‌కు మాత్రం స్టేడియంలో దాదాపు 40 శాతం టికెట్లు అమ్ముడుపోలేదని వార్తలు వస్తున్నాయి. 25 వేల సీటింగ్ సామర్థ్యం ఉన్న దుబాయ్ స్టేడియంలో శుక్రవారం ఉదయం నాటికి సుమారు 40 శాతం టికెట్లు మిగిలున్నాయని తెలుస్తున్నది. 2022 టీ20 వరల్డ్ కప్, 2023 వన్డే ప్రపంచకప్, 2023 ఆసియా కప్, 2025 చాంపియన్స్ ట్రోఫీలో ఇరుజట్లు తలపడగా ఆ మ్యాచ్‌లకు టికెట్లు నిమిషాల్లోనే అమ్ముడయ్యాయి. ఆదివారం నాటి మ్యాచ్‌లో సాధారణ టికెట్లకు ధరను 99 యూఎస్ డాలర్లు (సుమారు రూ. 8,800)గా నిర్ణయించగా ప్రీమియం టికెట్లకు మాత్రం 4,534 డాలర్లు (భారత కరెన్సీలో రూ. 4 లక్షలు)గా నిర్దేశించారు. అమ్ముడవని టికెట్లలో సుమారు 50 శాతం ప్రీమియం టికెట్లేనని వినికిడి. ఈ మ్యాచ్ టికెట్ల అమ్మకాన్ని ఆగస్టు 29నే ప్రారంభించినా ఇప్పటికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటం గమనార్హం. ఇదిలాఉండగా టికెట్లు అమ్ముడవటం లేదన్న వార్తలపై ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు స్పందిస్తూ.. 'అందులో నిజం లేదు. బుధవారం రాత్రి మేం ఆన్‌లైన్‌లో 3 వేల టికెట్లను ఉంచాం. అవన్నీ అమ్ముడయ్యాయి' అని పేర్కొంది.





నీరజ్‌పైనే ఆశలు

నేటి నుంచి ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీ



టోక్యో: ప్రతిష్ఠాత్మక ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి వేళయైంది. శనివారం నుంచి మెగాటోర్నీకి తెరలేవనుంది. భారత్ తరపున స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా భారీ అంచనాల మధ్య బరిలోకి దిగుతున్నాడు. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ అయిన నీరజ్ రెండోసారి స్వర్ణం సాధించడం ద్వారా అరుదైన ఘనత సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు. 2023(బుడాపెస్ట్)లో తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్ టోర్నీలో పసిడి సాధించిన నీరజ్..మరోమారు అదే ఫీట్ పునరావృతం చేయాలని చూస్తున్నాడు. తద్వారా దిగ్గజ జావెలిన్‌త్రోయర్, ప్రస్తుత తన కోచ్ జాన్ జెలెంజీ, అండర్సన్ పీటర్సన్ సరసన నిలువాలని చోప్రా ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇదిలా ఉంటే పారిస్(20204) ఒలింపిక్స్ పసిడి విజేత అర్షద్ నదీమ్‌తో తొలిసారి చోప్రా పోటీపడుతున్నాడు. నదీమ్‌కు తోడు మరోవైపు జులియన్ వెబర్, అండర్సన్ పీటర్స్, జాకబ్ వాల్డిచ్, జులియస్ యెగో, కేశార్న్ వాల్కట్ నుంచి నీరజ్‌కు పోటీ ఎదురుకానుంది.మరోవైపు ఈ మెగాటోర్నీలో భారత్ 19 మంది అథ్లెట్లతో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. అన్నురాణి(జావెలిన్‌త్రో), పారుల్ చౌదరీ(3000మీ స్టిపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్(లాంగ్‌జంప్), గుల్వీర్‌సింగ్(5000మీ), ప్రవీణ్ చిత్రవేల్(ట్రిపుల్ జంప్) పోటీలో ఉన్నారు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘన విజయం • ఆసియా కప్ టోర్నీ



హరిస్ (66)

దుబాయ్: ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ టోర్నీలో పాకిస్థాన్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన గ్రూపు–ఏ లీగ్ మ్యాచ్‌లో పాక్ 93 పరుగుల తేడాతో పసికూన ఒమన్‌పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన పాక్ కెప్టెన్ సల్మాన్ ఆగా..బ్యాటింగ్ వైపు మొగ్గుచూపాడు. యువ బ్యాటర్ మహమ్మద్ హరిస్(43 బంతుల్లో 66, 7ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీతో పాక్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 160/7 స్కోరు చేసింది. షా ఫైజల్(3/34), అమీర్ కలీమ్(3/31) మూడేసి వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ 16.4 ఓవర్లలో 67 పరుగులకు కుప్పకూలింది.

హరిస్ ఒక్కడే:

మొదట బ్యాటింగ్‌కు దిగిన పాక్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ రెండో బంతికే ఓపెనర్ సయిమ్ ఆయూబ్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఫైజల్ బౌలింగ్‌లో వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయిన ఆయూబ్..డీఆర్‌ఎస్‌కు వెళ్లినా లాభం లేకపోయింది. దీంతో నాలుగు పరుగులకే పాక్ తొలి వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ ఫర్హాన్(29) రెండు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కలీమ్ క్యాచ్ విడిచిపెట్టడంతో బతికిపోయాడు. ఫర్హాన్, హరిస్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. బౌండరీల రాక మందగించగా, హరిస్ 14 పరుగుల వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అయితే ఆమిర్ వేసిన ఆరో ఓవర్‌లో ఫర్హాన్ ఫోర్‌కు తోడు హరిస్ ఫోర్, సిక్స్‌తో 16 పరుగులు వచ్చి చేరడంతో పవర్‌ప్లే ముగిసే సరికి పాక్ 47/1 స్కోరు చేసింది. ఫర్హాన్‌ను అండగా చేసుకుంటూ హరిస్ బ్యాటు ఝులిపించే ప్రయత్నం చేశాడు. పసలేని ఒమన్ బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో ఓ భారీ సిక్స్‌తో 32 బంతుల్లో హరిస్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న తరుణంలో ఫర్హాన్..కలీమ్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇదే అదనుగా బౌలింగ్ మార్పుగా వచ్చిన కలీమ్ 13వ ఓవర్‌లో వరుస బంతుల్లో హరిస్‌తో పాటు కెప్టెన్ సల్మాన్ ఆగా(0)ను ఔట్ చేసి ఒమన్ శిబిరంలో ఆనందం నింపాడు. ఆ తర్వాత హసన్ నవాజ్(9), అష్రఫ్(8) విఫలం కాగా, జమాన్(23 నాటౌట్), నవాజ్(19) అంతో ఇంతో బ్యాటు ఝులిపించడంతో పాక్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది.


ఒమన్ కుదేల్:

నిర్దేశిత లక్ష్యఛేదనలో ఒమన్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. రెండో ఓవర్‌లో కెప్టెన్ జతిందర్‌సింగ్(1)తో మొదలైన ఒమన్ వికెట్ల పతనం ఆఖరి వరకు కొనసాగింది. హమ్మద్ మీర్జా(27), కలీమ్(13) మినహా ఎవరూ డబుల్ డిజిట్ మార్క్ అందుకోలేకపోయారు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లు పెవిలియన్ వెళ్లేందుకు పోటీపడ్డారు. ముఖీమ్, ఆయూబ్, అష్రఫ్ రెండేసి వికెట్లు తీశారు.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7(హరిస్ 66, ఫర్హాన్ 29, కలీమ్ 3/31, ఫైజల్ 3/34), **ఒమన్:** 16.4 ఓవర్లలో 67 ఆలౌట్(మీర్జా 27, కలీమ్ 13, అష్రఫ్ 2/6, ముఖీమ్ 2/7)

రోహిత్ ప్రాక్టీస్



ముంబై: టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్‌శర్మ రానున్న ఆస్ట్రేలియా పర్యటన కోసం పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలో పాసైన హిట్‌మ్యాన్ తాజాగా బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో బిజీగా గడిపాడు. శుక్రవారం ముంబైలో రోహిత్ బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చాడు. నెట్ బౌలర్ల సహాయంతో చాలాసేపు బ్యాటింగ్ చేస్తూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్‌మీడియాలో విరివిగా కనిపించాయి. 'ఇక్కడికి మళ్లీ వచ్చాను. ఇదేంతో బాగా అనిపిస్తున్నది' అని వీడియోలో రోహిత్ అన్న మాటలు వైరల్‌గా మారాయి. టీ20, టెస్టులకు ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన ఈ ముంబైకర్ వన్డేల్లో కొనసాగుతున్నాడు.

ఆర్చరీలో నిరాశే

గ్వాంగ్జు: ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో రికర్వ్ విభాగంలో పతకం సాధించాలన్న భారత ఆశలు ఆవిరయ్యాయి. ఈ క్యాటగిరీలో భారత పతక ఆశలు మోస్తున్న 15 ఏండ్ల గాథ ఖడ్కే.. మహిళల ప్రిక్వార్టర్స్ పోరులో నిష్క్రమించింది. గురువారం ఆమె.. 0–6తో పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు గెలిచిన ప్రపంచ నెంబర్ వన్ ఆర్చర్ లిమ్ సి హ్యోన్ (దక్షిణ కొరియా) చేతిలో చిత్తుగా ఓడింది. రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారి 2019లో రజతం గెలిచింది.

సెమీస్‌కు సాత్విక్ జోడీ

• **క్వార్టర్స్‌లో ఆయుష్ ఔట్**



హాంకాంగ్: ఇటీవలే ముగిసిన బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యంతో మెరిసిన భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి తమ జైత్రయాత్రను కొనసాగిస్తున్నారు. హాంకాంగ్ వేదికగా జరుగుతున్న హాంకాంగ్ సూపర్ 500 టోర్నమెంట్‌లో ఈ ద్వయం సెమీస్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ.. 21–14, 20–22, 21–16తో మలేషియాకు చెందిన అరిఫ్ జునైది–రాయ్ కింగ్‌ను మట్టికరిపించింది. 64 నిమిషాల పాటు సాగిన పోరులో 8వ సీడ్ భారత ద్వయం తొలి గేమ్‌ను నెమ్మదిగానే ఆరంభించింది. స్కోరు 12–12తో సమంగా ఉండగా భారత షట్లర్లు జోరు పెంచి వరుసగా ఐదు పాయింట్లు గెలిచి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లోనూ హోరాహోరీగా తలపడ్డ మలేషియా జంట ఆఖరిదాకా పోరాడి మ్యాచ్‌ను మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక గేమ్‌లో భారత జోడీ జోరు ముందు అరిఫ్–రాయ్ నిలువలేకపోయారు. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్21–16, 17–21, 21–13తోఆయుష్ శెట్టిపై గెలిచి సెమీస్ చేరాడు.

భారత్ శుభారంభం



బీల్(స్విట్జర్లాండ్): ప్రతిష్ఠాత్మక డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్–1లో తొలి రోజు భారత్ శుభారంభం చేసింది. స్విట్జర్లాండ్‌తో జరుగుతున్న పోరులో భాగంగా సింగిల్స్ విభాగంలో దక్షణేశ్వర్ సురేశ్.. 7–6 (4), 6–3తో తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన జెరోమ్ కిమ్‌ను ఓడించి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఇన్నాళ్లూ డబుల్స్ క్యాటగిరీలో ఆడిన దక్షిణేశ్వర్‌ను అనూహ్యంగా ఈ డేవిస్‌కప్‌లో సింగిల్స్ బరిలోకి దించగా అతడు తొలి ప్రయత్నంలోనే రాణించి తనపై జట్టు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

దసరాకు కొత్త చిత్రానికి శ్రీకారం



ప్రస్తుతం చిరంజీవి 'విశ్వంభర' 'మన శంకర వరప్రసాద్' చిత్రాలతో బిజీగా ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకర వరప్రసాద్' వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇదిలావుండగా చిరంజీవి కొత్త చిత్రం దసరా పర్వదినం సందర్భంగా అక్టోబర్ 2న ప్రారంభం కానుంది. ఈ సినిమాకు బాబీ కొల్లి (కె.ఎస్.రవీంద్ర) దర్శకత్వం వహిస్తారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. 'వాల్తేరు వీరయ్య' వంటి హిట్ చిత్రం తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది కావడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. 'మెగా158' వర్కింగ్ టైటిల్‌తో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. కెవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించనుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని సమాచారం.

ఆ ఉంగరం నా సెంటిమెంట్



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా ప్రేమలో ఉన్నారంటూ.. త్వరలోనే పెళ్లాడబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. తమపై వస్తున్న వార్తలను వీరిద్దరూ ఖండించకపోవడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరేలా చేసింది. దీంతో టాలీవుడ్ లవ్‌బర్డ్స్ అంటూ వీరిద్దరినీ ముద్దుగా పిలిచేసుకుంటున్నారు నెటిజన్స్. ఇదిలావుంటే.. ఈసారి ఏకంగా వీర్దిదరికీ ఎంగేజ్‌మెంట్ అయిందంటూ కథనాలొచ్చేశాయి. ఇటీవల ఓ వేడుకకు హాజరైన రష్మిక చేతికి ఓ కొత్త ఉంగరం కనిపించడంతో ఈ కొత్త రూమర్ మొదలైంది. దీంతో తన చేతికున్న ఉంగరంపై రష్మిక క్లారిటీ ఇచ్చారు. 'నిశ్చితార్థమైనా పెళ్లైనా అందరికీ చెప్పే చేసుకుంటా. రహస్యంగా చేసుకోవాల్సిన అవసరం నాకు లేదు. ఈ ఉంగరం నా సెంటిమెంట్. ఇది ధరిస్తే తెలీని మన శ్శాంతి. అంతేతప్ప ఇదేం నిశ్చితార్థపు ఉంగరం కాదు.' అంటూ వివరణ ఇచ్చారు రష్మిక.



డబుల్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది

'ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్‌ని అందించాలన్న మా ప్రయత్నం ఫలించింది. ఈ సినిమాకు విడుదలైన ప్రతీ సెంటర్‌లో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. మంచి కంటెంట్‌తో తీసిన సినిమాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని మరోసారి నిరూపించారు' అని అన్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహుగారపాటి నిర్మించిన హారర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ.. తప్పకుండా ఈ సినిమా మరో రేంజ్‌కు వెళ్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అనుకున్న దానికంటే డబుల్ ఇంపాక్ట్ రెస్పాన్స్ వస్తున్నదని, డిస్ట్రిబ్యూటర్స్ నుంచి ఆడియెన్స్ అందరూ హ్యాపీగా ఉన్నారని నిర్మాత సాహు గారపాటి పేర్కొన్నారు. ఈ విజయాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని, ప్రేక్షకులు యునానిమస్‌గా సినిమాను హిట్ చేశారని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ కూడా పాల్గొన్నారు.

'అవేంజర్స్' రేంజ్‌లో జై హనుమాన్'?

అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'కాంతార - చాప్టర్ 1' రేపు దసరాకు విడుదల కానుంది. దాదాపు 200కోట్ల భారీ బడ్జెట్‌తో కథానాయకుడు రిషబ్‌శెట్టి ఈ చిత్రాన్ని రూపొందించారు. దీని ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ 125కోట్లకు కొనుగోలు చేయడం విశేషం. ఈ సినిమా తర్వాత రిషబ్‌శెట్టి రెండు ప్రస్టేజియస్ ప్రాజెక్టులకు ఓకే చెప్పారు. టాలీవుడ్ డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ తెరకెక్కించనున్న 'జై హనుమాన్' వాటిలో ఒకటి కాగా, ఛత్రపతి శివాజీ బయోపిక్ రెండోది. వీటిలో 'జై హనుమాన్' స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయినట్టు సమాచారం. దసరాకు 'కాంతారా - చాప్టర్ 1' విడుదల అవుతున్న సందర్భంలోనే 'జై హనుమాన్'కు ప్రశాంత్ వర్మ కొబ్బరికాయ కొట్టేయనున్నారట. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుందని తెలుస్తున్నది. 'హను-మాన్' చిత్రాన్ని మించేలా 'జై హనుమాన్' ఉంటుందట. హాలీవుడ్ 'అవేంజర్స్' రేంజ్ కథ, కథనాలతో దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారట. ఊహించని అద్భుతాలు ఈ సినిమాలో ఉంటాయని, దేశం గర్వించే సినిమా అవుతుందని టీమ్ చెబుతున్నది. ఇందులో రిషబ్‌శెట్టి ఆంజనేయుడి పాత్ర పోషించనున్నారు. భారతచలనచిత్ర చరిత్రలో ఒక స్టార్ హీరో పూర్తిస్థాయిలో హనుమంతుడి పాత్ర పోషించడం ఇదే ప్రథమం. ఆ విధంగా రిషబ్ కొత్త చరిత్ర సృష్టించబోతున్నారనే చెప్పాలి. వచ్చే ఏడాది చివర్లో 'జై హనుమాన్' విడుదలయ్యే అవకాశం ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.





దక్షిణాదిలో సాయిపల్లవి క్రేజ్ ఏమిటో అందరికీ తెలిసిందే. సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటే ఈ తమిళ సోయగం బలమైన కథా చిత్రాలకే ప్రాధాన్యతనిస్తుంది. ఆమె ఒక సినిమాను ఒప్పుకుందంటే అందులో ఏదో ప్రత్యేకత ఉందని ప్రేక్షకులు నమ్ముతారు. తనదైన అద్భుతాభినయంతో దక్షిణాది ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకున్న ఈ భామ ఇప్పుడు హిందీలో కూడా సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నది. రణబీర్‌కపూర్ నటిస్తున్న 'రామాయణ' చిత్రంలో సాయిపల్లవి సీత పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది దీపావళికి ఈ సినిమా తొలిభాగం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ

తొలిహిందీ చిత్రం మేరే రహో

సినిమా కంటే ముందే సాయిపల్లవి హిందీలో ఓ చిత్రాన్ని అంగీకరించింది. అమీర్‌ఖాన్ మేనల్లుడు జునైద్ ఖాన్ అందులో కథానాయకుడు. సాయిపల్లవి నటించిన తొలి హిందీ చిత్రమిదే కావడం విశేషం. కొద్ది మాసాల క్రితమే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల విషయంలో జాప్యం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి 'మేరే రహో' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు చిత్రబృందం శుక్రవారం వెల్లడించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 12న విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది.

'రామాయణ'కోసం శాకాహారం



భారతీయ పురాణేతిహాసం రామాయణం ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'రామాయణ'పై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వెయ్యికోట్లకుపైగా వ్యయంతో రూపొందిస్తున్నారు. రణబీర్‌కపూర్ రాముడిగా, సీత పాత్రలో సాయిపల్లవి నటిస్తున్నారు. ఇప్పటికే సగభాగం చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమా కోసం హీరో రణబీర్‌కపూర్ తన జీవన శైలిలో చాలా మార్పులు చేసుకున్నారట. రాముడి పాత్ర తాలూకు పవిత్రతను దృష్టిలో పెట్టుకొని ఆహార విషయాల్లో కఠినమైన నియమాన్ని పాటిస్తూ నిష్ఠగా ఉంటున్నారట. షూటింగ్ పూర్తయ్యే వరకు మద్యపానానికి దూరంగా ఉంటానని ప్రమాణం చేశారట. అంతేకాదు ఈ సినిమా కోసం పూర్తి శాకాహారిగా మారిపోయి సాత్వికాహారం తీసుకుంటున్నారట. మరోవైపు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం సాధన చేస్తున్నాడని తెలిసింది. కూతురు రహా పుట్టిన తర్వాత తాను స్మోకింగ్ పూర్తిగా మానేశానని, ఇప్పుడు 'రామాయణ' సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత పూర్తి శాఖాహారిగా మారిపోయానని రణబీర్‌కపూర్ తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన 'రామాయణ' గ్లింప్స్ గ్రాఫిక్ హంగులతో ప్రేక్షకుల్ని మెప్పించింది. 'రామాయణ' తొలిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది.

నిర్మాతగా మారనున్న శర్వానంద్?



ప్రముఖ హీరో శర్వానంద్ నిర్మాతగా మారబోతున్నారు. త్వరలో సొంత నిర్మాణ సంస్థను స్థాపించి చిత్రాలను నిర్మించేందుకు సిద్ధమవుతున్నారాయన. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానున్నది. తన సొంత నిర్మాణ సంస్థ ద్వారా న్యూ టాలెంట్‌ని ఇండస్ట్రీకి పరిచయం చేయాలనే సంకల్పంతో శర్వా ముందుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. అలాగే.. ఆయన హోటల్ బిజినెస్‌లో కూడా అడుగుపెట్టాలనుకుంటున్నారట. హైదరాబాద్ నగర శివార్లలో భారీగా వెల్‌నెస్ సెంటర్ కమ్ లీజర్ రిసార్ట్ కట్టేందుకు శర్వా సమాయత్తం అవుతున్నారని తెలిసింది. ఓవైపు నటుడిగా బిజీగా ఉంటూ, మరోవైపు నిర్మాతగా, వ్యాపారవేత్తగా కూడా సత్తా చాటేందుకు శర్వా సిద్ధమవ్వడం ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పాఠశాల కోసం సొంత ఇల్లు



సంపాదించే ప్రతి పైసాలో కొంత భాగం సేవాకార్యక్రమాలకు వెచ్చించే మంచి బుద్ధి అందరికీ ఉండదు. అలాంటి మంచి మనసు అరుదైన వ్యక్తులకే ఉంటుంది. అలాంటి అరుదైన వ్యక్తే నటుడు, డాన్స్ మాస్టర్ లారెన్స్. ఆయన నెలకొల్పిన ట్రస్ట్ వేలాదిమంది జీవితాల్లో వెలుగు నింపింది. అనాథ పిల్లల ఆశ్రయం, ఆహారం, విద్య, సంరక్షణ ఇవన్నీ ఆ ట్రస్ట్ చూస్తూ ఉంటుంది. ఈ క్రమంలో తన సొంత ఇంటిని కూడా సేవా కార్యక్రమాల కోసం ఉపయోగిస్తున్నట్టు లారెన్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ వీడియోలో లారెన్స్ మాట్లాడుతూ 'కొత్త సినిమాకు అడ్వాన్స్ తీసుకున్న ప్రతిసారీ ఒక కొత్త సామాజిక కార్యక్రమం ప్రారంభించడం నాకు అలవాటు. ఈ క్రమంలో నా మొదటి ఇంటిని పిల్లల చదువు నిమిత్తం ఉచిత పాఠశాలగా మారుస్తున్నాను. ఈ విషయాన్ని తెలియజేసేందుకు గర్విస్తున్నా. ఇది డాన్స్ మాస్టర్‌గా నేను సంపాదించిన డబ్బుతో కొన్న తొలి ఇల్లు. అందుకే ఈ ఇల్లు నాకెంతో ప్రత్యేకం. దీన్ని ఓ మంచి కార్యానికి ఉపయోగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. నా ఇంట్లో పెరిగిన అమ్మాయే ఈ ఉచిత పాఠశాలలో తొలి ఉపాధ్యాయురాలు కానున్నది. ఇక సినిమాల విషయానికొస్తే.. 'కాంచన 4' అధికారికంగా మొదలైంది. అందర్నీ అలరించేలా ఈ సినిమాను తీర్చిదిద్దుతా.' అని చెప్పుకొచ్చారు లారెన్స్.



టాలీవుడ్ లేడీ సూపర్‌స్టార్ అనుష్క ఓ మంచి నిర్ణయం తీసుకున్నారు. కొన్నేళ్లుగా మీడియాకు

అనుష్క ఆకస్మిక నిర్ణయం

దూరంగా ఉంటున్న స్వీటీ.. తాజాగా సోషల్ మీడియాకు కూడా కొంతకాలం దూరంగా ఉండనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తానే స్వయంగా రాసి, పోస్ట్ చేశారు. 'నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలనుకుంటున్నా. అందుకే ఈ స్క్రోలింగ్ లైఫ్‌కు దూరం జరుగుతున్నా. ఇక నుంచి కొన్నాళ్లపాటు సోషల్ మీడియాకు నేను దూరం. త్వరలో మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకొస్తా.' అంటూ ఆ లెటర్‌లో పేర్కొన్నారు అనుష్క. ప్రస్తుతం ఈ లెటర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనుష్క అకస్మిక నిర్ణయం గురించి ప్రస్తుతం అంతా చర్చించుకుంటున్నారు.